ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 121 పేజీలు: 12 వెల: 6.50

100 మంది మహిళల కిడ్నాప్, ఎగుమతి!
గాజాపై అర నిముషంలో 50 బాంబులు
9లో

## పోలవరం-బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం

### శరవేగంగా అమరావతి నిర్మాణం

### 2027కు పోలవరం ప్రాజెక్టు పూర్తి

### గృహనిర్మాణ మంత్రి పార్థసారథి



ఆదివారం నెల్లూరులో మీడియాతో మంత్రి పార్థసారథి

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 1, ప్రభాతవార్త :** విజన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్ర పథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆదివారం యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి నెల్లూరుకు విచ్చేసిన మంత్రి పార్థసారథి పాత్రికేయులతో మాట్లాడారు. అన్నిరకాలుగా విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తూ సరికొత్త విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని, విజన్ 2047 ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచంలో ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత అందరూ 2047 విజన్ లక్ష్యాలను అందుకునేందుకు భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 7లక్షల కోట్లతో పెట్టుబడులు వచ్చాయని, పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో సుమారు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి చెప్పారు. టెక్నాలజీపరంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న సిఎం, ఐటి, సాఫ్ట్‌వేర్ కంటే కూడా మెరుగైన ఫలితాలు అందిస్తున్న క్వాంటమ్‌వ్యాలీ టెక్నాలజీనికూడా దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ అడ్వాన్స్ టెక్నాలజీతో లక్షలాదిగా ఉద్యోగాలు వస్తాయని, ఆధునిక టెక్నాలజీ >>2

# భారీగా 'ఆరోగ్య' బదిలీలు

### వైద్యులు, పారామెడికల్, ఇతర విభాగాల ఉద్యోగుల బదిలీలపై ఉత్తర్వులు

### 19లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశాలు

### ఒకేచోట ఐదేళ్లు పనిచేస్తే బదలీ ఖాయం

### పరిపాలనా సిబ్బందికి మూడేళ్లు



**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖలో వివిధ కేడర్లలో వైద్యులు, పారా మెడికల్,ఇతర విభాగాల ఉద్యోగుల బదలీలపై ఉత్త ర్వులు వెలువడ్డాయి. బదలీలు కోరుకునే వారు సంబంధిత పోస్టులో మే25నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. ఐదేళ్ళ నుండి పనిచేస్తున్న వైద్యులకు బదలీ తప్పనిసరి. ఎసిబి, విజిలెన్స్ కేసులు ఉంటే అప్రాధాన్య స్థానాల్లో పోస్టింగ్ ఇస్తారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పరిపాలనా కార్యాలయాల్లో పనిచేసే మినిస్టీరియల్ ఉద్యోగులకూ బదలీలు జరుగుతాయి. ఒకే చోట మూడేళ్ల నుండి ఐదేళ్ళ లోపు పనిచేస్తున్నట్లయితే వారిని స్థానికంగా ఉన్న మరో ఆఫీసుకు బదిలీ చేస్తారు. ఐదేళ్లు దాటితే పోస్టు స్థాయిని అనుసరించి వేరే ప్రాంతానికి బదలీ కావచ్చు. బదలీలు కోరుకునే వారు ఐదుఐచ్ఛికాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. బదలీ ప్రక్రియ మే 31తో పూర్తి కావాల్సి ఉండగా ఉత్తర్వులు ఆలస్యమయ్యాయి. అందుకనుగుణంగా జూన్ 19 వరకు ఈ ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చింది. ఆ తర్వాతి రోజు నుండి బదిలీలపై నిషేధ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయి. ఆదివారం నుంచి బదలీ ప్రక్రియను ప్రారంభించారు. ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పలువురు అధికారులుతో కీలక చర్చలు తరువాత బదలీ మార్గదర్శకాలు జారీ అయ్యాయి, మొదలైన వైద్య సిబ్బంది బదలీల ప్రక్రియ వైద్య,ఆరోగ్యశాఖలో 15,000 మందికి పైగా వైద్య సిబ్బంది బదిలీ అయ్యే అవకాశం రెండేళ్ల తర్వాత జరుగుతున్న సాధారణ బదిలీలతో సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకుంది.

జిల్లా స్థాయి అధికారులు తీసుకునే బదిలీ నిర్ణయాలపై శాఖాధిపతులను మంత్రి బాధ్యులుగా చేసారు. వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ సాధారణ బదిలీల ప్రక్రియను ఆదివారం ప్రారంభించింది. బదలీలవిషయంలో ఈశాఖకు సంబంధించి అనుసరించాల్సిన ప్రత్యేక విధివిధానాల్ని శనివారం(మే 31న) ప్రకటించడంతో ఈ ప్రక్రియ మొదలైంది. నేటినుంచి 20రోజుల్లో బదిలీలను పూర్తి చేయాల్సి ఉంటుంది. లక్షకు పైగా సిబ్బందికలిగిన ఈ మంత్రిత్వశాఖలో15,000 మందికి పైగా రెగ్యులర్ సిబ్బంది బదిలీ అయ్యేఅవకాశముందని ఉన్నతాధికారుల అంచనా. రెండేళ్ల తర్వాత వైద్యారోగ్య శాఖలో సాధారణ బదిలీలు చేపడుతున్నందున అన్నివర్గాల ఉద్యోగుల్లో ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది.

**విస్తృత చర్చల అనంతరం ప్రత్యేక నిబంధనలు**

మే 15న ఆర్థిక శాఖ జారీ చేసిన సాధారణ బదిలీల మార్గదర్శకాలలో ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఆయా మంత్రిత్వ శాఖలు కొన్ని ప్రత్యేక నియమాల్ని రూపొందించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించి కొన్ని ప్రతిపాదనల్ని ముఖ్యమంత్రి ఆమోదం కోసం ప్రతిపాదించారు. తదనంతరం క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలపై గత నెలాఖరులో చర్చించిన తరువాత నిన్న దాదాపు అర్ధరాత్రి సమయంలో బదలీ ఉత్తర్వులు విడుదల చేశారు. >>2



ఆదివారం పిఠాపురంలో రేషన్ సరకుల పంపిణీని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

# ఎక్కడి నుంచైనా ఇక రేషన్

### దుకాణాల ద్వారా 1.46 కోట్ల కుటుంబాలకు అందజేత

### వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్లవద్దకే పంపిణీ

### రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 1, ప్రభాత వార్త:** ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతుందని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలకు 29,761 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీకి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. లబ్ధిదారులు రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే కాకుండా... తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇంటింటికీ రేషన్ పేరిట గత ప్రభుత్వం దాదాపు రూ.17 వందల కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం చేస్తే... రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీతో దాదాపు రూ.385 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పని చేయాలని ఆయన సూచించారు. ఆదివారం ఉదయం పిఠాపురం పట్టణంలోని స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నూకాలమ్మ గుడి వీధిలో చౌకధరల దుకాణం వద్ద రేషన్ సరకుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో రేషన్ షాపులను పునః ప్రారంభించడం ఆనందంగా ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా 29,761 రేషన్ షాపులకు గానూ 24,795 షాపులు ఈ రోజు ఉదయం నుంచి సరుకుల పంపిణీని ప్రారంభించాయన్నారు.

**ఆదివారం కూడా సరుకుల పంపిణీ**

ప్రతి నెలా 1 నుంచి 15 తేదీ లోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయన్నారు. ఆ సమయంలో ఎప్పుడైనా లబ్ధిదారులు రేషన్ తీసుకునే వీలుంటుందన్నారు. గతంలో మాదిరి వాహనం కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దే ఉండాల్సిన అవసరం లేదు. వీలున్న సమయంలో రేషన్ దుకాణాల దగ్గరకు వెళ్లి సరకులు తెచ్చుకోవచ్చన్నారు. దివ్యాంగులకు, 65 ఏళ్లు నిండిన వృద్ధులకి ప్రతి నెలా 5వ తేదీలోపు సరుకులు ఇళ్ల వద్దే అందిచేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15.6 లక్షల మంది ఉన్నట్లు గుర్తించామని, వారికి రేషన్ అందించే బాధ్యత రేషన్ దుకాణదారులపై ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, రేషన్ డెలివరీ అయిన వెంటనే అందులో ఫోటో అప్ లోడ్ చేసేలా డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తూనికలో వ్యత్యాసం ఉన్నా, సరుకులు లేవని తిప్పి పంపినా డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు ఈపోస్, వేయింగ్ మెషీన్ల పని తీరును ముందుగానే పరిశీలించుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో సరుకుల పంపిణీ చేయాలన్నారు. సరుకుల పంపిణీ సమాచార కోసం కొత్తగా ఒక యాప్‌ను డిజైన్ చేశామని, ఏరోజు ఎంత రేషన్ పంపిణీ చేశాం?, ఎంతమందికి అందించాం?, వంటి విషయాలు >>2



డిజిపిగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తా

## పూర్తిస్థాయి డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా బాధ్యతల స్వీకరణ

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టాన్ని అతిక్రమించి విధులను నిర్వహించే దిశలో పోలీసు వ్యవస్థ ఉండదనే విషయం ప్రతి ఒక్కరు గ్రహించాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేసారు. ఒక నేరానికి ఎవ్వరు బాధ్యులైనా వారిని చట్ట ప్రకారం శిక్షించడానికి పోలీసులు వెనుకంజ వేయరన్నారు. పోలీసులను ఎవ్వరుప్రభావితం చేయరన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన చట్ట నిబంధనలు పోలీసు త్రికరణశుద్ధిగా అమలు చేస్తోందన్నారు. మానవ హక్కులకు ఎన్నడు భంగం కలిగించదన్నారు. రాజధాని ప్రాంతంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు దళాధిపతి(డిజిపి)గా హరీష్ కుమార్ గుప్తా పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు అభినందించారు. 1992 >>2



రాజేంద్రప్రసాద్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందజేస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

## తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి ఎన్టీఆర్

### నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందజేసిన మంత్రి

**విజయవాడ, జూన్ 1, ప్రభాతవార్త:** భారతీయ చిత్ర పరిశ్రమకు విశిష్ట సేవలు అందించిన మహా నటులు, తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి కీ.శే ఎన్టీఆర్ అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సామాజిక స్పృహతో ఆయన నిర్మించిన అనేక చిత్రాలు ప్రజల్లో జాగృతాన్ని నింపాయన్నారు. శ్రమ విలువ తెలిసినందునే ఆయన నటుడిగా. ప్రజానాయకుడిగా ఎదిగారన్నారు. దేశం అంతా ఎపి వైపు దృష్టి సారించే విధంగా ఆయన సంస్కరణలు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసారన్నారు. విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో గత రాత్రి బాగా పొద్దుపోయే వరకు ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన "పద్మశ్రీ డా.ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ప్రఖ్యాత రచయిత, ఎక్స్ రే వ్యవస్థాపకుడు కొల్లూరి అధ్యక్షతన జరిగిన సభలో ఈ సందర్భంగా విలక్షణ నటుడు రాజేంద్ర ప్రసాద్‌తో సహా ప్రతిభావంతులైన 35 మంది కళాకారులకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. సినిమా రంగంలో ఆల్ రౌండర్‌గా పేరొంది నటకిరీటిగా ప్రేక్షకులచే మన్ననలు పొంది 48 ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకున్న రాజేంద్రప్రసాద్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అవార్డు అందజేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా పురస్కారాలు పొందిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నటసార్వభౌమ కీ.శే ఎన్టీఆర్ కేవలం సినిమా రంగానికే పరిమితం అవకుండా ప్రజా జీవితం కోసం పాటుపడ్డ >>2





# రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు

### 40 విమానాలను ధ్వసంచేసిన ఉక్రెయిన్

### మాస్కో దాడులను విజయవంతంగా తిప్పికొట్టామన్న జెలెన్‌స్కీ

### నేడు ఇస్తాంబుల్‌లో శాంతిచర్చలు

**మాస్కో, జూన్ 1:** రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్‌దాడినిర్వహించింది. తూర్పు సైబీరియాలో ఆదివారం కేవలం మిలిటరీ బేస్‌పైనే ఫోకస్‌పెట్టి ఈ డ్రోన్‌దాడులుచేసింది. రష్యాలోని ఇర్కుట్స్క్ ప్రాంత గవర్నర్ ఈ దాడులను ధృవీకరించారు. శ్రీద్ని గ్రామంలో ఉన్న మిలిటరీ యూనిట్ లక్ష్యంగా దాడులుచేసిందని సైబీరియాలో ఈ తరహా దాడి మొదటిసారి జరిగిందన్నారు. సెక్యూరిటీసర్వీస్ ఆఫ్ ఉక్రెయిన్ భారీ ఎత్తున స్పెషల్ ఆపరేషన్‌చేపట్టిందని, 40 రష్యా విమానాలను ధ్వంసంచేసినట్లు ప్రకటించింది. రష్యా భూభాగంలోకి చొచ్చుకువెళ్లి మరీదాడులు చేసామని, ఏకకాలంలో ఎస్‌బియు రష్యా మిలిటరీ ఎయిర్ ఫీల్డ్‌లన్నింటిపైనా దాడులుచేసినట్లుతెలిపింది. వాటిలో >>2

# జెన్‌కోకు రూ.1973 కోట్లు నష్టం!

### సీలేరు పిఎస్‌పికి అటవీ అనుమతుల జాప్యం ఫలితం

### విద్యుత్ ఉత్పత్తికి నష్టం, ఐడిసి భారం

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి జెన్‌కోకు రూ.1973 కోట్లు నష్టం వచ్చినట్లు సంబంధిత శాఖా వర్గాల కీలక సమాచారం. ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్ట్ (పిఎస్‌పి) పనులకు అటవీశాఖ అనుమతులు ఇబ్బందిగా మారుతున్నందున ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. దీంతో ప్రాజెక్ట్ పనుల్లో జాప్యం చేసుకోనుంది. ఫలితంగా నిర్మాణ సమయంలో వడ్డీ (ఇంట్రెస్ట్ డ్యూరింగ్ కన్‌స్ట్రక్షన్-ఐడీసి),విద్యుత్ ఉత్పత్తి నష్టంకలిపి ఏడాదికి సుమారు రూ.1619 కోట్ల చొప్పున,ఇప్పటికే జాప్యం జరిగిన 15 నెలలకు రూ.1,973.75 కోట్లను జెన్‌కో నష్టపోవాల్సి వస్తుందని అధికారుల అంచనా.ఇంకా ఆలస్యమయ్యే కొద్దీ నష్టం పెరుగనుంది. రూ.12,264 కోట్లతో సీలేరులో 1350 మెగావాట్ల పిఎస్‌పి ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి...నిరుడు ఫిబ్రవరిలో గుత్తేదారు సంస్థకు లెటర్ ఆఫ్ అవార్డ్(ఎల్‌వోఏ) ఇచ్చారు.

అప్పటి నుంచి 60 నెలల్లో ప్రాజెక్ట్ పనుల పూర్తి చేయాలి. అనుమతుల జాప్యంతో ఇప్పటికీ పనులు మొదలుపెట్టలేదు. దీంతో 2028 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చెయ్యడం సాధ్యమయ్యేలా లేదు. పిఎస్‌పి ప్రాజెక్ట్ ఏర్పాటుకు అనుమతులు రాకుండానే వైఎస్సార్సీ ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. సాధారణ ఎన్నికలకు ముందుకు హడావుడిగా గుత్తేదారును ఎంపిక చేసి,ఎల్‌వోఏ ఇచ్చింది. ఆ తర్వాత కేంద్రం కీలకమైన పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. అయితే స్టేజ్-1 అటవీ శాఖ అనమతులు వచ్చిన తర్వాతే పనులు మొదలుపెట్టాలని నిబంధన విధించింది. కేంద్ర అటవీశాఖతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నా ఆ అనుమతులు రాక ప్రాజెక్ట్ పనుల్లో ముందడుగు వేయలేదు.'1350 మెగావాట్ల ప్రాజెక్టు నుండి రోజుకు సుమారు కోటి (10 మిలియన్) యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి వస్తుందని అంచనా.ఆ విద్యుత్ యూనిట్ సగటు ధర రూ.4.30 చొప్పున భావిస్తే...రోజుకు రూ.43 కోట్లు ఉత్పత్తి నష్టాన్ని జెన్‌కో భరించాల్సి వస్తుంది.

ప్రాజెక్ట్ నుండి ఏడాదిలో 330 రోజుల పాటు ఉత్పత్తి వస్తుందని భావిస్తున్నారు.ప్రాజెక్ట్ నిర్మాణ వ్యవధి(ఐదేళ్ళ)లో రూ.వెయ్యి కోట్లు ఐడిసి భారం పడుతుందని అంచనా. అంటే ఏడాదికి సగటున రూ.200 కోట్ల అదనపు భారం.ఎల్‌వోఏ ఇచ్చి 15 నెలలు గడిచినా ప్రాజెక్ట్ పనులు మొదలే కాలేదు. ఆ మేరకు గుత్తేదారుకు గడువు పొడిగించాల్సి వస్తుంది. ఈ వ్యవధిలో ఉత్పత్తి, ఐడీసీ కలిపి రూ.1,973.75 కోట్లు జెన్‌కో నష్టపోక తప్పని పరిస్థితి. ఇప్పటికప్పుడు అటవీశాఖ అనుమతులు వచ్చినా...వర్షాకాలంలో ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో ప్రతికూల పరిస్థితుల వల్ల పనులు ప్రారంభించడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు.

# ఎసిబి వలలో పోలీసు ఇన్‌స్పెక్టర్

### పాత కేసులో రూ 80వేలు లంచం డిమాండ్

### సహకరించిన హెడ్ కానిస్టేబుల్ కూడా అరెస్ట్

**కర్నూలు జూన్ 1 ప్రభాతవార్త :** బ్లాక్ మెయిలర్లను పట్టుకోవాల్సిన పోలీసులే... బ్లాక్ మెయిలర్లుగా మారి.. పాత విషయాలను అడ్డుపెట్టుకొని లంచం ఇవ్వాలంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో గత సంవత్సరంలో దాదాపుగా క్లోజ్ అయిన ఒక కేసును రీ ఓపన్ చేస్తానంటూ బెదిరించి లంచం అడిగారు. ఆ వ్యవహారంలో ఎసిబి అధికారులు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మధుసూదనగౌడ్, అతనికి సహకరించిన హెడ్ కానిస్టేబుల్ రవిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారులు చెప్పిన వివరాలు... బాధితుని కథనం మేరకు... వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నగరంలోని షరీఫ్ నగర్ ప్రాంతానికి చెందిన బెస్త రఘు అతని సోదరుడు రవికుమార్‌లు 2024 సంవత్సరంలో ఇతరులతో గొడవపడ్డారు. ఆ గొడవలో ఇరు వర్గాలకు గాయాలయ్యాయి. దీంతో అప్పటి ఫోర్త్ టౌన్ ఇన్స్పెక్టర్ శంక రయ్య ఇరువురిపై కేసు కట్టారు. దీంతో ఆ కేసులో ఇద్దరు ఒక >>2



ఆదివారం చిత్తూరులో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజా దండయాత్ర కార్యక్రమంలో సంతకాలు చేస్తున్న ప్రజలు


## ఆసుపత్రిపై ప్రజా దండయాత్ర

**చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రారంభమైన ప్రజా దండయాత్ర కొనసాగుతున్నది. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో సంస్థకు ఇచ్చిన లీజు అగ్రిమెంట్‌ను సత్వరం రద్దు చేసి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని మళ్లీ ప్రభుత్వ నిర్వహణలో వుండేలా చేయాలనే డిమాండ్‌తో పోరాట కమిటీ కన్వీనర్ శోభారాణి, కో-ఆర్డినేటర్, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు జానకారపల్లిలో ప్రజా దండయాత్ర కార్యక్రమంను నిర్వహించి ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సుమారు 2 వేల మందికి పైగా ప్రజలు హాజరై యాజమాన్యంకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు.

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపేలా చర్యలు తీసుకుని నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా వ్యతిరేక కమిటీ కో-ఆర్డినేటర్,టౌన్‌బ్యాంకు మాజీఛైర్మన్ పి.షణ్ముగం, కన్వీనర్ శోభారాణిలు మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో ఇప్పటి వరకు >>2

2-6pg2exHMNWJQE.qxd:2-6pg2exHMNWJQE.qxd 01/01/01 9:45 AM Page 1






ఆదివారం జమ్ము శివార్లలోని నగ్రోటాలో కాశ్మీరి పండిట్లకు భద్రతకోసం ఏర్పాటైన దళాలు

# బాధ్యతల స్వీకరణ

>> బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన హరీష్‌కుమార్ గుప్తా విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో కొనసాగుతూ ఇన్‌ఛార్జి డిజిపిగా అదనపు భాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఆయనను ఇటీవల డిజిపిగా పూర్తి స్ధాయి పదోన్నతి ప్రభుత్వం కల్పించింది. డిజిపి పదవీ భాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తా పదవీ విరమణ తేదీతో సంబంధం లేకుండా ఈ పదవిలో రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. గత నాలుగు నెలలుగా ఇన్‌ఛార్జ్ డిజిపిగా భాధ్యతలను నిర్వహిస్తున్న ఆయన పోలీసు శాఖలో తనదైన ముద్ర వేశారు.

ఈ ఏడాది జనవరిలో ద్వారకా తిరుమలరావు డిజిపిగా పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ హరీష్‌కుమార్ గుప్తాకే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఇన్‌ఛార్జ్‌గా ప్రభుత్వం భాధ్యతలు అప్పగించింది. ఇప్పటి నుండి హరీష్‌కుమార్ గుప్తా పూర్తి స్థాయి డిజిపిగా వ్యవహరించనున్నారు డిజిపిగా భాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను పలువురు సీనియర్ పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలోనే తాము బాధ్యతలను స్వీకరిస్తామన్నారు.రాష్ట్రంలో నేరాలను అరికట్టడంతో పాటు,ఆయా నేరాల్లో నిందితులకు కచ్చితంగా శిక్షపడే విధంగా చేస్తామన్నారు.



అగర్తలాలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు యేరుల్లా మారిన రహదారులు

# భారీగా 'ఆరోగ్య' బదలీలు

>> **ఈ విడత బదలీల్లో ప్రత్యేకాంశాలు**

దీర్ఘ కాలంగా ఒకే చోట పనిచేస్తున్న పరిపాలనా సిబ్బంది పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకే చోట మూడేళ్ల కంటే ఎక్కువకాలం పనిచేస్తున్న పాలనా సిబ్బందిని వేరే ప్రదేశాలకు బదిలీ చేయడం ఈవిడత నిబంధనల్లో ప్రధానాంశం. ఇలా చేయడం ఇదే మొదటిసారి. అదే విధంగా...ఒకే చోట మూడు నుండి తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధుల్ని అదేస్టేషన్లో వేరే కార్యాలయాలకుబదలీ చేస్తారు. ఖాళీలు లేనిపక్షంలో ఇతర ప్రదేశాలకు మారుస్తారు. ఈబదలీల్లో వివిధ కారణాలతో వేరే పోస్టుల్లో(మిస్‌మ్యాచ్) పనిచేస్తున్న వారిని సరైన పదవుల్లో నియమించడానికి ప్రాధాన్యతనిస్తారు. ఒకే చోట ఐదేళ్లకుపైగా పనిచేస్తున్న ఇతర సిబ్బందిని తప్పనిసరిగా బదలీచేస్తారు. అడిషన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ స్థాయి వైద్యుల్ని పరిపాలనా అవసరాలకనుగుణంగా మారుస్తారు.

**స్పష్టత కోసంస్పెషల్ మెమో**

స్పష్టత కోసం స్పెషల్ మెమో విడుదల చేసిన మార్గదర్శకాల్లో జిల్లా కేంద్రాల్లోని అడ్మినిస్ట్రేటివ్ యూనిట్లలో పనిచేస్తున్న పాలనా సిబ్బందిని బదలీ చేయాలనే సాధారణ ప్రస్తావన ఉంది. ఈ ప్రతిపాదన దురుపయోగమయ్యే అవకాశముందని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికొచ్చింది. ఈ నేపథ్యంలో పాలనా సిబ్బంది బదలీ కోసం పరిగణలోకి తీసుకోవాల్సిన కార్యాలయాలు (అడ్మినిస్ట్రేటివ్ యూనిట్లు), మరియు బదిలే చేయవలసిన పాలనా సిబ్బంది స్థాయి వివరాలపై స్పష్టతనివ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు మంత్రిత్వ శాఖ వివరణాత్మక మెమోని విడుదల చేస్తుంది.

**ఇటీవల జరిగిన బదలీలు**

2023 నుండి సాధారణ బదలీలపై నిషేధం అమలులో ఉంది. ఈ కారణంగా జూన్ 2024 నుండి వివిధ చోట్ల పనిచేస్తున్న దంపతుల్ని ఒక చోటకు చేర్చడం, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూసిబ్బంది పనిచేసే చోట సరైన చికిత్స అందుబాటులో లేనిపక్షంలో తగిన చికిత్స లభించే చోటకు మార్చేందుకు మాత్రమే వీలుగా ముఖ్యమంత్రి ఆమోదంతో బదిలీలు జరిగాయి. అదే స్ఫూర్తితో సాధారణ బదిలీలపై మే15న ఆర్ధిక శాఖ నిషేధాన్ని ఎత్తివేసినప్పటి నుండి ఆరోగ్య మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ దాదాపు 30 బదిలీ అభ్యర్థనల్ని ఆమోదించారు. ఇవి మొత్తం చేపట్టనున్న బదిలీల్లో కేవలం 0.20 శాతం.

**ఆరోగ్య మంత్రి ఆమోదించిన కొన్ని బదలీల వివరాలు**

కడప జిల్లాలోని ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రంలో పనిచేస్తూ మార్చ్ నెలలో వివాహమైన 12 రోజుల్లోనే భర్తను కోల్పోయిన ఒక డాక్టర్ ఈ క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబానికి దగ్గరగా ఉండేలా బదిలిచేయాలని చేసుకున్న విన్నపం, రాయ చోటిలో పనిచేస్తూ తీవ్ర కిడ్నీవ్యాధితో బాధపడుతూ డయాలసిస్ సదుపాయ మున్న చోటకు బదలీచేయాలన్న ఒక సీనియర్ అసిస్టెంట్ అభ్యర్థన, ముదిరిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బదలీ కోసం చేసిన మరో డాక్టర్ విన్నపం, శ్రీకాకుళం జిల్లాలోని ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న భర్తకు దగ్గరగా ఉండేందుకు నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలన్న ఒక మహిళా డాక్టర్ వేడుకోలు.

# దండయాత్ర

>>నిర్వహించిన ప్రజా దండయాత్ర కార్యక్రమంలో 26 వేల మందికి పైగా ప్రజలు హాజరై అపోలో యాజమాన్యంకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి లీజును రద్దు చేయాలని మద్దతు పలికి సంతకాలు చేశారన్నారు. సంతకాలు చేయడానికి వచ్చిన ప్రజల్లో తాము వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పడిన కష్టాలను కమిటీ సభ్యులకు వివరించారు. ప్రజా దండయాత్ర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా హాజరై అపోలో సంస్థకు ఇచ్చినలీజును రద్దుచేయాలని స్పష్టంగా పేర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సైతం ముందుకు వచ్చి ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

# నైజీరియాలో ఘోరప్రమాదం

## 21 మంది క్రీడాకారులు మృతి, 15 మందికి గాయాలు

**బగోటా, జూన్ 1:** నైజీరియాలో జరిగిన ఘోర ప్రమాదంలో 21 మంది క్రీడాకారులు, అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఒగున్ రాష్ట్రంలోని జాతీయ క్రీడలను ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కానో పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉనన దకాసోయే పట్టణంలో జరిగిందని పోలీసులు తెలిపారు. ఒగున్ రాష్ట్రరాజధాని అబే ఒకుటా నుంచి ప్రయాణిస్తున్న కోస్టల్‌బస్సు రాత్రంతా ప్రయాణించి ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఒక వంతెనపైనుంచి అదుపు తప్పి కిందపడిపోయింది. ఈ ఘటన సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణీకులు ఉన్నారు. వీరిలో 21 మంది ప్రాణాలుకోల్పోయారు. మిగిలిన 15 మంది తీవ్రగాయాల పాలయ్యారు. వారిని కురా జనరల్ ఆసుపత్రి, ముర్తాలా మహ్మద్ స్పెషలిస్ట్ ఆసుపత్రి, కానోలకు తరలించారు. మరణించినవారిలోయువ క్రీడాకారులు,సీనియర్ జర్నలిస్టులు, వైద్యసిబ్బంది, ప్రజాసంబంధాల అదికారి, క్రీడా నిర్వాహకులు ఉన్నారు.

# ఎక్కడి నుంచైనా ఇక రేషన్

>> ఎప్పటికప్పుడు నమోదయ్యేలా చూస్తున్నామన్నారు.లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేలా రేషన్ షాపుల్లో వద్ద భవిష్యత్తులో మరిన్ని మార్పులు తీసుకొస్తామని , సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఏదైనా సమస్య తలెత్తితే సులువుగా ఫిర్యాదు చేసేలా షాపు వద్దే క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ మాఫియాకు చెక్ పెట్టామని,ఎక్కడికక్కడ మాఫియా కోరలు పీకేశామన్నారు.కాకినాడ, విశాఖ పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు బియ్యం ఎగుమతి కాకుండా పటిష్టభద్రత ఏర్పాటు చేశామన్నారు.రైస్ స్మగ్లింగ్ చేసిన వారిపై పిడి యాక్ట్ తీసుకొచ్చామని,కాకినాడ పోర్టు దగ్గర ఏర్పాటు చేసినట్లే, నెల్లూరు జిల్లా తడ వద్ద, కృష్ణపట్నం పోర్టు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం ఎక్కడా పక్కదారిపట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**శ్రీ సకిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన**

అంతకుముందు పిఠాపురం పట్టణంలో సకిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు.వేదపండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, సివిల్ సప్లైస్ శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో లైంగిక దాడులపట్ల హోంమంత్రి సీరియస్

**విజయవాడ,జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లైంగిక దాడుల ఘటనలపట్ల హోంమంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నంలో బాలికపై లైంగిక వేధింపుల ఘటనపై ఆమె స్పందించారు. ఎస్పితో శనివారం మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో రిటైర్డు టీచర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి హామీఇచ్చారు. చిత్తూరు జిల్లా, రేణిగుంట మండలం, చెంగారెడ్డిలో జరిగిన దారుణంపై హోంమంత్రి సీరియస్‌అయ్యారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ ప్రసన్నకుమార్ అనే యువకుడిని వెంటనే పట్టుకుని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు హోంమంత్రికి పోలీసులు వివరించారు. ఆడపిల్లల జోలికివస్తే వారికి అదే చివరిరోజు అవుతుందన్నారు. స్త్రీశక్తి యాప్‌ను ఆడపిల్లలు వినియోగించుకోవాలన్నారు.ఈ సేవలు వాట్సప్‌లోను ఉంటాయన్నారు.

# తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి ఎన్టీఆర్

>> మనిషి అని కీర్తించారు. తెలుగు చిత్రసీమలో కామెడీ హీరో అనే పదాన్ని తీసుకొచ్చిన వ్యక్తి రాజేంద్ర ప్రసాద్ అని, అతను సంపూర్ణనటుడని ప్రశంసించారు. ముత్యమంతా ముగ్గు, ఆ నలుగురు, ఆహనా పెళ్లంట, రాంబంటు, చెట్టుకింద ప్లీడర్ తదితర చిత్రాల్లో రాజేంద్రప్రసాద్ అద్భుతమైన పాత్రను పోషించారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పివి నర్సింహరావు సైతం తనకు ఇష్టమైన నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారంటే ఆయన నటనను ఎంత పొగిడినాతక్కువే అవుతుందన్నారు. ఎన్టీఆర్ స్మారక అవార్డును రాజేంద్ర ప్రసాద్‌కు ఇవ్వడం కళామతల్లికి అందిస్తున్న గౌరవంగా భావిస్తున్నామన్నారు. నిడదవోలు నియోజకవర్గానికి చెందిన సూర్యకాంతంకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం లభించడంపై మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ప్రశంసించి అభినందించారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఇంట్లో జన్మించి,ఆయన మార్గదర్శనంలో ఆయన స్ఫూర్తితో తాను నటుడిగా ఎదిగానన్నారు. ఎపిలో ఎటువంటి హాస్యనటుడైన తనతో సరిపోరని.తన కన్నా ఏ మాత్రం గొప్పకాదని సంచలన వ్యాఖ్యలు చేసారు.

# గ్రామీణ రహదారుల ప్రాజెక్టుకు ఎఐఐబి నిధులు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ రహదారుల ప్రాజెక్ట్ ఏషియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) వాటా నిధులు ముందుగా (అడ్వాన్స్ సిస్టం) ఇచ్చేలా ఒప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించింది. ఢిల్లీలో రెండు రోజుల క్రితం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో బ్యాంకు వాటా నిధులు గతంలోలా అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ఏఐఐబీ అంగీకరించింది. దీంతో వైఎస్సార్సీ ప్రభుత్వంలో పూర్తిగా పడకేసిన రహదారుల పనులు తిరిగి ప్రారంభించి పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రహదారుల నిర్మాణం కోసం 2019లో ఎఐఐబి,అప్పటి టిడిపి ప్రభుత్వం సంయుక్తంగా రూ.4,500 కోట్ల అంచనాలతో ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాయి. ఇందులో బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం 70-30 నిష్పత్తిలో నిధులు సమకూర్చాలన్నది ఒప్పందం. తర్వాత వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకుండా ప్రాజెక్ట్‌ను భ్రష్టుపట్టించింది. బ్యాంకు అడ్వాన్స్‌గా ఇచ్చిన నిధులనూ ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో అడ్వాన్స్ విధానానికి బ్యాంకు స్వస్థి పలికింది. మొత్తంనిధులు ప్రభుత్వమే ఖర్చు చేసి లెక్క చూపాకే బ్యాంకు వాటా విడుదల చేయాలని నిర్ణయించింది. దీంతో రహదారుల పనులు పూర్తిగా పడకేశాయి. ఈలోగా ప్రాజెక్ట్ గడువు కూడ ముగిసింది.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏఐఐబీ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై ఇప్పటికే ముగిసిన ప్రాజెక్ట్ గడువును 2028 ఫిబ్రవరి వరకు కేంద్రం పొడిగించింది. పెండింగ్ రహదారుల పనుల పూర్తికి ఈ ఏడాది రూ.700 కోట్లు అడ్వాన్స్‌గా ఇవ్వాలని బ్యాంకును రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.300 కోట్లు సమకూర్చాలి. మొత్తం రూ.1000 కోట్లతో పెండింగ్ బిల్లులు చెల్లించి అసంపూర్తిగా నిల్చిపోయిన 600 రహదారులపనులు 2026 మార్చి లోగా పూర్తిచేయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే ఏడాది మరో 600 పనులు చేపట్టాలని యోచిస్తోంది. దీనివ ల్ల గడువులోగా రోడ్లపనులు పూర్తి చేయచ్చని అధికారుల అంచనా.మొదలవ్వని 1,300పనులు 'ఉపాధి'లో పూర్తి చేయాలనుకుంటు న్నారు. గడువు లోగా పనులు పూర్తి చేసే ఉద్దేశ్యంతో ప్రాజెక్ట్ అంచనాలను కూటమి ప్రభుత్వం రూ.4,500 కోట్ల నుంచి రూ.3,500 కోట్లకు తగ్గించింది.ప్రాజెక్ట్‌లో ఇప్పటికీ మొదలవ్వని 1,200 రహదారుల పనులు తాత్కాలికంగా పక్కన పెట్టి అసంపూర్తిగా నిల్చినవి మొదట పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఏఐఐబీ ప్రతినిధులు సమ్మతించారు. పక్కన పెట్టిన పనులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో దశల వారీగా పూర్తి చేస్తామని ఎఐఐబికి

# భారీగా పెరుగుతున్న కరోనా కేసులు

**న్యూఢిల్లీ, జూన్ 1 :** దేశంలో కొవిడ్ కేసులు క్రమంగా పుంజుకున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం దేశంలో 3,758 యాక్టివ్ కోవిడ్ కేసులు నమోదయ్యాయి. గత వారంతో పోలిస్తే ఇవి దాదాపు 1,200 శాతం పెరగడం విశేషం. మే 22న 257 యాక్టివ్ కేసులు ఉండగా, మే 26 నాటికి అవి 1,010కి చేరాయి. కానీ ఇవి శనివారం అమాంతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువగా ప్రభావితమైన రాష్ట్రాల్లో కేరళ ఉంది. ఇక్కడ కొవిడ్ కేసులు అత్యధికంగా ఉన్నాయి. రెండురోజులక్రితం 189 కొత్త కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 1400 యాక్టివ్ కేసులు ఉన్నాయి. మహారాష్ట్రలో 485, ఢిల్లీలో 436, గుజరాత్‌లో 320, కర్ణాటకలో 238, పశ్చిమ బెంగాల్‌లో 287, తమిళనాడులో 185, ఉత్తరప్రదేశ్‌లో 117 కేసులు ఉన్నాయి. రాజస్థాన్ (60), పుదుచ్చేరి (41), హర్యానా (26), ఆంధ్రప్రదేశ్ (17), మధ్యప్రదేశ్ (16) కేసులు నమోదయ్యాయి. ఈ సంవత్సరం ఇప్పటివరకు మొత్తం దేశంలో 26 మరణాలు నమోదయ్యాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) ప్రకారం పశ్చిమ, దక్షిణ భారత దేశంలో నమూనాల జన్యు విశ్లేషణలో కొత్త వేరియంట్లైన ఒమిక్రాన్ ఉప వేరియంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ వేరియంట్లు 2022లో భారతదేశంలో పెద్ద కరోనా వేవ్‌కు కారణమైన ఒమిక్రాన్ రకానికి చెందినవి. ఈ కొత్త వేరియంట్లలో ఎల్ఎఫ్.7,ఎక్స్ఎఫ్‌జి, జెఎన్.1,ఎన్‌బి.1.8.1 ఉన్నాయని ఐసిఎంఆర్ చీఫ్ డాక్టర్ రాజీవ్ బెహల్ తెలిపారు. వీటిలో మొదటి మూడు వేరియంట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దక్షిణ భారతదేశం నుంచి మొదలై, పశ్చిమ భారతదేశం ద్వారా ఇప్పుడు ఉత్తర భారతదేశంలో కూడా కేసులు క్రమంగా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కేసులన్నీ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి) ద్వారా పర్యవేక్షించబడుతున్నాయి. డాక్టర్ బెహ్ల్ ప్రకారం, ప్రస్తుతం కరోనా సోకినవారిలో లక్షణాలు స్వల్పంగా ఉన్నాయన్నారు. కొత్త వేరియంట్లు వచ్చినప్పుడు అవి సహజంగా లేదా వ్యాక్సిన్ ద్వారా వచ్చిన రోగనిరోధక శక్తిని దాటుతాయని, అయినప్పటికీ, ప్రస్తుతం ఆందోళన అవసరం లేదని డాక్టర్ బెహ్ల్ అంటున్నారు.

# రాయలసీమ సస్యశ్యామలం

>> కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. అమరావతి రాజధానిని అత్యద్భుతంగా తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయని, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నుంచి 2027 డిసెంబరులోగా పూర్తిచేసేలా పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించారని, 80వేల కోట్లతో పోలవరంబనకచర్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలవకుండా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సిఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరుజిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు జాతీయరహదారులతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎక్కడా లేనివిధంగా సమాజంలో పేదల అభివృద్ధికి సిఎం చంద్రబాబు చేపట్టిన పి 4 కార్యక్రమం ఒక విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలుకుతుందని మంత్రి చెప్పారు. సంపన్నవర్గాల వారు అట్టడుగున్న వున్న నిరుపేదలకు చేయూతనిచ్చి ఆ కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేసే గొప్ప కార్యక్రమం పి 4 అని మంత్రి చెప్పారు. ఈ వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర జిడిపి కూడా బాగా పెరిగి అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని మంత్రి ఆకాంక్షించారు. ప్రతిపక్షాలు కూడా తాము చేసిన తప్పులను సరిదిద్దుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

**త్వరలోనే అర్హులైన జర్నలిస్టుందరికీ అక్రిడిటేషన్ కార్డులు**

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందిస్తామని మంత్రి పార్థసారధి చెప్పారు. 2014లో సిఎం చంద్రబాబు హయంలో 21వేల అక్రిడిటేషన్ కార్డులు అందిస్తే, గత ప్రభుత్వం కేవలం 12 వేలు మాత్రమే ఇచ్చిందని మంత్రి చెప్పారు. అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందని, పూర్తిగా అధ్యాయనం చేసిన తరువాత ఈ క్యాబినేట్‌లో గానీ, వచ్చే క్యాబినేట్‌లోని చర్చించి వీలైనంత త్వరగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి వలలో పోలీసు ఇన్‌స్పెక్టర్

>> నిర్ణయానికి వచ్చారు. దీంతో కేసు దాదాపుగా ముగిసిపోయిందని అప్పటి ఇన్స్పెక్టర్ శంకరయ్య రఘుకు తెలిపాడు. ఆ మేరకు వారు కేసు వ్యవహారం తెగిపోయిందని ప్రశాంతంగా ఉన్నారు. అయితే తాజాగా నెల రోజుల క్రితం కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి రఘుకు ఫోన్ చేశారు. 2024లో మీ పై ఉన్న కేసు ఇంకా పూర్తికాలేదు... ఆ కేసు విషయమై మాట్లాడాలని స్టేషన్‌కు రమ్మన్నారు. స్టేషన్‌కు వెళ్లిన రఘు అతని సోదరుడు రవిలను ఇన్స్పెక్టర్ మధుసూదన గౌడ్ బెదిరించారు. ఆ కేసు ఇంకా క్లోజ్ కాలేదు.. నేను అనుకుంటే ఆ కేసులో మీకు 20 ఏళ్ల శిక్ష వేస్తానని బెదిరించారు. అలా జరగకూడదు అంటే లక్ష రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బెస్త రవి తెలిపారు. అయితే మొదట్లో రూ.10,000 లంచంగా ఇచ్చి తర్వాత చూస్తామంటూ బయటకు వచ్చారు. అయితే ఒప్పుకున్న మొత్తం కట్టాల్సిందేనట్టు పోలీసులు బాధితులను వేధించసాగారు. దీంతో వారు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. అనంతరం సాక్ష్యాల కోసం లంచం మొత్తంపై ఫోర్త్ టౌన్ పోలీసులతో బేరసారాలు జరిపించారు. ఆ బేరసారాలలో పోలీసులు దయ తలచి పదివేలు తగ్గించారు. దీంతో 80 వేల రూపాయలు లంచంగా ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఆ మేరకు ఆదివారం లంచం ఇస్తానని బాధితుడు పోలీసులకు చెప్పారు. ఆ విషయాలను ఎసిబి అధికారులు సాక్ష్యాలుగా రికార్డు చేసుకున్నారు. అదే క్రమంలో ఎసిబి అధికారులు నిఘా పెట్టి లంచం ఇచ్చేందుకు రంగంలోకి దిగారు. ఆ మేరకు హెడ్ కానిస్టేబుల్ రవి లంచం సొమ్ము తీసుకునేందుకు స్థానికంగా ఉన్న హోటల్‌కు రమ్మన్నాడు. అక్కడకు రాగానే బాధితుని నుంచి లంచంమొత్తం రూ. 80వేలు తీసుకున్నాడు. అప్పటికే కాపు గాసి ఉన్న ఎసిబి అధికారులు అతనిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, అతని చేతులకు కెమికల్‌టెస్ట్ చేసి, నగదు సీజ్‌చేశారు. ఆమేరకు ఆకేసులో ఏ1 ముద్దాయిగా ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్‌ను, ఏ2 ముద్దాయిగా హెడ్ కానిస్టేబుల్ రవినుచేర్చి లంచం తీసుకున్నట్లు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 02-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
సప్తమి రా.8.40
మఖ రా.10.59
వర్జ్యం ఉ.7.40-9.24, 2) 3.09-4.41
దు.ము.12.33-1.25, 2)ము.3.09-4.41
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** అన్ని విషయాలలో మౌనంగా వుండటం అన్నివిధాల శ్రేయస్కరం. ప్రయాణాలు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలుపొందుతారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** తొందరపాటు మాటలతో సన్నిహితులను దూరం చేసుకుంటారు. వివాహ ప్రయత్నాలు సాగిస్తారు.

**కర్కాటకం:**కుటుంబ సమస్యలుతీరి ఊరటచెందుతారు. వృత్తి- వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**సింహం:** ఉద్యోగ సమస్యలు తీరి మానసిక ప్రశాంతత పొందుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కన్య :** అనుకున్న పనులు నిదానంగా పూర్తిచేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా వుండవు.

**తుల :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన విభేదాలు కొంతవరకు పరిష్కరించుకుంటారు

**ధనుస్సు:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. అకారణంగా వివాదాలు ఏర్పడతాయి..

**మకరం:** రుణబాధలు ఎక్కువై చికాకులుపెడతాయి. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం తగదు.

**కుంభం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. వాహన

– శ్రీమతి [illegible] శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు

>>ఒలేన్యా, బెలాయా ఎయిర్‌ఫీల్డ్‌బేస్‌లు కూడా ఉన్నాయి. ఈ దాడిలో టియు 95, టియు 22ఎం3 బాండర్లు ఎ-50 ఎయిర్‌క్రాఫ్ట్‌లను ధ్వంసంచేసినట్లు ప్రకటించింది. శత్రుదేశం బాంబర్లను ధ్వంసంచేసేందుకు మరిన్ని దాడులు తప్పవని ప్రకటించింది. ప్రస్తుత దాడిలో 40కిపైగా రష్యా యుద్ధవిమానాలు ధ్వంసం అయినట్లు ఎస్‌బియు వెల్లడించింది.ఒలెన్యా ఎయిర్‌బేస్‌నుంచి అణ్వాయుధాలు మోసుకెళ్లేవ ఇమానాలుకూడా ఉన్నాయి. అయితే పూర్తిస్పష్టత ధృవీకరణ రష్యావైపునుంచి రాలేదు. అదే నిజమైతే రష్యాపై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది కూడా ఒకటి అని రుజువవుతుంది. ఉక్రెయిన్‌డ్రోన్‌దాడులకు ముందు రష్యా ఎయిర్‌ఫోర్స్ అధిపతి మాట్లాడుతూ రష్యా ఏకకాలంలో 109 డ్రోన్లు, ఐదు క్షిపణులను ఉక్రెయిన్‌లోకి ప్రయోగించిందన్నారు. ఉక్రెయిన్‌రాజధాని క్యీవ్‌తోసహా పలు నగరాలపై ఈ డ్రోన్లదాడులుజరిగాయి. ఈ దాడిలోజైటోమిర్‌లో ముగ్గురుపిల్లలుసహా 13 మంది చనిపో యారు. డజన్లకొద్దీగాయపడ్డారు. క్యీవ్, ఖర్కివ్, మైకోలైవ్, టెర్నోపిల్, ఖ్మెల్నిట్కీలపై దాడులుజరిగాయి. సరకు రవాణా ట్రక్కులపై అమర్చిన మొబైల్ చెక్క షెడ్లలో డ్రోన్‌లను దాచిపెట్టి, నిర్ణీత సమయాల్లో ట్రక్కుల పైకప్పులను రిమోట్‌గా తెరిచి, డ్రోన్‌లను ప్రయోగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రేపు ఇస్తాంబుల్‌లో ఇరు దేశాల మధ్య కీలక చర్చలు జరగాల్సి ఉంది.

# నామినేటెడ్ సభ్యులను ప్రభుత్వం తొలగించలేదు: హైకోర్టు

## వివిధ జిల్లాల డిఎల్‌డిఎ సభ్యుల తొలగింపు ఉత్తర్వుల కొట్టివేత

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్త ప్రతినిధి:** చట్టం,సొసైటీ బైలా నిబంధనలు అనుమతిస్తున్న సందర్భంలో మాత్రమే నామినేటెడ్ సభ్యులను పదవుల నుండి తొలగించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వారిని రాజీనామా చేయాలని కోరడం లేదా తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉండదని పేర్కొంది. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం (డిఎల్‌డిఎ) పాలకవర్గంలో నామినేటెడ్ సభ్యుల పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయాలని కోరడం,పదవుల నుండి తొలగించడాన్ని ఆక్షేపించింది. సభ్యులను తొలగిస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్,విజయనగరం,చిత్తూరు,పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది. రాజకీయ కారణాలతో నామినేటెడ్ సభ్యులుగా నియమితులైన వారిని పదవుల నుంచి తొలగించే విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ప్రకాశం జిల్లా పశుగణాభివృద్ధి సంఘ (డిఎల్‌డిఎ) పాలకవర్గంలో ఉన్న తనను తొలగిస్తూ జిల్లా కలెక్టర్ గత ఏడాది జూన్ 15న ఉత్తర్వులిచ్చారని కోసూరి రాధ అనే మహిళ వ్యాజ్యం వేశారు. తన పదవీ కాలం 2028 సెప్టెంబరు వరకు ఉందన్నారు. ఇదే తరహాలో తమనూ రాజీనామా చేయాలంటూ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయనగరం జిల్లాకు చెందిన బంగారునాయుడు,చిత్తూరు జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సుందరరావు వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. భాధ్యతలు చేపట్టినప్పటి నునండి ఐదేళ్ళ వరకు తమకు సభ్యులుగా/ఛైర్మన్‌గా కొనసాగే హక్కుందన్నారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి,నామినేటెడ్ సభ్యులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కాబట్టి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెబుతూ వ్యాజ్యాలను కొట్టేశారు.

# రేషన్ దుకాణాల్లో సరకు పంపిణీ

## రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన మంత్రులు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ ప్రారంభమైంది. 29,796 రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేస్తున్నారు.కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు చౌకధరల దుకాణాల్లో వీటిని అందచేస్తున్నారు. దివ్యాంగులు,65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నారు. పిఠాపురంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పంపిణీని ప్రారంభించారు. సత్యసాయి జిల్లా పెనకొండలో మంత్రి సవిత ప్రారంభించారు. వృద్దులు,దివ్యాంగుల ఇంటివద్దకే వెళ్లి ఆమె సరుకులు అంద చేశారు. కర్నూలులో మంత్రి టిజి భరత్,పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మంత్రి సంధ్యారాణి రేషన్ పంపిణీని ప్రారంభించారు.దాదపు ప్రతి జిల్లాలో ఆయా ఇన్‌చార్జిమంత్రులు,నియోజకవర్గాల కేంద్రాల్లో, మండలాల్లో ఎంఎల్‌ఏలు రేషన్ పంపిణీ కేంద్రాలను పంపిణీ చేసారు.

# శ్రీవారి అన్నప్రసాదం మెనూలో 'మామిడిజ్యూస్'

## సిఎం చంద్రబాబు ఆలోచన కార్యరూపం దిశగా అడుగులు





**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం వడ్డిస్తున్న మెనూలో అదనంగా మరో ద్రవపదార్థం చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తారా?ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా సానుకూలంగా స్పందిస్తారా!అనేది ఇప్పుడు ఆయన సొంతజిల్లాలో భారీ సంఖ్యలో మామిడిపండ్ల రైతులు ఆతృతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే భక్తులకు తిరుమలలోని అన్నదానభవనంలో అన్నప్రసాదాలు తోటాటు ఉల్లి,వెల్లుల్లిలేని మసాలావడ వడ్డిస్తున్న విషయం విదితమే. మరొకటి అదనంగా భక్తులకు మామిడిపండ్ల రసం కూడా అందించాలనేది చిత్తూరు,తిరుపతిజిల్లాలోని రైతుల కోరిక. మరీ ఇదే నెరవేరేందుకు చిత్తూరుజిల్లాలోని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ కూడా గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో విజ్ఞప్తి చేశారు. తాజాగా సిఎం చంద్రబాబు ఇదే అంశంపై టిటిడి బోర్డు కూడా సానుకూలంగా ఆలోచన చేయాలని సూచించారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మామిడిరైతులు పండించిన మామిడిపండ్లను ప్రాసెసింగ్‌చేసి రసం(జ్యూస్)గా ,గుజ్జుగా తయారు చేస్తున్నారు. అమెరికా దేశానికి కూడా గత ఏడాది వరకు మామిడిపండ్లను భారీగా ఎగుమతిచేశారు. దీంతో కొంతవరకు లాభాలు ఆర్జించిన రైతులకు ఈ ఏడాది అమెరికా దేశంలో ఎదురైన పన్నులభారంతో మన దేశంనుండి ముఖ్యంగా చిత్తూరుజిల్లాల రైతులు ఎగుమతి చేసిన మామిడిపండ్లను తిప్పిపంపారనే ఆవేదన రైతులు వ్యక్తం చేస్తున్నారు. అసలే గిట్టుబాటు ధరలేక మామిడిపండించిన రైతులు అపారనంతో ఉంటే ఇప్పుడు వారిని ఆదుకుంటే తప్ప కొంతవరకు పండించిన పంటకు ఆదాయం లేదనేది సిఎం వరకు తీసుకెళ్ళారు. దీంతో చంద్రబాబుకూడా రైతుల కష్టాలు తెలిసిన నేతకావడంతో టిటిడిపైనే ఆధారపడటం తప్పని సరిగా మారింది. కలియుగప్రత్యక్షదైవం ఏడుకొం డల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు ప్రతిరోజు లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. వీరిలో సరాసరి 80వేలమంది వరకు భక్తులు దేవదేవుని దర్శనం చేసుకుంటున్నారు.కాగా సాధారణ రోజుల్లోనే తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాలను 1.20లక్షల మంది భక్తులు స్వీకరిస్తున్నారనేది టిటిడి సమాచారం. వారాంతం, రద్దీపెరిగిన రోజుల్లో సరాసరి 1.50లక్షలమంది వరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఇలా వీరందరికి టిటిడి మెనూలో మామిడిపండ్ల రసం అదనంగా చేర్చితే భక్తులు కూడా సంతోషం చెందుతారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చిత్తూరుజిల్లాలోనే మామిడి మార్కెట్లు, వ్యవసాయ మార్కెట్‌లు, మండీలు .ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీల్లో ప్రతి ఏడాది మార్చినెలనుండి మామిడికాయలను భారీగా రైతులు తరలిస్తారు. ఇక్కడ అన్ని రకాల మామిడికాయలు తోతాపురి,బేనీసా, మల్లిక, ఆల్ఫొన్సా, ధరకూడా అంతంతమాత్రంగానే ఉంది. కిలో 12రూపాయల నుండి 25రూపాయల వరకు ఉంటుంది.

ఉమ్మడిచిత్తూరుజిల్లాలో చిత్తూరు రూరల్, పూతలపట్లు, పాకాల, చంద్ర గిరి, జిడినెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు. పుత్తూరు, నగరి, వడమాలపేట, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో విరివిగా మామిడితోటలు హెక్టార్లకొద్దీ విస్తరించాయి. ప్రతి ఏడాది ఐదు లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి ఉం టుంది. రైతులుపండించిన పంటకు గిట్టుబాటు ధర ఉండటం లేదు. ఉద్యానవనశాఖ కూడా మామిడిపంటలను ప్రోత్సాహించి పంటలను వేసేలా చూసింది. జిల్లాలో 31వరకు మామిడి ఫ్యాక్టరీలు ఉన్నాయి. మామిడిరైతులను ఆదుకునేందుకు టిటిడి సానుకూలంగా స్పందిస్తే తప్ప నష్టాలతో ఉన్న రైతులకు ఉపశమనం కలగదని జిల్లాలోని ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరీ సిఎం ఆలోచనలో పూతలపట్టు ఎమ్మెల్యే విజ్ఞప్తి ఎంత వరకు సఫలీకృతమవుతుందనేది చూడాల్సిందే.

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆలయంమీదుగా మళ్లీ విమానం



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ఆలయంమీదుగా ఆదివారం ఉదయం ఓ విమానం ప్రయాణించింది. ఉదయం 9గంటల ప్రాంతంలో తక్కువ ఎత్తులో విమానం వెళ్ళడాన్ని భక్తులు ఆందోళన చెందారు. ఆలయ నిబంధనలకు విరుద్దంగా విమానాలు వెళ్ళడాన్ని తప్పుపడుతున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తిరుమల ఆలయ భద్రత దృష్ట్యా తిరుమలపై విమానాలు ప్రయాణించకుండా చూడాలని అటు భక్తులు ఇటు అర్చకులు కోరుతున్నారు. ఆదివారం ఉదయం తక్కువ ఎత్తులో విమానం వెళ్ళడాన్ని భక్తులు నిశితంగా గమనించారు. ఆలయం మీదూగా ప్రయాణించిన విమానం ఎక్కడ నుండి వచ్చింది, ఎక్కడకు వెళుతోంది అనే వివరాలు టిటిడి విజిలెన్స్ సేకరిస్తున్నారు.

## వెంకన్న దర్శనానికి 23గంటలు



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగింపుదశకు చేరుకోవడం, వారాంతం సెలవులు కావడంతో సెలవుల్లో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు దేశం నలుమూలల నుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి.శ్రీవారి సాధారణ సర్వదర్శనానికి ఆదివారం ఉదయానికి (ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేనివారికి)23గంటలు సమయం కేటాయిస్తున్నారు. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 8గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో టిటిడి అధి కారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 49వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇదిలా ఉండగా శనివారం ఒక్కరోజే రికార్డుస్థాయిలో 95,080మంది భక్తులకు శ్రీవారి దర్శనం చేయించారు. సామాన్యభక్తులకు సకాలంలో దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులను సమన్వయం చేసుకుని భక్తులకు అసౌకర్యం లేకుండా చూస్తున్నారు.

## నేటి నుంచి కదిరిదేవరపల్లి పాసింజర్ పునఃపారంభం

**గుంతకల్లు రైల్వే,జూన్ 1,ప్రభాతవార్త:** రైల్వే భద్రతా పనుల కారణంగా గుంతకల్లు-కదిరిదేవరపల్లి-గుంతకల్లు మధ్య పాక్షికంగా రద్దు చేసిన రాయలసీమ జిల్లాల మీదుగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి మధ్య తిరిగే నెంబర్ 57405/06పాసింజర్ రైలు సర్వీసు లను ఈ నెల 2(నేటి) నుంచి పున:ప్రారం భిస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుపతి- కదిరిదేవంపల్లి వెళ్లే నెంబర్ 57405 పాసింజర్ నేటి నుండి ప్రతిరోజు ఉదయం గుంతకల్లు నుంచి 7.55/8.00గంటలకు బయలుదేరి బళ్లారి 9.48/50,రాయదుర్గం 11.03/05, కళ్యాణదుర్గం 11-45/46,కదిరిదేవరపల్లికి మధ్యాహ్నం 12-35గంటలకు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో కదిరిదేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 057406 పాసింజర్ నేటి నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 2..45గంటలకు కదిరిదేవరపల్లి నుంచి బయలుదేరి కళ్యాణదుర్గం 3.05/06,రాయదుర్గం 3.45/50, బళ్లారి సాయంత్రం 5.13/15,గుంతకల్లు 6.20/30కి బయలుదేరి తిరుపతి వెళుతుంది. ఇదిలా ఉండగా తిరుపతి-గుంతకల్లు-తిరుపతి మధ్య రాకపోకలలో ఎలాంటి మార్పు లేదు. ఈరైళ్లు గుంతకల్లు-కదిరిదేవరపల్లి-గుంతకల్లు మధ్య బంటనహాళ్లు,శంకర గుమ్మనూరు,బేవినహాళ్లు, సాకిబండ,వీరాపూర్, హగరి,బళ్లారి, ఓబుళాపురం, సోమలాపురం,ఆవులదట్ల స్టేషన్లలో నిర్ణీత వేళల్లో నిలుస్తుంది.

## మేలో రూ.వందకోట్లు దాటిన శ్రీవారి హుండీ ఆదాయం




**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వేసవిసెలవుల్లో దేశవిదేశాల నుండి భారీగా భక్తులు తరలివస్తున్నారు. గత మేనెలకు సంబంధించి 31రోజులకు గాను 23,77,076మంది భక్తులు గోవిందుని దర్శనం చేసుకున్నారు. కానుకల రూపంలో హుండీకి 106.20కోట్లు రూపాయలు ఆదాయం రాబడిలభించింది.ప్రతినెలా 110కోట్లు రూపాయల నుండి 120కోట్లు రూపాయల మధ్య ఉండే ఆదాయం మేనెలలో 106కోట్ల రూపాయలకే పరిమితమైంది. అయితే వరుసగా ఐదవనెలకూడా గత 31రోజుల హుండీ ఆదాయం వందకోట్లుదాటడం విశేషం. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకొన్న తరువాత కానుకల రూపంలో హుండీకి నగదు,నగలు సమర్పించుకోవడం పరిపాటి. ఇందుకు నిదర్శనంగా గతనెలకు సంబంధించి హుండీ ఆదాయం గమనిస్తే మేనెల 26వతేదీ సోమవారం హుండీ ద్వారా 5.09కోట్లు రూపాయలు, 21వతేదీ 4.24కోట్లు రూపాయలు, 20న 4.07కోట్లు, మేనెల 3వతేదీన 4.12కోట్లు వరకు ఆదాయం లభించింది. ఇక నెలలో వరుసగా సరాసరి 3కోట్ల రూపాయల పైగానే రోజువారీగాఆదాయం చేకూరడంతో 31రోజులకు సంబంధించి 106.20కోట్ల రూపాయలు మార్కును అధిగమించింది. రానున్న రెండునెలలు కూడా కీలకమే. స్వామివారి హుండీ ఆదాయం మరింత రెట్టింపయ్యే సూచనలు ఉంటుందనేది టిటిడి వర్గాల అభిప్రాయం. ఇక మేనెలలో తిరుమలకు చేరుకుని ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య 23.77లక్షల మంది వరకు చేరింది. మే 31న అనూహ్యంగా 95,080 మంది భక్తులకు రికార్డుస్థాయిలో వెంకన్న దర్శనం చేయించారు. 25న 91,538మందికి, 24న 90,211మందికి, మేనెల 17న 87,347మంది, 18వతేదీ 84,571మంది,3న 84,113మంది, 4న 83,380మంది భక్తులకు ఇలా సరాసరి రోజువారీగా 80వేలమంది వరకు భక్తులు మహాలఘులో గోవిందుడ్ని దర్శనం చేసుకునేలా టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు.

## వైఎస్సార్సీ వైఖరి మారే అవకాశం కన్పించడం లేదు: మంత్రి లోకేష్ ఆగ్రహం



**విజయవాడ,జూన్ 1,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎప్పటికి వైకాంగ్రెస్‌పార్టీ వైఖరి మారే అవకాశం కన్పించడం లేదని మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యాఖ్యానించారు.ప్రజల మధ్య సామరస్య వాతావరణాన్ని భంగపరిచి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో జగన్ వ్యవహరిస్తున్నారు.ఇబ్రహీంపట్నంలో వైకాపా కార్యకర్తల పైశాచికత్వంపైవ్యక్తం చేశారు. ప్రజలు తిరస్కరించినా వాళ్ళ తీరు మారట్లేదన్నారు. మాజీ మంత్రి ఇంట్లో శుభకార్యానికి వచ్చి..వాళ్ళు చేసిన పిచ్చి చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట శుభకార్యానికి వచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు వీరంగం సృషి ంచారు. ఆ మార్గంలో వెళ్తున్న ఓ బాలుడి సైకిలు లాక్కుని దారుణంగా ప్రవర్తించారు. సైకిల్‌ను గాల్లో తిప్పి,నేలకేసి కొట్టి కాళ్ళతో తొక్కుతూ పైశాచిక ఆనందం పొందారు. ఓ పక్క ఆ పిల్లాడు ఏడుస్తున్నా పట్టించుకోకుండా దుశ్చర్యకు పాల్పడ్డారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన షేర్ చేశారు. 'అబ్బే...వాళ్ళేమీ మారలేదు.. మారరు కూడ.. ఏ ముహూర్తాన సైకో అని పెట్టామో.. ఆ పేరును సార్థకం చేసుకోవడానికి నిరంతరం పనిచేస్తూనే ఉంటారు. అందుకే నాటికీ..నేటివకీ..ఎప్పటికీ అదో సైకో పార్టీ.. వాళ్ళకి సైకో నాయకుడు!ప్రజలు బుద్ధి చెప్పినా మారని వాళ్ళ ఆలోచనలను,చిన్న పిల్లాడ చేతి నుండి సైకిలు లాక్కొని దాన్ని తొక్కుతూ, విరగ్గొడుతూ చేస్తున్న వికృత చేష్టలను సమాజం మరింతగా అర్థం చేసుకోవాలని ఈ వీడియోను పోస్ట్ చేస్తున్నాను అని లోకేష్ పేర్కొన్నారు.

## శిథిలావస్థలో రైల్వే భవనాలు



### క్షణ క్షణం భయంతో రైల్వే కుటుంబాలు

**గుంతకల్లు రైల్వే,జూన్ 1,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ కేంద్రంలోని రైల్వే భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆయా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, రైల్వే క్వార్టర్స్ లలో నివసించే కుటుంబాలు క్షణ క్షణం భయం భయంతో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. ఇటీవల కాలంలో గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పైకప్పు పెచ్చులు విరిగిపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మరువక ముందే గుంతకల్లు రైల్వే డీజిల్ షెడ్‌లో సీనియర్ డిఎంఇ అధికారి చాంబర్ బయట ఆఫీస్ అసిస్టెంట్ కూర్చొనే చోట పైకప్పు పెచ్చులు విరిగిపడిన సంఘటన చోటుచేసు కుంది. అదృష్టవశాత్తు భోజన విరామం కావడంతో ప్రమాదం తప్పింది. కేవలం ఈ రెండు సంఘటనలే కాకుండ వెలుగులోకి రాని సంఘటనలు ఎన్నోఎన్నెన్నో. ఈ పరిస్థితి అనేక రైల్వే కార్యాలయాల్లో, రైల్వే సిబ్బంది నివాసాల(రైల్వే క్వార్టర్స్)తో పాటు అనేక రైల్వే భవనాలులోను ఇదే నెలకొని ఉంది. ఆంగ్లేయుల కాలంలో భవనాలు పెంకులతో నిర్మించారు. వాటిలో లీకేజీలు, ఈ తరహా సమస్యలు వంటివి లేకపోయిన, కాలవ్యవధి దాటినందున రైల్వే యాజమాన్యం వాటిని కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తుంది. అయితేప కొత్త భవనాలు నిర్మించిన కొన్నేళ్లకే మరమత్తులకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. డివిజనల్ కేంద్రంలో ప్రభాత్‌నగర్, వివినగర్,హనుమాన్ నగర్,ట్విన్ లైన్,అరవింద్ నగర్‌లలో రైల్వే భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఇక కాలనీలలో పరిశుభ్రత సరే సరి..వీటికి తోడు సిబ్బంది కొరత,కాలనీలలో రైల్వే భవనాల మరమత్తులను చేపట్టేందుకు ఇంజనీరింగ్, విద్యుత్,నీటి సరఫరా,కాలనీలలో పరిశుభ్రత పనులు చేపట్టేందుకు ఆయా విభా గాలలో రైల్వే సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో సంబంధిత ఉన్నతాధికారులు తమ తమ విభాగాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన కార్మికులను ఎంపిక చేసుకొని, పనులు చేపట్టి ఎలాగోలా నెట్టుకొస్తున్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యానికే వాహనాల రద్దు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా పంపిణీ వ్యవస్థని నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగమే వాహనాల రద్దు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. వ్యూహాత్మక ప్రతి ప్రజా ప్రయోజన వ్యవస్థలను ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.ఆదివారం హనుమాన్ జంక్షన్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నేటి నుండి మూడు రోజులు జరిగే రాజకీయ శిక్షణా తరగతుల్లో పాల్గన్న శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ అవినీతి జరుగుతుంది అనే పేరుతో రేషన్ సరఫరా చేసే వాహనాలను రద్దు చేసి నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అని అన్నారు. బియ్యం ప్రజలు అమ్ముకుంటున్నారు కనుక పెద్ద అవినీతి జరుగుతుంది అని ప్రభుత్వం సాకులు చెబుతుంది అని అన్నారు. అవినీతి జరిగితే అవినీతిని అరికట్టడానికి అనేక మార్గాలు ఉన్నాయని దానికి ఉదాహరణ తెలంగాణ ప్రభుత్వమే అని అన్నారు. ఆ ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేయడం ద్వారా అందరూ ఆ బియ్యాన్నే వినియోగించుకుంటున్నారని అనేది గమనించాలి అని అదే పద్ధతుల్లో మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని శ్రీనివాసరావు సూచించారు. నగదు బదిలీ అంటే ధరలు స్థిరంగా ఉండబోవని స్థిరత్వం లేని ధరల కారణంగా ప్రజలకు మరింత నష్టం జరుగుతుందని చెప్పారు. అనేక రకాల కుంటి సాకులు చెప్పి పౌర సరఫరా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుంది అని విమర్శించారు. ప్రభుత్వం చెప్పే సాకులు ఎలా ఉన్నాయంటే ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగలబెట్టుకున్న సామెతగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిపక్షాలతో, ప్రజలతో చర్చించి దానికి అనుగుణంగా దీని మీద శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 11 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని, వీటిని పీపీపీ పద్ధతిలో నిర్వహిం చడానికి కార్పొరేట్లకు 33 సంవత్సరాలు లీజుకి ఇవ్వడం అంటేనే పేదలకు ఉన్నత చదువులు దూరంచేయడమేనని అన్నారు. పాడేరులో ప్రారంభం కాబోతున్న మెడి కల్ కళాశాలలో ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అర్హత కలిగిన పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇప్పించాలి అని ప్రభుత్వమే కళాశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు మీడి యం అమలు జరిపి తెలుగులో పాఠాలు చెప్పా లని అంటే అది సాధ్యం కాదని చెప్పడం దుర్మా ర్గపు చర్య అని విమర్శించారు. ఈ విధానాల మీద మీరు పోరాటాలు చేస్తున్నారా? అని విలే కరులు శ్రీనివాసరావును అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ పోరాటం చేయాల్సింది తాము కాదని నష్టం జరిగే ప్రజలే పోరాటం చేస్తారని, దానికి తాము అండగా ఉంటామని దానిలో భాగంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఇప్పటికే పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి వై నరసింహారావు, బాపులపాడు మండలపార్టీ కార్యదర్శి బేత శ్రీనివాసరావు,రాజనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పనిష్మెంట్లపై పరిశీలన: ఉన్నతాధికారుల హామీ

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త:** జిల్లాల్లో అధికారుల కక్ష సాధింపుతో ఏకపక్షంగా ఉద్యోగులకు ఇచ్చిన ఛార్జిషీట్లు,పనిష్మెంట్లను పరిశీలిస్తామని, ఇవి పునరావృతం కాకుండా చూస్తామని,ఆర్టీసి ఉన్నతాధికారులు హామీనిచ్చినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన (ఎన్‌ఎంయూఏ) తెలిపింది. విజయవాడలో ఏన్‌ఎం యూఏ నేతలతో ఆర్టీసి ఈడీ(ఇంజనీరింగ్) చంగల్‌రెడ్డి,పలువురు ఉన్నతాధికారులు శనివారం చర్చలు జరిపారు. అన్ని గ్యారేజీల్లో ఉన్న ఖాళీలను ట్రేడ్ పరీక్షలు నిర్వహించి పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తామని,మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, బస్సుల బాడీ మార్పులను జోనల్ వర్క్‌షాపుల్లోనే చేస్తామని, అన్ని డిపోల్లో ఒకే రకమైన నిర్దేశిత నిర్వహణ విధానం అమలు చేస్తామని హామీనిచ్చినట్లు సంఘ నేతలు తెలిపారు. గ్యారేజీ సిబ్బందికి కూడ ఏటా ఒక సారి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.ఈ చర్చల్లో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీని వాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయలో ఆరో తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా 653 నవోదయ విద్యాలయాల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. దరఖాస్తు ఫీజు లేకుండా లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. అర్హతలో భాగంగా విద్యార్థులు 2025-26 సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండాలని, వయస్సు మే 1, 2014 నుంచి ఏప్రిల్ 30, 2016 మధ్య ఉండాలని తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ 13 న ఉదయం 11.30 గంటలకు, జమ్మూ కశ్మీర్ సహా పలు పర్వత ప్రాంత రాష్ట్రాల్లో 2026 ఏప్రిల్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## ఉత్సవమూర్తుల పరిరక్షణకే 12 నుంచి జ్యేష్టాభిషేకాలు



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు మూడు రోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు,కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఈనెల 12వతేదీ గురువారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు. హోమాలు, అభిషేకాలు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు వజ్రకవచం అలంకరిస్తారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు యధావిధిగా కైంకర్యాలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ముత్యాలకవచం ధరింపజేస్తారు. చివరగా మూడవరోజు 14వతేదీ శనివారం విశేష పూజలు,అభిషేకాలు జరిపించి మళ్ళీ బంగారుకవచం ధరింపజేస్తారు. బంగారుకవచంలోనే ఏడాదంతా విశేష పూజలు, ఉత్సవాలు జరిపించుకుంటారు. ఇప్పటికే జూన్‌నెలలో జరిగే ఈ మూడురోజుల జ్యేష్టాభిషేకాలకు ఆన్‌లైన్‌లో సేవా టిక్కెట్లు విడుదల చేశారు.

## శ్రీవారిమెట్టుమార్గంలో.. దారిమరల్చిన చిరుత



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** గోవింద నామంతో తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులను చిరుతపులి భయపెడుతోంది. గత వారం రోజుల్లో అలిపిరి కాలినడక మార్గంలో, మొదటిఘాట్‌లో వినాయకుడి గుడివద్ద భక్తుల కంటపడిన చిరుతను బంధించడానికి టిటిడి అధికారులు యాక్షన్ తీసుకుంటుండగా చిరుత దారిమరల్చి ఆదివారం ఉదయం ఏకంగా శ్రీవారిమెట్టుమార్గంలో నక్కిఉండటాన్ని భక్తులు కనుగొన్నారు. ఒంటరిచిరుతను బందించడానికి అలిపిరినడక మార్గంలో ట్రాఫ్ కెమెరాలు, హైఫ్లాష్‌లైట్లు అధునాతన పరికరరాలు ఏర్పాటుచేసి నిఘా ఉంచారు. చిరుతలు అధిక వెలుతురుకు రాకపోగా ఏకంగా శ్రీవారిమెట్టు మార్గంవైపు సంచరిస్తోంది. మెట్టుమార్గంలో ఆదివారం ఉదయం కొందరు భక్తులు 350వ మెట్టుకు సమీపంలోని పొదల్లో ఉండటాన్ని గుర్తించి వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. భక్తులు తీసిన వీడియోలను టిటిడి వాట్సాప్‌కు పంపారు. భక్తులు భయంతో పరుగులుతీశారు. చిరుతను తరిమివేయడానికి అటవీశాఖ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. కాగా నాలుగురోజుల క్రిందట తిరుమల దిగువఘాట్‌లో (మొదటి)వినాయకుడి గుడి వద్ద రక్షణగోడపై కూర్చుని ఉండటం, వాహనాల రాకతో వెలుతురుఫోకస్‌కు గోడపై వెళ్ళడం జరిగింది. మొదటిఘాట్‌రోడ్డు దాటడాన్ని వాహనదారులు గమనించారు. తిరుమల కొండల్లో చిరుతల సంచారం మళ్ళీ భయం గోల్పిస్తోంది. వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక, ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. చిరుతపులి సంచారంతో భక్తులు భయపడుతున్నారు.



## సహస్ర శీర్షపురుషునికి ప్రత్యేక సహస్రకలశాభిషేకం

**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తిని పల్లవరాణి సామవై ప్రతిష్టించిన రోజు గుర్తుగా ఆదివారం ఉదయం ఆలయంలో భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం నిర్వహించారు. ఆలయం లోపల గరుడాళ్వార్‌సన్నిధిలో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాస మూర్తిని, విశ్వక్సేనులను కొలువుదీర్చారు. శ్రీనివాసమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో అబిముఖంగా కౌతుకమూర్తి భోగశ్రీనివాస మూర్తిని ,ఆయనకు అభిముఖంగా విశ్వక్సేనుల వారిని ఉంచారు. అనంతరం మూలమూర్తిని భోగశ్రీనివాసమూర్తికి కలుపుతూ దారంకట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేదపండితులు వేదపారాయణం చేయగా, అర్చకులు ప్రత్యేక సహస్రకళశాభిషేకం ఏకాంతంగా వైభవంగా జరిపించారు. ఆర్జితసేవలన్నీ యధావిధిగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్‌దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ లోకనాథం, విఎస్‌ఒలు ఎన్టీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ఏవిఎస్‌ఒ రాజశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

వార్త

చాతుర్యం వల్ల కష్టాలను అధిగమించొచ్చు.
సోమరితనం కష్టాలను కొనితెస్తుంది.

-ఐ.జాన్సన్

# 'హార్వర్డ్'కి గ్రహణం!

ప్రపంచానికే మహోన్నత విద్యా వటవృక్షంగా పేరొందిన హార్వర్డ్ యూనివర్సిటీ మూలాలు ఒక్కసారిగా కూకటివేళ్లతో పీకేసేందుకు ప్రయత్నం జరుగుతోంది. 'అమెరికా ఫస్ట్' అన్నిటా అమెరికాయే, అమెరికన్లే ముందుండాలన్న సంకల్పంగొప్పదే. కానీ ఏదో కక్ష కట్టినట్లు, 'ట్రంప్' గురి చూసి కొట్టడాన్ని విద్యాలోకం హర్షించడం లేదు. ఒక సంస్థను నిలబెట్టడం ఎంతో కష్టం. కూల్చడం ఎంతో తేలిక అన్న అనుభవాలు ప్రపంచంలోనే ఎన్నిటినో చూస్తున్నాం. అందుకే ఇప్పుడు 'హార్వర్డ్' యూనివర్సిటీ విషయంలో జరుగుతున్న హానికర సందర్భాలు ఏవీ ప్రపంచ మేధావులకు రుచించడం లేదు. అసలిలా జరుగుతుందని ఎవరూ ఎప్పుడూ ఊహించరు. ఎవరికి ఎవరిపైనైనా, ఏసంస్థపైనైనా ఏ సందర్భంలోనైనా ఆగ్రహం కలుగవచ్చు. కాదనలేం. ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దేశాధినేతలు విద్యాప్రముఖులు విద్యనభ్యసించిన హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని కూల్చడమంటే క్షమించలేం. ఆ విద్యావ్యవస్థను నిర్మూలించడమే లక్ష్యంగా అమెరికా దేశాధినేత చేస్తున్న ప్రయత్నాలపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ నిర్ణయంలో దుస్సాహసముంది. ప్రపంచదేశాల్లో ఏ దేశంపైనైనా ఈర్ష్యా ద్వేషాలను వెళ్లగక్కడం ఆయనకు తగునేమో! కానీ స్వదేశంలో అందనంత ఎత్తు ఎదిగిన విద్యావృక్షాన్ని సైతం కూల్చాలనుకునే టెంపరి తనమేమిటో ఆయనకు కూడని పనిఅని సర్వే సర్వత్రా వినవస్తున్న మాట. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక 'జన్మ భూమిపై చూపిన ప్రేమను ఎవరూ విమర్శించలేదు. కానీ నిర్ణయాలను జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా ఆ 'వర్సిటీలో ప్రవేశాలపై ఆంక్షలు పెట్టారు. కానీ ఎందుకో మరో 30రోజులు గడువు ఇచ్చారు. తీరా ప్రవేశాలయ్యాక సదరు యూనివర్సిటీ డిగ్రీలు, పరిశోధనా పత్రాలు చెల్లవని ఆదేశం తరపున తీర్మానం చెబితే ఇంకేముంది. దేశవిదేశాల్లో అభాసుపాలయ్యేది అమెరికన్ హార్వర్డ్ యూనివర్సిటీయే. చదువుల్లో విద్యాసోపానాలుగా ఉండే విశ్వవిద్యాలయాల్లో రాజకీయ కలాపాలుండవని కానీ, ఔత్సాహిక విద్యార్థుల్లో సామాజిక స్పృహ ఉండదని కీర్తించలేము. అక్కడ కూడా ఓ చిన్న సైజు మానవాళి స్వరూప స్వభావాలు, వైషమ్యాలు ఉండనే ఉంటాయని చరిత్ర చెప్పేసత్యాలు. ఎన్నో కీలక ఉద్యమాలకు విశ్వవిద్యాలయాలు వేదికలైన సందర్భాలు, వాటిపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడమూ సర్వసామాన్యమే. గాజాలో జరుగుతున్న మారణహోమంపై అమెరికా ప్రభుత్వ పాత్రను నిలదీసే క్రమంలో ఆ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన సదస్సులు, నిరసనలు 'ట్రంప్'కు నచ్చనందునే హార్వర్డ్‌పై కన్నెర్రకు కారణమని బయటకు తెలుస్తున్న అంశం. 'హార్వర్డ్'ను లొంగదీసుకునేందుకు ఈ మధ్యనే కొన్ని నిధులను కూడా అమెరికా ప్రభుత్వంనిలిపివేసింది.

అంటే ఇవేవో ప్రచ్ఛన్న విషయాలేమీ కావు. హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ నేరుగానే యుద్ధం ప్రకటించారు. ఆ విజయంలో తాము విజయం సాధిస్తామనే ఆనందాన్ని వ్యక్తపరుస్తూ సామాజిక మధ్యమాల్లో అమెరికా అధ్యక్షుడి పోస్ట్ ఒకటివైరల్ అవుతోంది. 'యూదు వ్యతిరేక హార్వర్డ్‌కు ఇచ్చే గ్రాంట్లలో మూడు బిలియన్ డాలర్ల నిధులకు కోత విధించాలని అనుకుంటున్నట్లు ఆ పోస్టులో ఉంది. ఆ నిధులను ట్రేడ్‌స్కూళ్లకు మళ్లించే ఏర్పాటున్నట్లుఆయన వెల్లడించారు. విదేశీ విద్యార్థుల నుంచి ఫీజుల మూలకంగా సేకరించే మొత్తాలు విరాళాలు 'హార్వర్డ్'కు పెద్ద ఆదాయవనరు. ఆ యూనివర్సిటీ కేంద్రంగా రాడికల్ ఉద్యమాలు జరుగుతున్నాయని, అవే అమెరికాను బలహీనపరుస్తాయని సాకు చెప్పడాన్ని బట్టి ఓ ప్రఖ్యాత ఆంగ్ల రచయిత వాక్కు గుర్తుస్తోంది. 'పిచ్చికుక్కను చంపాలన్నా దానికి పిచ్చిదని పేరుపెట్టి చంపితేనే జనం హర్షిస్తారన్నది దాని సారాంశం. తాజాగా విశ్వవిద్యాలయాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యాన్ని హార్వర్డ్ యూనివర్సిటీ పాలకులు తిరస్కరించారు. అకడమిక్ స్వేచ్ఛకు ఇలాంటి నిర్ణయాలు ఆటంకాలని అటువైపు నుంచి జవాబురావడంతో ట్రంప్ ప్రభుత్వానికి మరీ మంటెక్కిపోయింది. కాగా ఈ ఒక్క యూనివర్సిటీ తప్ప మిగిలిన యూనివర్సిటీలన్నీ 'దర్యాప్తు' షరతులకు లొంగాయి. అందుచేత ఒకవేళట్రంప్ నిర్ణయాలపై హార్వర్డ్ చేయగలిగేది ఒంటరి పోరాటమే. పురాతన యూనివర్సిటీగా పొందిన అన్ని మినహాయింపులనూ రద్దు చేసే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉంది. దాదాపు ఆర్థిక దిగ్బంధనం చేసి పద్మవ్యూహం పన్నుతున్నట్లు అర్థమవుతోంది. ఇప్పుడు సదరు విశ్వవిద్యాలయాలో ఎంతమంది విదేశీ విద్యార్థులు ఉన్నారో వివరాలు అడిగింది. చైనా అధ్యక్షుడు జి-జిన్‌పింగ్ కుమార్తె జి. మింగ్జి తనఉనికి తెలియకుండా హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో సైకాలజీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమె ఇక్కడ చదువుకొనసాగిస్తున్నదీ లేనిదీ తేల్చేందుకే 'హార్వర్డ్'వారని విదేశీ విద్యార్థుల వివరాలు అడిగి ఉండొచ్చునని చర్చ జరుగుతోంది. చైనా వీసాలను రద్దు చేయడం వెనుక ట్రంప్ ఉద్దేశమేమిటో తెలియాల్సి ఉంది. దీని విషయమై హార్వర్డ్ పాలకుల వైఖరితెలిస్తే ట్రంప్ ఏమంటారో చూడాలి. ప్రస్తుతానికైతే హార్వర్డ్‌లో ప్రవేశాలు లేకుండా నిలువరించిన ఆదేశాలపై న్యాయస్థానం సస్పెండ్ చేసింది. ఈ వర్సిటీ యూదు విద్యార్థుల ప్రవేశానికి హార్వర్డ్ సానుకూలంగా లేదని హమాస్ అనుకూల సానుభూతిని ప్రోత్సహిస్తోందని, హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం నివేదికను సిద్ధం చేసింది. హార్వర్డ్ క్యాంపస్‌లో చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ కార్యకలాపాలకు సమన్వయం చేసుకుంటోందని హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టినోయెమ్ వివరిస్తున్నారు. హార్వర్డ్‌లో ఏడువేల మంది స్వదేశీ విదేశీ విద్యార్థుల భవితవ్యం ఏమిటో కాలమే చెబుతుంది.

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.



అబ్రహాంలింకన్

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టాన్‌స్లావిస్కి

# ప్రజావాక్కు



### బస్సులకు ఫిట్ నెస్ తప్పనిసరి

జూన్ రెండోవారం పాఠశాలలు తెరచుకోనున్నాయి. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదు. మంచి విద్యాసంస్థ ఎంపికతో పాటు తమ పిల్లలసురక్షిత ప్రయాణం కోసం ప్రైవేట్ సంస్థల వ్యాన్లు, బస్సుల ఫిట్నెస్, అనుభవజ్ఞులైన డ్రైవర్లు, నిబంధనల మేరకు వాహనం ఉన్నదాలేదా కూడా తప్పక ఆరా తీయాలి. విద్యార్థులుకూర్చునేందుకు అనువైనసీట్లు, ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర ద్వారం, అద్దాలు, కిటికీలకు ఇనుప జాలీలు, పిల్లలు బస్సు ఎక్కడం, దిగే సందర్భాల్లో బస్సు క్లీనర్ అందుబాటులో ఉండాలి. అన్ని జాగ్రత్తలు ఉంటేనే తమ పిల్లలు క్షేమంగా ఇంటికి చేరుతారు.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### విద్యావిధానాల్లో సమూల మార్పులు రావాలి

ప్రతి గ్రామంలోనూ ఈరోజుల్లో పదవ తరగతి పాసైన యువతులు ఉన్నారు. అంగన్వాడివ్యవస్థ ఒక కుళ్ళిపోయిన వ్యవస్థ. అవినీతి వ్యవస్థ. ఎల్కేజీ నుండి 5వ తరగతి వరకు ప్రతిపాఠశాలలో ఎలిమెంటరీస్కూల్‌ను ఆ గ్రామంలో పెళ్లి కాని యువతుల చేత రన్ చేయించాలి. ఆరవ తరగతినుండి ప్లస్టు వరకు (ఇంటర్మీడియట్ విద్య లేకుండా)హైస్కూల్ విద్యగానే మార్పులుచేసే ప్రతిసబ్జెక్టు వంద మార్కులుండేలాగా చూడాలి. అవసరంలేని ఆర్ట్స్ కామర్స్ సబ్జెక్టులు మూసివేయాలి. కాలంచెల్లిపోయిన డ్రిల్లు డ్రాయింగ్ క్రాఫ్ట్ పోస్టులను తీసివేయాలి. డ్రిల్ మాస్టర్లు లేదా ఫిజికల్ఎడ్యుకేషన్ టీచర్లుఎగరలేనివాళ్లు నడవలేని వాళ్లఈఆటచేతకాని వాళ్లని ఉద్యోగంనుంచి తీసివేయాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### టీచర్ల అభిప్రాయంతోనే నిర్ణయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక చర్చల్లో భాగంగా ఎస్జిటి ఉపాధ్యాయులకు టీచర్ల బదలీలను మాన్యువల్ కౌన్సిలింగ్లో మిగతా వారికి వెబ్ కౌన్సిలింగ్ద్వారా జరుపుతామని హామీ ఇచ్చారు. అయితే వివిధ ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులలో కొందరు మాన్యువల్ కౌన్సిలింగ్ కావాలని, మరికొందరు వెబ్ కౌన్సిలింగ్ కావాలని భిన్నాభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని ఉపాధ్యాయుల అభిప్రాయంతోనే నిర్ణయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### సబ్ జైలు ఏర్పాటు చేయాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సబ్ లేకపోవడం వల్ల ఇక్కడ నేరం చేసిన ఖైదీలు సమీపంలోని పరకాల ఖమ్మం జైలుకు వెళ్లాల్సి వస్తుంది గతంలో వరంగల్ జిల్లా కేంద్రంగా కారాగారం ఉండేది. దాన్ని కూల్చివేసి ఆ ప్రదేశంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది. నిత్యం భూపాలపల్లి జిల్లాలో నేరగాళ్లు వివిధ కేసుల్లో సంబంధం ఉన్నవాళ్లు జైలుకు వెళ్లాలంటే దూర ప్రదేశంలో ఉన్న జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ప్రజల సౌకర్యార్థం ఇక్కడనే సబ్ జైల్ నిర్మించాలి. సింగరేణి పరిధిలో నిత్యం అనేక ప్రమాదాలు ఆస్తి భూతగాథాలు గొడవలు జరుగుతాయి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

### జిల్లాల పేర్లు మార్పు

ఇటీవల కొన్ని జిల్లాల పేర్లు మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లా పేరు అంటే అది అక్కడి ప్రజల గుర్తింపు, చరిత్ర, సంస్కృతి ప్రతిబింబం. అలాంటి విషయాల్లో మార్పులు చేయడాన్ని ప్రజలు తేలికగా తీసుకోలేరు. ప్రభుత్వాలు పరిపాలనాసౌలభ్యం, ప్రజల అభిమతం, చారిత్రక నేపథ్యాలనుపరిగణనలోకి తీసుకునిపేరు మార్పులు చేస్తే, అవి సమర్థించదగినవే. కానీ ప్రజలతో సంపూర్ణ సంప్రదింపులు లేకుండా, రాజకీయ నిర్ణయాల నేపథ్యంలో మార్పులు చేయడమంటే ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధం. పేరు మార్పులపై నిర్ణయాలు తీసుకోవడం ముందు ప్రజాభిప్రాయం, చరిత్ర, స్థానిక సంస్కృతిని గౌరవించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### సంప్రదాయాన్ని పాటించాలి

ఈ కాలంలో ఆడపిల్లలు బాగాచదువుకోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన తరువాత వారికి వంటచేయడం చేత కావట్లేదు. వివాహమయిన తరువాత చాలా శ్రమపడవలసి వస్తోంది. ఏ కూర ఎలా చేయాలనేది తెలియక చరవాణిలో వంటలు యాప్‌లను చూసిచేస్తున్నారు. లేదా బయట నుంచిఆర్డర్లు ఇచ్చి తెప్పించుకుంటున్నారు. కొంతకాలానికి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. తల్లులందరికి మనవి చేసే దేమంటే ఆడపిల్లలకు అన్ని రకాల వంటలను చిన్నప్పటి నుండే నేర్పడం మొదలు పెట్టాలి. అన్నీ కృత్రిమమయితే జీవితం కూడాఅంతే కృత్రిమమవుతుంది. జీవితం రుచిమయంతో ఆత్మీయంగా అందరితో పాలుపంచుకోవాలంటే ఉన్నతమైన మన సంప్రదాయాన్ని పాటించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సింధునది జలాలు సంధికి వారధి కాగలవా?

**పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోతుంది. అనివార్యంగా పాకిస్థాన్ భారత్ దేశాన్ని సంధికొరకు ప్రాధేయపడవలసిన అవసరం వస్తుంది. పాక్ ఆక్రమిత కాశ్మీరును భారత్‌లో శాంతియుతంగా కలపటం లేదా పాకిస్థాన్ భారత్‌లో విలీననానికి అంగీకరించడం. ముఖ్యమైన టెర్రరిస్టులను భారత్‌కు అప్పగించడం, పాకిస్థాన్‌లోని అణ్వస్త్రాలను అంతర్జాతీయ అణుసంస్థకు అప్పగించడం లేదా పాకిస్థాన్ దుస్సాహసం చేస్తే ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయిలో అమలు చేయడం వలన కచ్చితంగా సింధునది జలాలు సంధికి లేదా పాకిస్థాన్ అనే శిశుపాల సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుంది.**



డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

జలం జీవనం, జలం సర్వ ప్రాణినాం ఉద్భవితే! జలమే సర్వస్య ములం, జలమే సర్వమయంచ!! అని నీటి ప్రాముఖ్యత తెలియచేస్తుంది ఈ శ్లోకం. మానవాళి మొత్తం నదుల వెంటనే నాగరికత, నగరాలు వెలిసి, ఒక నూతన ప్రపంచానికి పునాది వేసింది నదులు మాత్రమే. భారత దేశానికి పేరు ఇచ్చింది కూడా సింధు (ఇండస్) నది మాత్రమే. ఇండియాకు గుర్తింపుకూడా ఇండస్ నదుల ద్వారా మాత్రమే అని అర్థం అవుతుంది. మన జాతీయ గీతంలో కూడా స్పష్టంగా 'పంజాబ్, సింధు, గుజరాత మరాఠా, వింధ్య, హిమాచల, యమునా గంగా' అని స్పష్టంగా మనం పాడుతాం. ఒక విధంగా మన జాతీయ గీతం, మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. పూర్వ కాలంలో సింధు నది పరాయి ఆక్రమణ దారులకు ఒక జల రక్షణ కవచంలాగా ఉండేది. సింధునది భారత్, పాక్ మధ్య సంధికి లేదా పాకిస్థాన్ భారత్లో విలీనానికి ఎలా ఉపయోగపడుతుందో విశ్లేషిద్దాం. సింధు నదికి ప్రధానంగా ఆరు ఉపనదులు (ఇండస్, చీనాబ్, ఝులుమ్, రవి, బియాస్, సట్లెజ్) భారత్ హిమాలయాలలో మొదలై, భారత్‌లోని లడక్, జమ్మూ, కాశ్మీర్, హిమాచల్, పంజాబ్ మీదుగా, పాక్ ఆక్రమిత కాశ్మీర్, గిల్గిట్, పాకిస్థాన్‌లోని పంజాబ్, తర్వాత సింధ్ ప్రాంతంలో ప్రవహించి, అరేబియాన్ సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రాంతమే ఇండస్ వాలీ నాగరికతకు, భారత దేశ పునాదికి మూలం. ప్రతి ఏడాది హిమాలయాల నుండి సింధునది ద్వారా దాదాపు 6700-7700 (టీఎంసీ)జలాలు ప్రవహిస్తాయి. అందులో దాదాపు 75 శాతం -80శాతం భారత్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుండి ఉత్పత్తి అవుతుంటే, పాకిస్థాన్‌లో కేవలం 20-25శాతం, అది కూడా కేవలం రుతుపవనాల ఆధారిత వర్షాధారిత నీరుమాత్రమే. ఉదాహరణకు మొత్తం గోదావరి, కృష్ణ నదుల నీటి ప్రవాహం కేవలం 6000 టీఎంసీ నీళ్ల మాత్రమే. 1960 ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్ ప్రధాని నెహ్రూ పాకిస్థాన్ అధ్యక్షుడు ఫెయిల్డ్ మార్షల్ అయూబ్ ఖాన్ కరాచీలో ఒప్పందం చేసుకోవటం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం భారత దేశానికి 15శాతం, పాకిస్థాన్‌కు 85శాతం నీళ్ల వాటా, తూర్పు నదులు అయిన రవి, బయాస్, సట్లెజ్ భారత్‌కు, పడమర ఉన్న ఇండస్, చీనా బ్, ఝిలుమ్ పాకిస్థాన్ దేశానికి. భారత పడమర నదుల మీద కేవలం ఎలెక్ట్రిసిటీకి మాత్రమే ఉపయోగించాలి. భారత్‌దేశం తూర్పు నదులను వాడుకోకుండా 10 సంవత్సరాలు పాకిస్థాన్‌కు ఆటంకం లేకుండా నీళ్ల ఇవ్వాలి. పాకిస్థాన్‌లో ఇండస్ నది మీద ప్రాజెక్టులు, బ్యారేజీలు, కాల్వలు కట్టుకోవడానికి భారతదేశం 62 మిలియన్ పౌండ్స్ విరాళంగా ఇవ్వాలి. ఈ ఒప్పందం రెండు దేశాల మీద ఎలాంటి సమస్యలు ఉన్నా కొనసాగాలి. అలాగే పాకిస్థాన్ అనుమతి లేకుండా ఇండియా ఇండస్ మీద ఎలాంటి ప్రాజెక్టు కట్టగూడదు.

ఇంకో విస్మయం కల్గించే విషయం ఏమిటంటే, అప్పటికీ 1948లో పాకిస్థాన్ ప్రేరేపిత ట్రైబల్ ఆర్మీ కొంత జమ్మూ కాశ్మీరు, గిల్గిట్ బాల్తిస్థాన్ ఆక్రమించుకున్నాయి. సమస్య యునైటెడ్ నేషన్స్‌లో జటిలం అయింది. ఇండియా ఇండస్ పరివాహక ప్రాంతంలోని పైభాగానే ఉన్నాంకనుక, పాకిస్థాన్ భారత్ మీద ఆధారపడి ఉంది. అవసరం పాకిస్థాన్‌ది. ఇండియాది కాదు. ముందుచూపు లేకుండా 75శాతం పరివాహక ప్రాంతం భారత్‌లో ఉన్నా, 85శాతం హక్కు పాకిస్థాన్‌కు కల్పించడం హాస్యాస్పదం. అప్పుడు భారత దేశమే చిప్పపట్టుకొని అనేక దేశాల దగ్గర 'భవతి భిక్షాన్ దేహి' అని అడుక్కునే రోజులలో 62 మిలియన్ పౌండులు పాకిస్థాన్‌కు ఇండస్ నది మీద (పాకిస్థాన్‌లో) ప్రాజెక్టులు కట్టుకోవడానికి విరాళంగా ఇచ్చిన ఘనత మన జనహర్‌లాల్ నెహ్రూగారిది.



ఉదారణకు 62 మిలియన్ పౌండులకు 1960లో 154.42 మెట్రిక్ టన్నుల బంగారం వచ్చేది. (అప్పుడు ప్రభుత్వం దగ్గర ఉన్న మొత్తం బంగారం నిల్వ కేవలం 200-300 మెట్రిక్ టన్నులు మాత్రమే). ఇప్పుడు ఉన్న రేట్ ప్రకారం గ్రాముకు రూ.9606, అంటే రూ.1,46,899.75 కోట్లు (1.46లక్షల కోట్లు). మన నెహ్రూ పాకిస్థాన్‌కు విరాళం ఇచ్చారు. ఇది మొత్తం 10 విడతలలో ఇవ్వడం జరిగింది. నెహ్రూ గారిది ఎంత మంచి దాతృత్వం అంటే 1965లో పాకిస్థాన్ ఆపరేషన్ గిబ్రల్టర్ ద్వారా జమ్మూకాశ్మీర్ ప్రాంతంలోభారత దేశంపై యుద్ధానికి దిగినా కూడా నెహ్రూ గారు పాకిస్థాన్‌కు ఇచ్చేవిరాళం ఆపలేదు. సింధునది ద్వారా 90శాతంవ్యవసాయం, 5.2 కోట్ల ఎకరాలకు సాగు నీరు, (గోధుమ, వరి, పత్తి, చెరుకు), టెక్స్టైల్ పరిశ్రమ (60శాతంఎగుమతులవాటా), సిమెంట్, ఎరువుల తయారీ, 7000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, జీడీపీలో 30శాతం వాటా, మత్స్య సంపద, 15 కోట్ల మందికి తాగు నీరు సరఫరా, భూగర్భ జలాలపెంపు జరిగింది. ఒకవిధంగా చెప్పాలంటే మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు, పాకిస్థాన్ఆయు పట్టు సింధునదిలో ఉంది అంటే అతిశయోక్తి కాదు. ఇండస్ నదిజలాల ద్వారా భారతదేశంలో 2.3 కోట్ల ఎకరాలకు, పంజాబ్, హిమాచల్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్‌కు నీటిసరఫరా, 4300మెగావాట్ల హైడ్రోపవర్ ఉత్పత్తి. ఇది కేవలం ఇండస్ నదిపైన 15-20 శాతం మాత్రమే భారత్ తమ హక్కులను వాడుకుంటుంది. సింధు జలాలు చాలా శక్తివంతమైనవి. అందులో దాదాపు 50,000 మెగావాట్ల పవర్ దాగి ఉంది. అందుకే సింధు నది గురించి రుగ్వేదంలో నదీనాం శ్రేష్ఠా సింధురే గర్జతే ఇంద్రవత్ శుభా సరస్వతీ మపిత్యజ్య సింధుం వందే మహా జలమ్.. అంటే సింధునది అత్యంత శ్రేష్ఠమైనది, ఇంద్రుడిలా యుద్ధంలో గర్జిస్తోం ది, సరస్వతి కంటే తేజోవంతమైనది, ఈ మహత్తరమైన నదిని నేను నమస్కరిస్తున్నాను. అందుకే సింధునది జలాలు సంధికి శ్రీకృష్ణ రాయబారానికి మించిన జలఖడ్గం కాగలదు. సింధునదిపై భారత్ 'భారత్ సింధు అభియాన్' మొదలు పెట్టాలి. భారత్ సింధుజలాలుపూర్తిగా వినియోగానికి యుద్ధప్రాతిపదికన సన్నాహాలు మొదలుపెట్టాలి. వియన్నా కన్వెన్షన్ ఆన్ ట్రీటీస్ (ఆర్టికల్ 60) ప్రకారం ఇండస్ రద్దు లేదా పునఃపరిశీలన చేసే అధికారం భారత్‌కు ఉంది. ఇరిగేషన్, జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం, వెంటనే చీనాబ్, ఇండస్, రేఖలుమ్ నదులపై భుర్సార్ డ్యామ్, ఉర్జ్ మల్టీ పర్పస్ డాం, వాల్కోట్, జిస్పా, పాకాల కేట్, రాఫీ, కిరు శ్యాములు నిర్మాణం, ఇండస్ మీద శయోక్, సుబ్బా గ్లాసి యల్ కంట్రోల్ డ్యామ్ నిర్మాణం చేసి, నూతనంగా జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో 2.5కోట్ల ఎకరాల సాగునీటికి శ్రీకారం చుట్టాలి. ప్రధానంగా ఇంటర్ బేసిన్ లింక్ క్యానల్స్, టన్నెల్స్ అవసరం. అంతేకాకుండా అత్యల్ప ఖర్చుతో, సింధు జలాల నుండి దాదాపు 20,000అదనపు మెగావాట్ల ఉత్పత్తి చేయవచ్చు. దానికి రాట్ల, పాకుల్, కిరు, కీర్తయి, బుర్సుర్, క్వార్, నవాల్ కేట్, దుంకర్, తమాషా ప్రాజెక్టులను పూర్తిచేయాలి. అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయటానికి దాదాపు 2.5-3.5 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. భారత్ పాకిస్థాన్‌తో ఒక నెల యుద్ధం చేస్తే ప్రత్యేక్ష పరోక్ష ఖర్చు దాదాపు 58 లక్షల కోట్లు అయ్యేది. 90 శాతం పాకిస్థాన్ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, తాగు నీరు ఇండస్ నది మీద ఆధారపడి ఉన్నందున తీవ్రమైన సాగు, తాగు నీటి సమస్య ఉత్పన్నమైయ్యేవి. పాకిస్థాన్‌లోని పంజాబ్, సింధు ప్రాంతం నీటి ఎద్దడితో ప్రాంతాల మధ్య పోరాటాలు మొదలవుతాయి. 90శాతం పాకిస్థాన్ సైన్యం పంజాబ్ ప్రాంతం వారు కాబట్టి, సైన్యంమీద పూర్తి వ్యతిరేకత మొదలు అవుతుంది. పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోతుంది. అనివార్యంగా పాకిస్థాన్ భారత్ దేశాన్ని సంధికొరకు ప్రాధేయపడవలసిన అవసరం వస్తుంది. పాక్ ఆక్రమిత కాశ్మీరును భారత్‌లో శాంతియుతంగా కలపటం లేదా పాకిస్థాన్ భారత్‌లో విలీననానికి అంగీకరించడం. ముఖ్యమైన టెర్రరిస్టులను భారత్‌కు అప్పగించడం, పాకిస్థాన్‌లోని అణ్వస్త్రాలను అంతర్జాతీయ అణుసంస్థకు అప్పగించడం లేదా పాకిస్థాన్ దుస్సాహసం చేస్తే ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయిలో అమలు చేయడం వలన కచ్చితంగా సింధునది జలాలు సంధికి లేదా పాకిస్థాన్ అనే శిశుపాల సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుంది. అది అమృత్ కాల్, 2047. భారత దేశానికి స్వతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలకు లేదా అంతకు ముందు జరిగే అవకాశం ఉంది. దానికి ప్రధానంగా భారత్ ఆర్థికంగా ఇంకా బలపడాలి. అందుకు 140 కోట్ల భారత ప్రజలు 'అఖండ భారత్' స్థాపనకు సింధునది 'జలశక్తిని' సద్వినియోగం చేసుకోవాలి. ●

(రచయిత: మాజీ ఎంపి)

# మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్!

పుల్లూరు వేణుగోపాల్

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మెడికల్ టూరిజానికి గమ్యస్థానంగా మారుతున్నది. ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, నాణ్యమైన చికిత్స అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. ప్రతి సంవత్సరం వేలాది మంది విదేశీయులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు హైదరాబాద్ వచ్చి నాణ్యమైన చికిత్సలు పొందుతున్నారు. విదేశాల్లో సాధ్యం కానీ ఎన్నో కష్టమైన సర్జరీలు హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో విజయవంతంగా చేసి చూపిస్తున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే హైదరాబాద్‌లో చికిత్స ఖర్చులు అరవైశాతం తక్కువ. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, క్యాన్సర్ చికిత్స, కాస్మోటిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫెర్టిలిటీ చికిత్సలు, అవయవ మార్పిడి లాంటి ఎన్నో సంక్లిష్టమైన సర్జరీలను నిపుణులైన వైద్యులు, హెల్త్‌కేర్ సిబ్బంది హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో నైపుణ్యం గల డాక్టర్లతో పాటు విదేశీయులతో ఇబ్బంది లేకుండా ఇంగ్లీష్ మాట్లాడే డాక్టర్లు, హెల్త్‌కేర్ సిబ్బంది, అనువాదకులు ఉండడం, కాస్మోపాలిటన్ సంస్కృతి, సురక్షితమైన భద్రత, అనువైన వసతి ప్రయాణసౌకర్యాలు వంటివి అనుకూలంగా ఉండటంతో అనేకదేశాల నుంచి రోగులు నాణ్యమైన, విలువలతో కూడిన వైద్యం అందుతుందనే నమ్మకంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. వైద్య సదుపాయాల నాణ్యత, నైపుణ్యాలు మొదలగు అన్ని అంశాలు మెడికల్ టూరిజం అభివృద్ధికిదోహదపడుచున్నవి. కార్పొరేట్ ఆసుపత్రులు విదేశీయుల కొరకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేసి సిబ్బందిని, అనువాదకులను అందుబాటులో ఉంచి విదేశీయులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాదులో నాణ్యమైన చికిత్సలు అతిచౌకగా లభించడంతో విదేశీయులు ఇతర రాష్ట్రాలవారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రతి సంవత్సరం లక్షకుపైగా విదేశీయులు చికిత్స కొరకు హైదరాబాద్‌కు వస్తున్నారని అంచనా! 2024లో వైద్యసేవల కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులు 4.64 లక్షలు అయితే అందులో 1.51 లక్షల మంది హైదరాబాదులోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. దేశంలోని మెడికల్ టూరిజంలో హైదరాబాద్ వాటా 30 శాతం పైనే అని చెప్పవచ్చు. 120దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యేమిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్ మెడికల్ టూరిజంనుప్రమోట్ చేయడం జరుగుతున్నది. హైదరాబాదులో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్‌వరల్డ్ పోటీలకు వచ్చిన పోటీదారులందరితో గచ్చి బౌలిలోని ఏఐజి ఆసుపత్రిలో వైద్య పర్యాటకంపై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. మెడికల్ టూరిజం అభివృద్ధికి హైదరాబాదులో విస్తృతమైన అవకాశాలుండడంతో దీని ఆలంబనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. మెడికల్ టూరిజం అభివృద్ధికొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తూ విదేశీ పేషెంట్లకు అవసరమైన అనువాదకులను ప్రోత్సహించడం, వారు ఏవిధంగాను దోపిడికి గురికాకుండా చూడడం, వారి భద్రతకు అధికప్రాధాన్యత ఇవ్వడం, వారిసంస్కృతికి తగ్గట్టుగా ఆహారం అందేలా చూడడం, వారు ఖర్చు పెట్టే ప్రతి పైసకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తూ ఆచరణలో పెడుతున్నది. మెడికల్ టూరిజంలో అగ్రస్థానంలో ఉండడానికి కావలసిన అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెడికల్ టూరిజంరంగంలో సురక్షితమైన ఆదర్శవంతమైన వనరులతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. మెడికల్‌టూరిజం వలన మన ఆరోగ్య ఆర్థికరంగాలు బలోపేతమవుతున్నవి. హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్‌గా రూపుదిద్దుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. ●

# సాగులో కృత్రిమ మేధస్సు రైతుకు సహాయపడేనా?

జి. అజయ్ కుమార్

మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం మూల స్తంభం. ఇది కోట్లాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా మారింది. అయినప్పటికీ, వ్యవసాయం ఇప్పటికీ ఆశలతో నిండిన జూదంలా మిగిలిపోయింది. అతివృష్టి, అనావృష్టి, మారిన వాతావరణ పరిస్థితులు, ధరల అస్థిరత, నాణ్యమైన విత్తనాలు లేకపోవడం, మార్కెట్ సమాచారం కొరత వంటి అనేక సమస్యలు రైతు భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్- ఏ ఐ) రూపంలో కొత్త ఆశాకిరణం వ్యవసాయ రంగంలో కనిపిస్తోంది. ఇది రైతుకు, అనుభవజ్ఞానం, ఆధునిక విజ్ఞానం సమన్వయంతో ముందడుగు వేయడానికిదోహదపడుతోంది. వాతావరణ మార్పుల వల్ల పంట నష్టాలు అధిక పెట్టుబడి, ఖర్చు, అనిశ్చితమైన మార్కెట్ పరిస్థితులు, పంటలపై ముందస్తు సమాచారం, సలహాల లేమి వంటి ప్రధాన సమస్యలు రైతులు సాగులో ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనే ప్రయత్నంలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు రైతుకు ఎంతో దోహదపడుతాయి. భవిష్యత్తు వాతావరణ అంచనాలు, మట్టిలో పోషకాల విశ్లేషణ, తెగుళ్ల, వ్యాధుల గుర్తింపు, పంటల ఆరోగ్యం పర్యవేక్షణ, నీటి యాజమాన్యం, మార్కెట్ ధరల విశ్లేషణ ఇవన్నీ కచ్చితత్వంతో రైతుకు ముందస్తుగానే సులభంగా, చేరవేసే పరిస్థితిని ఏఐ కల్పిస్తుంది. ఏఐ వ్యవసాయానికి తోడ్పడుతున్న ముఖ్య రంగాలలో వాతావరణ విశ్లేషణ ఒకటి. ఏఐ ఆధారిత పరికరాలు వర్షపాతం, ఉష్ణోగ్రత, వాతావరణంలోని తేమ, లాంటి ఎన్నో అంశాలను శాస్త్రీయంగా అంచనా వేస్తాయి. దీని ద్వారా సాగు కాలాన్ని నిర్ణయించటం, నీటి నిర్వహణలో ముందస్తు చర్యలు విపత్కర వాతావరణానికి ముందుగానే తగినఏర్పాట్లు వంటివి ఉన్నాయి. అంతే కాకుండా మట్టిలో పోషకాలను కూడా తెలుపుతుంది. స్మార్ట్ సెన్సార్లు, ఏఐ పద్ధతుల ద్వారా మట్టిలో పోషకాల స్థాయిని గుర్తించి, దానికి అనుగుణంగా పంట ఎంపిక చేయడం ద్వారా దిగుబడిని పెంచుకోవచ్చు, పెట్టుబడులు తగ్గించుకోవచ్చు. ఏ ఐ ఆధారిత మొబైల్ యాప్‌లు (ఉదా: ప్లాంటెక్స్) మొక్కల ఫోటోను విశ్లేషించి తెగుళ్ల, వ్యాధులపై తక్షణ సమాచారాన్ని అందిస్తాయి, తద్వారా త్వరితగతిన నివారణ చర్యలు చేపట్టవచ్చు. అలాగే డ్రోన్ల ద్వారా తీసిన చిత్రాలను ఏఐ విశ్లేషించి మొక్కల నీటి



అవసరం, పోషక లోపాలు గుర్తించి, సరైన పరిష్కారాలు అందిస్తుంది. అలాగే గత ధరల డేటా ఆధారంగా ఏ ఐ భవిష్యత్తులో వచ్చే ధరలపై అంచనాలను చూపిస్తుంది. ఇది రైతుకు ముందస్తుగా మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందించడంలో తోడ్పడుతుంది. అలాగే ఏ పంట వేస్తే మంచి ధరలు పొందవచ్చో ముందుగానే తెలుసుకోవచ్చు. భారత దేశంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఏఐ సేవలు క్రాపిన్, ఫసల్, దేహత్, అగ్రి నెక్స్ట్ లాంటి కొన్ని దేశీయ సంస్థలు ఏఐ ఆధారిత వ్యవసాయ సేవలును ఇప్పటికే రైతులకు అందిస్తున్నాయి. ఇస్రో ఉపగ్రహ దృశ్యాల ఆధారంగా పంటల పర్యవేక్షణ, గూగుల్ ఎర్త్ ఇంజన్, ఐబియం వాట్సన్ లాంటి అంతర్జాతీయ టెక్నాలజీలు వ్యవసాయ రంగంలో వినియోగంలో ఉన్నాయి. బెంగళూరులోని సంస్థ అభివృద్ధి చేసిన 'కిసాన్ జిపిటీ' దేశీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర పథకాలపై పూర్తి సమాచారం అందిస్తోంది. దిగుబడుల పెరుగుదల - సరైన సమాచారం ద్వారా ముందస్తు జాగ్రత్తలతో సాగులో అధిక దిగుబడులు పొందవచ్చు. రసాయన వినియోగం తగ్గింపు - అవసరమైన సమయంలో అవసరమైన చోట మాత్రమే ఆగ్రి ఇన్పుట్స్ ఉపయోగించడంవలన పెట్టుబడి తగ్గించుకోవచ్చు. పంట నష్ట నివారణ - వాతావరణ హెచ్చరికలతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ముందుగానే పంట నష్టనివారణ చర్యలు చేపట్టవచ్చు. ఆర్థిక భద్రత - మార్కెట్ ధరల అవగాహన పరిసరాల రక్షణ - మట్టి, నీరు, జీవ వైవిధ్యం పరిరక్షణ చేపట్టవచ్చు. కొత్త వంగడాల సృష్టిలో కూడా ఏ ఐ తన పాత్ర పోషిస్తుంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో కరువు, వరదలు పెరుగుతున్నాయి. వీటిని తట్టుకోగల బలమైన వంగడాల అవసరం పెరిగింది. జనరేటివ్ ఏఐ సాయంతో కొత్త వంగడాల డిజైన్ వేగంగా చేయడం అధిక దిగుబడులు, వ్యాధుల నిరోధకత కలిగిన రకాలను అభివృద్ధి చేయడం జన్యు సమాచారం ఆధారంగా తగిన మార్పులు సూచించడం జరుగుతుంది. ఏఐ ద్వారా కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. గ్రామీణ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం లోపం ఏఐ సేవల ఖర్చు ఎక్కువగా ఉండడం, గ్రామాల్లో ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ లాంటి మౌలిక వసతుల కొరత స్థానిక భాషల్లో ఏఐ సేవలు అందుబాటులో లేకపోవడం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)అనేది కేవలం సాంకేతిక సాధనం మాత్రమే కాదు, రైతు కష్టానికి విలువను చేకూర్చే మార్గం. ఇది మట్టిని చూడగలిగే మెదడు, పంటను అంచనా వేయగలిగే దృష్టిమార్గం. కృత్రిమ మేధస్సు అనేది రైతుకు ప్రత్యామ్నాయం కాదు అది కేవలం రైతు కష్టాన్ని సులభ తరం చేయడానికి తోడుగా నిలిచే ఒక సాధనం. ఏఐని భవిష్యత్తు ధాన్యాగారంగా భావించి రైతుకు చెరువులో ఉంచాలి. అప్పుడే రైతు ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి చేరుకోగలడు. ●

## మూగజీవాల పట్ల కరుణ చూపాలి




**ఒంగోలు టౌన్, జూన్ 1, ప్రభాతవార్త**
సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిఆర్ఆర్ఎం హైస్కూల్ మైదానంలో మూగజీవాల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ సుజాతరావు మాట్లాడుతూ ఆకలి, దాహం తట్టుకోలేక అసహనంతో వీధి కుక్కలు మొరుగుతాయని, వాటి బాధను అర్థం చేసుకుని ఆహారం, త్రాగునీరు అందించాలన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ తాటిపర్తి దివ్య మాట్లాడుతూ ఇంటి ఆవరణలో గిన్నెలో నీరు పోసి వుంచినట్లయితే మూగజీవాలు సేద తీరుతాయని, అచేతనంగా పడి వున్న, గాయాలతో వున్న మూగజీవాలను గమనిస్తే 7075799899 సెల్ నంబర్‌కు ఫోన్ చేసిన స్పందిస్తామన్నారు. కార్యక్రమంలో కోసూరు శ్రీదేవి, మారెళ్ల సుబ్బారావు, చిక్కాల కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలు పున:ప్రారంభం

**ఒంగోలు టౌన్, జూన్ 1, ప్రభాతవార్త**
ఇంటర్ బోర్డు పరిధిలో అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు సోమవారం నుండి పున:ప్రారంభం అవుతాయని ఆర్ఐఓ సైమన్ విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు అవుతుందని, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం ద్వారా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించబడతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని తెలిపారు.

## చిట్టీలు, స్కీమ్‌ల దగాతో జనం గగ్గోలు

**ఒంగోలు టౌన్, జూన్ 1, ప్రభాతవార్త**
అనధికార చిట్టీలు, ఆకర్షణీయ స్కీమ్‌లకు జనం బలైపోవడం చూస్తున్నాం. విజయవాడలో గోల్డ్ షాప్ యజమాని స్కీమ్ పేరుతో వసూళ్లకు పాల్పడి పారిపోయాక సర్వత్రా చర్చ మొదలైంది. ఇదే విషయమై పౌర సమాజం కన్వీనర్ జి.నరసింహారావు ప్రభాతవార్తతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి చిట్టీల తతంగం జనాన్ని గుల్ల చేస్తోందని, బంగారంపై జన ఆకర్షణను సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు స్కీమ్‌ల పేరుతో మోసగిస్తున్నారన్నారు. బెట్టింగ్ యాప్‌లు, చిట్టీలు, స్కీమ్‌లు ప్రజలకు శాపంగా మారాయని, ఆర్థిక క్రమశిక్షణ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వ్‌బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీల పేరుతో వసూళ్ళపై కొరడా ఝులిపించాలన్నారు. వాయిదాల పద్ధతి ఆశ చూపుతున్న వ్యాపారులు, సంస్థలపై నిఘా పెట్టి సామాన్యులు బలికాకుండా చూడాలన్నారు. కార్పొరేట్ ఫ్రాడ్స్ వాచ్ కృషి సత్ఫలితాలు ఇచ్చిందని, ఆర్థిక నేరాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలను ప్రజలు తెలుసుకోవాలన్నారు.

## ప్రజల పక్షాన నిలుస్తాం - గుజ్జుల ఈశ్వరయ్య

**ఒంగోలు టౌన్, జూన్ 1, ప్రభాతవార్త**




ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య స్పష్టం చేశారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో సిపిఐ ఒంగోలు నగర మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ స్వయం ప్రకటిత దేశ భక్తులుగా పోజు కొడుతున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ వల్లనే దేశానికి కష్టాలు అని, కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తూ సామాన్యులను దగా చేస్తున్నారన్నారు. ఆగస్టు మాసంలో జరిగే రాష్ట్ర మహాసభలలో ఎన్‌డిఎ సర్కార్ మోసాలను ఎండగట్టి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జిల్లా సమస్యలపై దర్శిలో జరిగే జిల్లా మహాసభలలో చర్చించి రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సభకు కె.అంజయ్య, ఇస్తర్ల నరసింహారావు, సిహెచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, పార్టీ నేతలు ఆర్.వెంకట్రావు, రామకృష్ణ, ముదివర్తి రాఘవరావు, కారుమూడి నాగేశ్వరరావు, నూనె మోహన్‌రావు పాల్గొన్నారు.

## మినిలార్డ్స్ మైదానంలో పురుషుల క్రికెట్ సెలెక్షన్స్

**ఒంగోలు, ప్రభాతవార్త**





ప్రకాశం జిల్లా ఒంగోలులో మంగమూరు రోడ్డు నందు గల మినిలార్డ్స్ మైదానంలో పురుషుల క్రికెట్ సెలెక్షన్స్ యు19, సీనియర్స్ సెలెక్షన్స్ జరిగినాయి. సెలెక్ట్ అయినా క్రీడాకారులు జూన్ 4 నా ములపాడులో జరిగే అంతారు జిల్లాల పోటీలో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొంటారు. అలాగే బాలికల సెలెక్షన్స్ యు15, యు19 సెలెక్షన్స్‌కి 30 మంది బాలికలు హాజరు అయినారు సెలెక్ట్ అయినవారు జూన్ 10 నుంచి మంగళగిరి లో జరిగే అంతారు రాష్ట్ర డిస్ట్రిక్ పోటీలలో పాల్గొంటారు. ఈ సెలక్షన్ కీ సెలెక్టర్‌గా మాజీ ఆంధ్ర రంజీ క్రీడాకారుడు శరత్ సెలెక్టర్‌గా వ్యవహరించాడు. అలాగే ఈ సెలెక్షన్స్‌లో ప్రకాశం డిస్ట్రిక్ సెక్రటరీ కరుసల నాగేశ్వరరావు, ట్రెజరర్ హనుమంతరావు మెంబెర్స్ బలరాం, రాము, మహేష్, రామకృష్ణ,కోచ్‌లు పాల్గొన్నారు.

## శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలులోని స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ మీద శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించినట్లు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ ఎముకలు, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి ఉచితంగా బిపి, షుగర్, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, పల్స్ ఆక్సీమీటర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరం నందు ప్రముఖ మెదడు, వెన్నెముక, నరముల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు న్యూరో సర్జన్ డాక్టర్ షేక్ వలి బాబు తమ వైద్య సేవలు అందించారు. డాక్టర్ షేక్ వలి బాబు గారు మాట్లాడుతూ ప్రతిరోజు 45 నిమిషాల నడక వలన మెదడుకు రక్తప్రసరణ బాగా జరుగుతుందని తద్వారా అల్జిమర్స్, డిమన్షియా, ఆందోళన, డిప్రెషన్ వంటి వ్యాధులు తగ్గి ఆలోచన శక్తి పెరుగుతుందని తెలియజేశారు. అలాగే శరీర ధారణ మెరుగవుతుందని, వెన్నుపూసని బలపరిచి బ్యాక్ పెయిన్ నడుము నొప్పిని తగ్గిస్తుందని, నడక నరాలకు మెరుగైన రక్తప్రసరణ అందించి నరాల పనితీరును మెరుగుపరుస్తుందని, నడక వలన ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించుకోవచ్చని తెలియజేశారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అన్ని రకాల తలదెబ్బలకు, వెన్నెముక, మెదడు సర్జరీలు అత్యాధునిక సాంకేతికతో కూడిన లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లో, ఆధునిక పరికరాలతో ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగంలో పక్షవాతం, నరాల బలహీనత, బ్రెయిన్ ట్యూమర్లు, మెదడులో గడ్డలు, వెన్నెముక డిస్క్ సమస్యలు, మినిమల్ ఇన్వాసివ్ స్పైన్ సర్జరీస్, వెన్నెముక నరాల మీద ఒత్తిడి (లామినెక్టమీ), ఎఫిలెప్సి, ఫిట్స్ వంటి వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలియజేశారు. అలాగే ప్రతినెల మొదటి గురువారం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అన్ని మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలకు ఉచితంగా ఓపి, బిపి షుగర్, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష,ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్ష, యూరిక్ ఆసిడ్, పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా చేయబడును అని తెలియజేశారు. ప్రకాశం జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొప్పోలు సామిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## శ్రీగిరి బ్రహ్మోత్సవాలు




**ఒంగోలు టౌన్, జూన్ 1, ప్రభాతవార్త**
జూన్4-8 తేదీలలో శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడుతూ కుర్తాళం పీఠాధిపతి ఆశీస్సులతో పరాంకుశం సీతా రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 4వ తేదీన సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 5న ధ్వజారోహణం, సాయంత్రం పొన్నూరు వెంకట శ్రీనివాసులుచే, 6న సాయంత్రం ఊంజల్ సేవ, వినోద్‌కుమార్ గాత్ర కచేరి, 7న సాయంత్రం కూచిపూడి నృత్యప్రదర్శన, 8న ఉదయం శ్రీవారి కళ్యాణం, సాయంత్రం తిరువీధి ఉత్సవం జరుగుతాయని, భక్తులు పాల్గొని దేవదేవుని కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

# లంచం ఇవ్వకుండా ఏ పని జరగదు

- ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం
- గతంలో వివిధ శాఖ అధికారులపై వరుస ఏసీబీ దాడులు
- పంచాయతీ అధికారులలో మార్పు రాని పరిస్థితి



**ఒంగోలు, జూన్ 1, ప్రభాతవార్త**
పంచాయతీ కార్యాలయాలలో వివిధ పన్నుల చెల్లింపుల విషయంలో లంచం ఇస్తేనే పని జరగని పరిస్థితి. మండల పరిధిలోని దొడ్డవరం పంచాయతీ నందు ముడుపు చెల్లిస్తే గాని పనులు కావడం లేదని గత కొన్ని నెలల నుంచి ఆరోపణ వినిపిస్తున్నాయి. గత ఫిబ్రవరి నెలలో తెల్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి ఓ కేసు జామిన్ బెయిల్ విషయమై దొడ్డవరం గ్రామానికి చెందిన తనకు పరిచయ వ్యక్తుల ద్వారా తీసుకునేందుకు సిద్ధపడ్డాడు. ఈ క్రమంలో ఒంగోలు జిల్లా కోర్టు పరిధిలోని 3వ ఎ. ఎం. ఎం కోర్టులో ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 541/ 2018 సీసీ క్యాలెండర్ కేసు తాలూకా ఫిబ్రవరి 9వ తేదీ, ఫిబ్రవరి 24వ తేదీ నాడు ఫైనల్ గా జమీందారులని తీసుకొని రాకపోతే రిమాండ్ కి వెళ్తారని న్యాయమూర్తి తెలిపిన క్రమంలో మరో అవకాశం ఇవ్వాలని ఫిబ్రవరి 24వ తేదీన అతని లాయర్ ద్వారా విన్నవించుకోగా మార్చి 3వ తేదీన ఫైనల్ అవకాశమని కోర్టు వారు తెలిపారు. మండల పరిధిలోని తెల్లబాడు గ్రామానికి చెందిన కాట్రగడ్డ సీతారామాంజనేయులు అను వ్యక్తి గత 20 రోజుల నుంచి తిప్పుకుంటూ ఇంటి పన్ను చెల్లించాలంటే కోర్టుపరమైన విషయాలలో తల దోచమంటూ, పనిచేయాలంటే 10వేల రూపాయలు లంచం ఇవ్వాలని దొడ్డవరం గ్రామ పంచాయతీ ఇన్చార్జి కార్యదర్శి మద్దిపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా డిమాండ్ చేసినట్లు ఆయన ఆరోపిం చారు. కాట్రగడ్డ సీతారామాంజనేయులు 24వ తేదీ ఫిబ్రవరి నెలలో ఫోన్ చేసి అడుగుగా దొడ్డవరం గ్రామపంచాయతీ ఇం చార్జ్ కార్యదర్శిగా ఉన్నటువంటి నూరుల్లా అదే రోజు మద్దిపాడు గ్రామ పంచాయతీకి రమ్మని చెప్పారని తెలిపారు. తనకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన పరిచయతులైనటువంటి వ్యక్తులు 1. కుంచాల వెంకయ్య తండ్రి వెంకటేశ్వర్లు దొడ్డవరం గ్రామం,2. యానం హరిబాబు తండ్రి సత్యనారాయణ దొడ్డవరం గ్రామం వారి ఇంటి పన్నులు చెల్లింపు విషయమై గతంలో ఇంటి పన్ను చెల్లించినా కూడా చెల్లించాలంటూ కార్యదర్శి షేక్ నూరుల్లా డిమాండ్ చేశారని ఆరోపణ. ఈ క్రమంలో గతంలో కుంచాల వెంకయ్య అసెస్మెట్ నె0బార్:298, 15 అక్టోబర్ 20 22 నాటికి 271 ఇంటిపన్ను చెల్లించినట్లు, యానం హరిబాబు అసెస్మెంట్ నెంబర్: 531పై గతంలో 2024- 2025 నాటికి 551 రూపాయి వరకు చెల్లించి ఉన్నా కూడా చెల్లించలేదని వాదిస్తూ అదనంగా వసూలు చేయబోయినట్లు అతనిపై ఆ వ్యక్తులు ఆరోపణలు . దీనిపై ఇరువురైన యానం హరిబాబు, కుంచాల వెంకయ్య అనువారు తాము గతంలో కట్టినటువంటి ఇంటి పనుల రసీ దులు చూపించడంతో కార్యదర్శి నీళ్లు నమ్మినాడు. 2023-24 గాను కుంచాల వెంకయ్య..271/ ఇంటి పన్ను బాకీ ఉన్నట్లు, 2024-25 గాను 285తో పాటుగా :556 కట్టించుకుంటూ, యానం హరిబాబు తండ్రి సత్యనారాయణ వద్ద 2022-23 నుంచి 2023-24 వరకు 1050 రూపాయలు బకాయి ఉన్నట్లు 2024-25 గాను 551 పాటు కలిపి 1650 రూపాయలు కట్టించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా లెక్క ప్రకారం ఇద్దరు వ్యక్తుల ఇంటి పన్ను మొత్తం 2,157/ కట్టించుకొనవలసి ఉంటే 3157 రూపాయలు కట్టించుకునే క్రమంలో తెల్లబాడు గ్రామానికి చెందిన కాట్రగడ్డ సీతారామాంజనేయులు తండ్రి సుబ్బారావు వారి ఫోన్ పే ద్వారా కట్టించుకొని, అదనంగా మరో 8500 రూపాయలు వసూలు చేశారని ఆరోపణ. ఈ విషయంపై కాట్రగడ్డ సీతారామాంజనేయులు ప్రశ్నించడం తో మీకు 500 రూపాయలు కన్సెక్షన్ ఇచ్చేయనని సగర్వంగా పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా తెలిపినట్లు వారు అన్నారు. ఈ అన్యాయంపై మండల ఉన్నత స్థాయి అధికారులకు తెలియపరచిన కూడా వారు పట్టించుకోలేదని సీతారామాం జనేయులు ఆరోపించారు. సీతారామాంజనేయులు ఫోన్ పే ద్వారా 24 ఫిబ్రవరి 2025 సాయంత్రం గ0 6:51 నిమిషానికి ట్రాన్స్ఫర్ ఐడి నెంబర్ టి2502241851 300028719707 ఫోన్ పే నెంబర్:9908326941 నుండి షేక్ నూరుల్లా ఫోన్ పే నెంబర్ 8374514233కు అమోంట్ ..:3157 పంపడం జరిగింది. ఇరువురి ఇంటి పన్ను అమోంటు 2157 రూపాయలు తీసివేయగా ఫోన్ పే ద్వారా అదనముగా 1000 రూపాయలు పంపారు మరో క్రమంలో 8500 నగదును తీసుకున్నట్లు మొత్తము 9500 పంచాయతీ కార్యదర్శి తీసుకున్నట్లు కాట్రగడ్డ సీతారామాంజనేయులు ఆరోపించారు. ఈ లంచగొండి పై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆ వ్యక్తి పంచాయతీ కార్యదర్శికి తెలపడంతో ఏప్రిల్ 29వ తేదీన ఫోను వాట్సప్ మెసేజ్ ద్వారా ఈ విధంగా అనగా నా కొలీగ్ చేయబోదులు శనివారం ఇస్తానని చెప్పాడు. సోమవారం జీతం రాగానే ఇస్తానన్నాడు. 3.4 తేదీల్లో జీతాలు పడగానే నేనే ఫోన్ చేసి కలుస్తాను అని మెసేజ్ పెట్టినాడు. మరొకమారు మే నెల 5వ తేదీన నా కొలీగ్ చేయబోతుల శనివారం ఇస్తానని చెప్పాడు సోమవారం జీతం రాగానే ఇస్తానన్నాడు మూడు నాలుగు తేదీలు జీతాలు పడగానే నేనే ఫోన్ చేసి కలుస్తానని మరో మారు అదే మెసేజ్ ను పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా ఫార్వర్డ్ చేశారు . మే 12వ తేదీన గుర్తు ఉంది అన్నా.... హెల్త్ బాగోలేక ఈరోజు వరకు సెలవులో ఉన్నాను. రేపు జాయిన్ అవుతాను. నేను వచ్చి ఫోన్ చేస్తాను అని మరో మారు మెసేజ్ పెట్టారు. గతంలో మద్దిపాడు మండలం పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి వివిధ శాఖ అధికారులు పట్టుకున్నా కూడా అధికారులు పనితీరులో ఎటువంటి మార్పు రాలేదని మండలంలోని ప్రజలు అంటున్నారు. లంచాలు మరిగినటువంటి ఈ ప్రభుత్వ అధికారులను జిల్లా,మండల ఉన్నత స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిజాల నిఘంటువును తేల్చి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని మండల పరిధిలో పలు గ్రామాల కోరుకుంటున్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం - ఇరువురు మృతి

- మోటార్ బైక్‌ను ఢీకొట్టిన బోలేరో ట్రాన్స్‌పోర్ట్ వ్యాను
- మృతులది ఏల్చూరు గ్రామం

**సంతమాగులూరు, జూన్ 1, ప్రభాతవార్త**



సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం వద్ద ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఇరువురు మృతి చెందారు. మోటార్ బైకును బోలేరో ట్రాన్స్‌పోర్టు వ్యాను ఢీకొట్టిన ఘటనలో బైకు పై ప్రయాణిస్తున్న మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన బత్తుల బసవయ్య(50) చల్లా శ్రీను (54) కన్నుమూశారు. వివరాలలోకి వెళితే ఏల్చూరుకు చెందిన బసవయ్య,శ్రీనులు మోటార్ బైకు పై పుట్టవారిపాలెం నుండి రొంపిచర్ల వైపు వెళుతున్నారు. అదే మార్గంలో వెనుకనుండి వేగంగా వచ్చిన బొలేరో ట్రాన్స్ పోర్ట్ వ్యానుమోటార్ బైకు బలంగా ఢీకొట్టడంతో మైటార్ బైకు 10 అడుగుల ఎత్తు ఎగిరి డివైడర్ మీదుగా రోడ్డుకు ఇటువుపు పడింది. బైకు ప్రయాణిస్తున్న ఇరువురి తలకు ,కాళ్ళకు నడముల వద్ద బలమైన గాయాలు కావడం అదిక రక్త స్రావం కావడం బసవయ్య అక్కడ కక్కడే మృతి చెందగా చల్లా శ్రీను 108 వాహనంలో నరసరావుపేట తరలిస్తుండగా మార్గ మద్యంలో కన్ను మూశాడు. ప్రమాదనికి కారణమైన బోలేరో వాహనం కూడా డివైడర్‌పై బోల్తా కొట్టింది.మృతుల ఇరువురికి ఇద్దరిద్దరు కుమారులు భార్యలు ఉన్నారు.

**నిముషాల్లో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు**

పుట్టవారిపాలెం లో హైదరాబాద్ మార్గంలో మసీదు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్సై పట్టాభిరామయ్య, ఏఎస్సై శ్రీనివాసరావులు నిముషాల వ్యవధిలోనే ఘటనా స్థలికి చేరుకున్నారు. అప్పటికే ప్రమాదంలో గాయపడిన బసవయ్య మ1తి చెందగా మృత్యువుతో పోరాడుతున్న చల్లా శ్రీను ను 108 వాహనం పిలిపించి నరసరావుపేట వైద్యశాలకు తరలించగా మార్గ మద్యలో శ్రీనుకూడా కన్ను మూశాడు. రోడ్డు పై పడిఉన్న మృతదేహన్ని నరసరావుపేట వైద్యశాల శవాగారానికి తరలించారు.బివైడర్ బోల్తా కొట్టిన బోలేరో వాహనాన్ని క్రేన్ సహయంతో అక్కడనుండి తొలగించి ట్రాఫిక్ కు అంతరాయం కలుక కుండా చర్యలు తీసుకున్నారు. బాదిత కుటుంభ సభ్యులనుండి పిర్యాదు తీసికొని దర్యాప్తు చేయనున్నట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

## కబడ్డీ వేసవి శిక్షణా శిబిరం

**చీరాల, జూన్ 1,ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 ఏప్రిల్ 20వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు గ్రామీణ యువతకు కబడ్డీ శిక్షణను అందించేందుకు వేసవి శిక్షణా శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణా శిబిర ముగింపు వేడుకను జూన్1న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మచిలీపట్నం అదనపు పోలీసు అధికారి సత్యం, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ముఖ్య ఆశ్రయ దాత డాక్టర్ నల్లూరి సుబ్బారావు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ చంద్రమోహన్‌రెడ్డి, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్ర భాస్కర్‌రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అంతర్జాతీయ క్రీడాకారుడు అన్ను వేణుగోపాల్, ప్రకాశంజిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరరావు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ డి.రమేష్, ఖజాంచి, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిరిగిరి రంగారావు లు పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు ఒక లక్ష విరాళంగా అందించారు. ఈ నిధిని పౌష్టికాహారం, కబడ్డీ కిట్లు కోసం వినియోగించారు. ఈ శిబిరానికి గిరిబాబు శిక్షకుడిగా వ్యవహరించి క్రీడాకారులకు ప్రతి రోజు నిష్టతో శిక్షణను అందించారు. ఆయన శిక్షణ వల్ల అనేక మంది యువ క్రీడాకారులు ప్రేరణ పొందారు. ఈ శిబిరంలో అనేక మంది సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా అనేక గ్రామీణ యువకులు క్రీడాపై ఆసక్తిని పెంపొందించుకున్నారు. భవిష్యత్తులో మరిన్నిశిక్షణా శిబిరాలు నిర్వహించాలనే సంకల్పంతో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ముందడుగు వేస్తోందని పలువురు వక్తలు తెలిపారు.

## టిక్కెట్ ధరలు పెంచమంటే
## ఇలా ట్విస్ట్ ఇచ్చారేంటి స్వామి..

**ఒంగోలు, ప్రభాతవార్త**



గత కొన్ని రోజులుగా సినీ ఇండస్ట్రీలో థియేటర్ బంద్ పిలుపు వివాదం అటు థియేటర్లను, ఇటు మల్టీ ప్లెక్సీలను గట్టిగా తాకిందని చెప్పవచ్చు. ముఖ్యంగా థియేటర్‌కు ప్రేక్షకుడు రావడం లేదని సినిమా ఆడక డబ్బులు రావడం లేదని, అద్దె కూడా కట్టలేకపోతున్నామని అందుకే నేటి నుంచి సినిమా థియేటర్లను బంద్ చేయాలనే నిర్ణయం తలెత్తగా నిర్మాతలు ఫిలీం ఛాంబర్ ఆధ్వర్యంలో బంద్ ఉండదు అనే దానిపై క్లారిటీ ఇచ్చారు. అయితే ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం రాష్ట్ర వ్యాప్తంగా థియేటర్లలో తనిఖీలు చేపట్టింది. ముఖ్యంగా థియేటర్లలో నిర్వహణతో పాటు ఆహార పదార్థాల అమ్మకాలు, వాటి ధరలపై కూడా అధికారులు ఆరా తీశారు. మొత్తానికిఅయితే సినిమా థియేటర్లపై తనిఖీల ఎఫెక్ట్ ఇప్పుడు చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వ తనిఖీల ఎఫెక్ట్‌తో సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్ యాజమాన్యాలు కూడా దిగివస్తున్నాయి. ఒకప్పుడు సినమా థియేటర్‌కు వెళ్ళి సినిమా చూడాలంటేనే ప్రేక్షకుడు భయపడి పోయేవాడు. టిక్కెట్ ధరతో పాటు అక్కడ లభించే ఆహార పదార్థాల ధరలు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేసేవాడు. అందుకు చాలా మంది థియేటర్లకు వెళ్ళకుండా ఓటీటీల కోసం ఎదురు చూసే వాళ్ళు ఫలితంగా థియేటర్ యాజమాన్యానికి నష్టం వాటిల్లింది. అందుకే పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయానికి ఇప్పుడు యాజమాన్యం మొత్తం దిగి వచ్చిందని చెప్పవచ్చు. మొత్తానికి అయితే టిక్కెట్ ధరలు పెంచమని అడిగిన యాజమాన్యానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గట్టి ట్విస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం సినిమా థియేటర్లతో పాటు మల్టీ ప్లెక్స్‌లలో కూడా ఆహార పదార్థాల ధరలపై ఏకంగా 10 నుంచి 20శాతం వరకు డిస్కౌంట్ ప్రకటించి విక్రయాలు సాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అంతే కాదు బై1, గెట్ 1 ఆఫర్లతో వినియోగదా రులకు తినుబండారాలు విక్రయించనున్నట్లు సమాచారం. గత నాలుగు రోజులుగా తనిఖీలు చేపట్టిన అధికారులు టిక్కెట్ ధరలు, ఆహార పదార్థాల క్వాలిటీ, వాటి ధరల పెంపు, అలాగే సుభ్రతపై ఆరా తీయగా వచ్చిన ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుని ఇప్పుడు ఈ సోదాలు నిర్వహించారు. ఇక పోతే ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే మల్టీ ప్లెక్స్‌లలో పాప్‌కార్న్ బకెట్ రూ.400లు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా ఇష్టానుసారంగా అధిక ధరలు పెట్టి ప్రేక్షకుడి జేబుకు చిల్లుపడేలా చేస్తున్న మల్టీ ప్లెక్స్‌లకు కొంత మందికి రాష్ట్రంలో నోటీసులు కూడా అందజేసినట్లు సమాచారం. ధరల నియంత్రణ లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో అసలకే ఎసరు వచ్చేలా ఉందని గ్రహించిన సినిమా థియేటర్లు, మల్టీ ప్లెక్స్ యాజమాన్యం ఇప్పుడు దిగి వచ్చినట్లు తెలుస్తోంది. ధరలు దగ్గించి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇక పోతే ప్రస్తుతం ఈ తనిఖీలు అన్ని కూడా దాదాపు అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని జిల్లాలకే పరిమితం కానున్నాయని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రభావం పడనుందా అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి అయితే తనిఖీ ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా ఉంటేనే ప్రేక్షకుడు కుటుంబంతో కలిసి సినిమా చూడగలరని సినిమా ప్రేక్షకులు అంటున్నారు.

## పౌర సరఫరాల వ్యవస్థను పటిష్ట పరిచేందుకే ప్రజా పంపిణీలో మార్పులు

- సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ రమేష్
- పత్తేపురంలో రేషన్ షాపులో సరకుల పంపిణీ ప్రారంభం



**సంతమాగులూరు, జూన్ 1 ,ప్రభాతవార్త**
పౌర సరఫరాల వ్యవస్థను పటిష్ట పరిచేందుకే కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీవద్దతులో మార్పులు తీసుకు వస్తున్నట్లు సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తెల్లప్రోలు రమేష్ అన్నారు. రేషన్ సరకుల పంపిణలో గత నెలవరకు జరిగిన వాహనాల ద్వారా డోర్ డెలివరి విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి రేషన్ షాపు వద్దనే సరకుల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడం తో ఏఎంసీ చైర్మన్ రమేష్ ఆదివారం పత్తేపురం లో ప్రజాఇపంపిణీని ప్రారంబించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసి అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టడంతో పాటు అనవసర దుబా ఖర్చులను కూడా నింత్రించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆద్వర్యంలోని కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. రేషన్ పంపిణీ వాహనాలను తొలగిండం ద్వారా ప్రభుత్వం పై దుబారా ఖర్చు భారం తగ్గడమే కాకుండా గత ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఏమాత్రం విలువలేకుండా కేవల స్టాక్ పాయింట్ లా మార్చి వేసిన విధానాన్ని రద్దుచేసి డీలర్ల వ్యవస్థకు జవ జీవాలు అందిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గ సమగ్రాభివృద్ది చేస్తున్న కృషి అభినందనీయమని రమేష్ అన్నారు.ఈకార్యక్రమంలో రేషన్ డీలర్లు ,కార్డుదారులు, స్తానిక నాయకులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో రేషన్ దుకాణాలు ప్రారంభం



**బల్లికురవ, జూన్ 1, ప్రభాతవార్త**
రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పండుగ వాతావరణంలో ఆదివారం నుండి రేషన్ దుకాణాల ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 29,796చౌకదుకాణాలు ఒకే రోజు ప్రారంభ మయ్యాయి. ప్రారంభ వేడుకలను తమ దుకాణాలను పూలతో అందంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని తలపించేశారు. మండల కేంద్రమైన బల్లికురవ, గుంటుపల్లి, ఉప్పుమాగులూరు, నక్క బొక్కలపాడు, అంబడిపూడి గ్రామాల్లో జరిగిన ప్రారంభ వేడుకలలో తహశీల్దార్ ఎం.రవి నాయక్ పాల్గొన్నారు. అనంతరం ప్రతి గ్రామంలోనూ చౌక ధరల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా క్లస్టర్ ఇన్‌ఛార్జీ మల్లినీడి గోవిందరావు మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తిరిగి యధా రూపంలో దుకాణాల ద్వారా పంపిణీ ప్రారంభించిందన్నారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా 1 నుండి 15వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు, అదే విధంగా సాయంత్రం 4గంటల నుండి 8గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. తహశీల్దార్ రవి నాయక్ మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద స్టాకు వివరాలు, ధరల పట్టికల పోస్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 65 ఏళ్ల వృద్దులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే సరుకులు అందించేలా ఆయా డీలర్ల పరిధిలో జాబితాలను సిద్దం చేసి వారికి ప్రభుత్వం అందజేయడం జరిగిందన్నారు.ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 15,74,057 మంది వృద్దులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకు సరుకులు రానున్నాయని ఆయన వివరించారు. తొలి రోజు అన్ని గ్రామాలలోనూ మహాకూటమినేతలు గొట్టిపాటి లక్ష్మయ్య,దూళిపాళ్ల హనుమంతరావు, దద్దల అంజయ్య,ఆళ్లచంద్రమౌళి,మందలపుసుధాకర్, పోగులకృష్ణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనసేన మండల కమిటీ సమావేశం



**మార్టూరు, జూన్ 1, ప్రభాతవార్త**
మార్టూరులో జనసేన పార్టీ మండల కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మార్టూరు పట్టణ అధ్యక్షునిగా షేకవహీద్, ప్రధాన కార్యదర్శిగా షేక్అబ్దుల్ సలాంని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త పెద్దపూడి విజయ్‌కుమార్,మండల అధ్యక్షులు మందపాటి కిషోర్‌లు నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి వేముల శ్రీనివాసరావు, సకల ఆంజనేయులు, షేక్ మస్తాన్ వలి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవర్ సేవింగ్ సామాగ్రికి భారీగా నిధులు

- సీఎస్ఆర్ నిధులతో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్స్
- పలు హాస్టల్స్, పంచాయతీ భవనాలకు కేటాయింపు
- నియోజకవర్గానికి 195 ట్యూబ్ లైట్స్, 195 ఫ్యాన్లు
- మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు

**మార్టూరు, జూన్ 1, ప్రభాతవార్త**
పర్చూరు నియోజకవర్గానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో పవర్ సేవ్ సమాగ్రికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో పర్చూరు నియోజకవర్గంలోని పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌కు, పలు గురుకులాలకు విద్యుత్ పవర్ సేవింగ్ గురుకులాలు, పంచాయతీ భవనాలకు ఫ్యాన్లు ట్యూబ్ లైట్లు సమకూర్చేందుకు నిధులు విడుదల చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 195 ఫ్యాన్లు, 195 ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేయనున్నారు.

**విద్యుత్ సామాగ్రి ఇలా :**
వలపర్ల ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, మార్టూరు ఎస్సీ గర్ల్స్ హాస్టల్, మార్టూరు పంచాయతీ ఆఫీసు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ పర్చూరు, పర్చూరు పంచాయతీ ఆఫీసు, ఏపీ సోషల్ వెల్ఫేర్ ఎస్సీ హాస్టల్ చెరుకూరు, ఎస్సీ బాయ్స్ హాస్టల్ ఉప్పుటూరు, నాగులపాలెం గురుకులం, యద్దనపూడి గురుకులం, యద్దనపూడి పంచాయతీ ఆఫీసు, ఇసుక దర్శి మండల పరిషత్ హైస్కూల్, చిన్నగంజాం పంచాయతీ ఆఫీసు, ఇంకొల్లు బీసీ బాయ్స్ హాస్టల్, ఇంకొల్లు పంచాయతీ ఆఫీసు, చిన్నగంజాం బీసీ గర్ల్స్ హాస్టల్, ఇంకొల్లు ఎస్సీ బాయ్స్ హాస్టల్, ఇంకొల్లు బీసీ బాయ్స్ హాస్టల్‌కు ఫ్యాన్లు లైట్ ఏర్పాటు చేయనున్నారు.

**మంత్రికి ధన్యవాదాలు :**
కార్పొరేట్ సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో ఖర్చులు నియోజకవర్గంలో విద్యార్థుల అవసరాల కోసం, పలు పంచాయతీలలో మెరుగైన విద్యుత్ వసతలు కల్పించేందుకు కృషి చేసిన విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి
- దుకాణం ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శ్యామలకాశిరెడ్డి



**వెలిగండ్ల, జూన్ 1, ప్రభాతవార్త**
ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వెలిగండ్ల రేషన్ దుకాణాన్ని ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి రేషన్ కార్డుదారుడు రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా కార్డు లబ్దిదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలన్నారు. రేషన్ షాపు ప్రారంభ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వాసు పాల్గొని మాట్లాడుతూ ప్రతి డీలర్ రేషన్ షాపును ప్రతి రోజు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సాయంత్రం 4గంటల నుండి 8గంటల వరకు రేషన్ షాపును తెరిచి బియ్యం పంపిణీ చేయాలన్నారు. వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, వెలిగండ్ల డీలర్ రాజ్ కుమార్‌నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రవేశపెట్టిన రేషన్ షాపుల పాత విధానం

- యర్రగొండపాలెంలో రేషన్ దుకాణాలను ప్రారంభించిన టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్ బాబు
- డీలర్లు ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని రేషన్ దారులకు అమ్మాలి తప్పా
- కార్డు దారుల నుండి బియ్యం కొనుగోలు చేస్తే చర్యలు తప్పవు





**యర్రగొండపాలెంరూరల్, జూన్ 1, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ పధకాలు ఒక్కొక్కటిగా పున: ప్రారంభం చేస్తూ పోతున్నారు. అప్పటి జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ పధకాలను తన మార్కు రాజకీయంతో ఎప్పటి నుంచో కొనసాగుతున్న ప్రభుత్వ పధకాలను విన్నూత తరహాలో మార్పులు చేర్పులతో ప్రవేశపెట్టడం జరిగింది. మళ్ళీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జగన్ ప్రవేశపెట్టిన పధకాలను ఒక్కొక్కటిగా పాత విధానాలలోకి మార్పులు, చేర్పులతో తీసుకుని వస్తుండటం చూస్తున్నాం. అందులో భాగంగా మద్యం పాలసీ జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వం అమ్మకాలు జరిపేది. కూటమి ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత పాత టెండర్ విధానాలను తెరమీదుకు తెచ్చిన విషయం తెలిసిందే. అదేవిధంగా గత ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ విధానమంటూ ఆటోల ద్వారా వీధులలోకి వచ్చి రేషన్ ఇచ్చేవారు. ఆ విధానానికి మంగళం పాడిన కూటమి ప్రభుత్వం మళ్ళీ ఇన్నేళ్ళకు పాత రేషన్ విధానాన్ని తెరమీదకు తెచ్చి పున:ప్రారంభానికి పూనుకుంది. అయితే వేలిముద్ర పద్దతిలోనే రేషన్ ఇస్తారా, లేక పాత కీ రిజిస్టార్‌లో లబ్దిదారుడి సంతకంతో రేషన్ ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. సంబంధిత మంత్రి పాత రేషన్ విధి విధానాలను ఇప్పటికే జారీ చేసియున్నారు. రేషన్‌తో పాటు నిత్యావసర వస్తువులు మార్కెట్‌లో ధరలు పెరిగితే రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తామని మంత్రి జారీ చేసిన రేషన్ విధివిధానాలలో తెలిపియున్నారు. రేషన్ దుకాణాల పున: ప్రారంభంలో భాగంగా యర్రగొండపాలెం పట్టణంలో ఆదివారం జరిగిన రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ సరసమైన ధరలతో రేషనన దుకాణాలలో బియ్యం పంపిణీ నిర్వహించబడుతుందని అన్నారు. కార్డు దారులు ఇకపై రేషన్ బండి కోసం ఎదురు చూడవలసిన అవసరం లేదని మీకు ఎప్పుడు తీరుబడిగా ఉంటుందో అప్పుడు మీ రేషననను భద్రంగా తెచ్చుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డుదారులు బియ్యం తప్పనిసరిగా కొనుగోలు చేసుకొని ఇంటికి తీసుకుపోవాలని కోరారు. తహశిల్దార్ మంజునాధరెడ్డి మాట్లాడుతూ ప్రతినెల 1నుండి 15వ తేదీ వరకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు మరియు సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8గంటల వరకు సరుకులు పంపిణీ చేయబడతాయని తెలిపారు. డీలర్లు బియ్యం బదులు నగదు బదిలీ చేస్తే రెవెన్యూ పరమైన కేసులు అమలు పరచవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిటీ రాధాకృష్ణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ అభ్యర్థి చేకూరి సుబ్బారావు, కాపు నాయకులు తోట మహేష్ నాయుడు, జిల్లా నాయకులు వేగినాటి శ్రీనివాస్, బిసి నాయకులు సత్యనారాయణ గౌడ్, వైశ్య నేత కొత్తమాసు సుబ్రమణ్యంలతోపాటు పార్టీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

### వెన్నుపోటు దినం గోడపత్రికలను ఆవిష్కరించిన వైసిపి ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు

- చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచింది
- అందుకే జూన్ 4 వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నాం..





**యర్రగొండపాలెం రూరల్, జూన్ 1, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలుపరచకపోవడంపై చంద్రబాబు నాయుడు విధానాలకు నిరసనగా వైఎస్సార్సీపి రాష్ట్ర అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా వైసిపి పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమం జరగనుండడంతో ఈ సందర్భంగా జూన్ 4 వెన్నుపోటు దినం గోడపత్రికను యర్రగొండపాలెం పట్టణంలోని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ వైసిపి పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి వైసిపి శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానాలను, వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన బూటకపు హామీలను అమలు పరిచేంతవరకు అడుగడుగునా వెంటపడతామని స్పష్టం చేశారు. మోసపు మాటలు నమ్మి నిజాయితీ పరుడ్ని దూరం చేసుకున్నామని బాధ ప్రజల్లో కనపడుతుందని అలాంటి ప్రజలకోసం నిత్యం పోరాటం చేస్తామని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు జరిగినా తిరిగి అధికారంలోకి వచ్చేది వైసిపి పార్టీ అని వెల్లడించారు. ఎన్నికల ముందు గమ్మత్తు గమ్మత్తుగా ఇచ్చిన సూపర్ సిక్సులు మరియు 114 హామీలు అమలు పరచకుండా కాలయాపన చేస్తుండటంతో చంద్రబాబుకు బాగా ఇష్టమైన వెన్నుపోటు పదం ప్రధాన అంశంగా తీసుకొని వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నోటికి వచ్చిన అబద్దాలన్ని చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని తాను చెప్పిన హామీలను నెరవేర్చమని ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి, జిల్లా పార్టీ నాయకులు ఒంగోలు మూర్తి రెడ్డి, వైస్ ఎంపిపి మందుల ఆదిశేషు, గంజివారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, మొగుళ్ళపల్లి సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, సూరె రమేష్, కొప్పర్తి వెంకటేశ్వరరెడ్డి, ఎస్టీ నాయకులు రాముల్ నాయక్ తదితరులు ఉన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన రేషన్ పంపిణీ

- పలకరింపులతో హుషారుగా లబ్దిదారులు



**మార్కాపురం రూరల్, జూన్ 1,ప్రభాతవార్త**
పట్టణంలోని భగత్‌సింగ్, బాపూజీ కాలనీ 0884015 నంబర్ రేషన్ షాపు నందు రేషన్ పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గత ప్రభుత్వం రేషన్ పంపిణీ వాహనాల ద్వారా వీధులలో లబ్దిదారులకు ఇవ్వటం జరిగింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1వ తేదీ ఆదివారం నుంచి వాహనాల ద్వారా రేషన్ పంపిణీ కాకుండా రేషన్ షాపులద్వారా పంపిణీ చేయటానికి పూను కుంది.అందులో భాగంగా భగత్‌సింగ్, బాపూజీ కాలనీలకు చెందిన రేషన్‌షాపును సచివాలయం సిబ్బంది చేతుల మీదుగా అట్టహాసం గా పున:ప్రారంభించటం జరిగింది. రేషన్ షాపు డీలర్ గోపు సుబ్బులు మాట్లాడుతూ గతంలో మాకు లబ్దిదారులతో మంచి అనుబంధం ఉందని, కుటుంబ సభ్యుల మాదిరిగా వారితో మమేకమై లబ్దిదారుల పలకరింపులు, ఆప్యాయతలతో ఉండేవాళ్ళమన్నారు. 65సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్‌లు అయిన అవ్వాతాతలకు వారి ఇంటికి వెళ్ళి రేషన్ అందజేయటం ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. కొందరు లబ్దిదారులను పలకరించగా గతంలో రేషన్ వాహనం ఏ సమయాన వస్తుందో తెలియక పనులకు వెళ్ళే మాకు కొంత ఆందోళన ఉండేదని తెలిపారు. ప్రస్తుతం రేషన్ దుకాణం నందు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12వరకు సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు తీసుకునే వెసలుబాటు ఉన్నందున మేము పనులను ముగించుకొని రేషన్ తీసుకోవచ్చని చాలామంది లబ్దిదారులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అయితే కొద్దిమంది మాత్రం మా ఇంటి దగ్గరలో గతంలో ఇచ్చేవారని ఇప్పుడు అదే పనిగా రేషన్ దుకాణానికి వెళ్ళవలసి వస్తుందని తెలపటం గమనార్హం.

## మార్కాపురంలో మండల స్థాయి యోగాంధ్ర 2025 పోటీలు




**మార్కాపురం రూరల్, జూన్ 1, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని స్థానిక తర్లుపాడు రోడ్డు ఎస్సీ,బిసి కాలనీ డ్వాక్రా బజార్‌నందు జూన్ 2 నుంచి జూన్ 7వరకు మండల స్థాయి యోగాంధ్ర 2025 పోటీలు జరుగునని మండల పరిషత్ అభివృద్ధి ఇన్చార్జి అధికారిణి వై భాగ్యవతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 లో యోగా రంగంలో విశిష్టమైన కృషిచేసిన వ్యక్తులకు ప్రతి సంవత్సరం జూన్ 21 సందర్భంగా ప్రదానం చేస్తారన్నారు. అప్పుడు విజేతల పేర్లను ప్రకటిస్తారని తెలిపారు. అందులో భాగంగా మన రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర 2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆమె ఈ సందర్భంగా తెలిపారు. మన మండలంలో ఈ పోటీలు 3 విభాగాల వారికి జరుగునని తెలిపారు. 10నుంచి 18మధ్య వయసుగల వారు, 19 నుంచి 35మధ్య వయస్సుగల వారికి, 35 నుంచి ఆపై వయసు వారికి జరుగునని తెలిపారు.

## శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వారి దేవాలయం పున:నిర్మాణంపై కమిటీ సమావేశం



**హనుమంతునిపాడు, జూన్ 1, ప్రభాతవార్త**
శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయం పున:నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం మిట్టపాలెం నారాయణ స్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో చిన్నగొల్లపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం పున:నిర్మాణం గురించి ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబుతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలు చర్చించి త్వరలో గుడి పున:నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో ఆలయ పున:నిర్మాణ కమిటీ చైర్మన్ సానికొమ్ము జగన్‌మోహన్‌రెడ్డి, సానికొమ్ము కాశిరెడ్డి, మాలపాటి కృష్ణారెడ్డి, బత్తుల శ్రీనివాసులరెడ్డి, బైరా వెంకట నారాయణ, మల్లల కాశిరెడ్డి, మాలపాటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాళ్ళ మహోత్సవం






**గిద్దలూరు, జూన్ 1, ప్రభాతవార్త**
మండలంలోని ముండ్లపాడు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాళ్ళ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి తిరుణాళ్ళ సందర్భంగా దేవస్థానం వద్ద మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సుమారు 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవస్థాన ప్రాంగాణంలో ఆరుపళ్ళ సైజు విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలను టిడిపి నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, కర్ణాటి రామసుబ్బారెడ్డిలు ప్రారంభించారు. ఈ పోటీల్లో 9ఎడ్లజతలు పాల్గొన్నాయి, వీరిలో మొదటి బహుమతి రూ.30వేలు పాతపాడు గ్రామానికి చెందిన బి చంద్రశేఖర్ రెడ్డికి చెందిన ఎడ్లజత కైవసం చేసుకోగా రెండవ బహుమతి రూ.25వేలను ఖాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్లజత గెలుపొందాయి. ముండ్లపాడు గ్రామంలో జరిగిన అంకాలమ్మ అమ్మవారి ఉత్సవంలో టిడిపి నాయకులు బొమ్మినేని వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు పఠాన్ సైదుపీరా ఖాన్, షేక్ బాష, మండ్ల రంగనాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



**గిద్దలూరు, జూన్ 1, ప్రభాతవార్త**
విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు సైతం ముఖ్యమని క్రీడల్లో రాణించి విజయాలు అందుకొని ప్రతి4 విద్యార్థి గుర్తింపు తెచ్చుకోవాలని యువప్రగతి పధం సభ్యులు పగిడి వెంకటరత్నం అన్నారు. గిద్దలూరు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా ఆదివారం జరుగుతున్న చదరంగం, క్యారమ్స్, స్నేక్‌చాట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు తన స్వంత నిధులతో పెన్నులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు ఎన్ ప్రసన్న కుమారి, విశ్రాంత ఉపాధ్యాయులు బి రామిరెడ్డి, యువ ప్రగతిపధం సంస్థ వ్యవస్థాపకులు ఎస్‌డి ఫరూక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దారవీడులో ఉచిత కంటి వైద్యశిబిరం




**పెద్దారవీడు, జూన్ 1, ప్రభాతవార్త**
పెద్దారవీడు గ్రామపంచాయితీ కార్యాలయం లో ఆదివారం బాలాజీ కంటి ఆసుపత్రి అండ్ ఆప్టికల్స్ మార్కాపురం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమం ఉదయం 10గంటలకు ప్రారంభించగా మండలంలోని ప్రజలు సుమారు 70 మందికి పైగా కంటిపరీక్షలు చేయించు కున్నారని స్థానికులుతెలిపారు.ఈ కార్యక్రమం లో గొట్టం రామనారాయణ రెడ్డి, వేశపోగు గాలయ్య, దుగ్గెం డేనియల్, వేశపోగు సాల్మన్ రాజు, గొట్టం రామాంజనేయరెడ్డి, పొందుగుల వెంకటేశ్వరరెడ్డి,కొలగట్లశివారెడ్డి, బొచ్చు వెంకటేశ్వరరెడ్డి,గాజులపల్లి శ్రీను, మూడమంచు సుబ్బయ్య, టిడిపి కార్యకర్తలు కంటిచూపు పరీక్షలు చేయించుకోవటానికి వచ్చిన వృద్దులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చౌక దుకాణాల ద్వారా మెరుగైన సేవలు

- టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, జూన్ 1, ప్రభాతవార్త**
రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి చౌక దుకాణాల ద్వారా మెరుగైన సేవలతో కూడిన నిత్యవసర వస్తువుల పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని హనుమంతపురం, లింగారెడ్డిపల్లి, కోటతిప్పల, కొండారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం చౌక దుకాణాల అధికారులతో కలిసి సానికొమ్ము తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీలో నూతన విధానంతో ప్రజలకు మరింత సౌలభ్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో మొబైల్ డెలివరి యూనిట్(ఎండీయు) ద్వారా రేషన్ సరుకుల పంపిణీలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిది

- శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



**మార్కాపురం రూరల్, జూన్ 1, ప్రభాతవార్త**
పట్టణంలోని స్థానిక శత వసంతాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన రికార్డు సహాయకులు ఏరువ వెంకట కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో బోధనేతర సిబ్బంది పాత్ర చాలా కీలకమైందని అన్నారు. అందువలన వైవి కృష్ణారెడ్డి చాలా సున్నితమైన విశాల దృక్పధం, నిజాయితీ, నిబద్దత కలిగి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉద్యోగుల పాత్ర అపారం అని అందులో వీరు చూపిన చొరవ శ్లాఘనీయమని తన కుటుంబం ఈనాటి సమాజానికి ఆదర్శమని, తనతోవారికి వారి కుటుంబానికి ఉన్న అనుబంధం ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన వక్తలు ఏరువ కృష్ణారెడ్డి సేవలను, వ్యక్తిత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏరువ భూపాల్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వై వెంకటరామిరెడ్డి, వై సత్యనారాయణ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జివిల్ రమేష్ తదితర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కార్డుదారులందరికీ రేషన్ షాపు వద్దే రేషన్ పంపిణీ

### - నడవలేని వయోవృద్ధులకు మాత్రమే ఇళ్ళవద్దకు రేషన్

### - తహశీల్దార్ వెంకటేశ్వర్లు




**రాచర్ల, జూన్ 1, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రేషన్ షాపు వద్దే కార్డుదారులకు డీలర్లు రేషన్ పంపిణీ చేస్తారని 65సంవత్సరాలు దాటి నడవలేని వయోవృద్ధులకు, వికలాంగులకు మాత్రమే ఇళ్ళవాద్దకు వచ్చి రేషన్ ఇవ్వడం జరుగుతుందని మండల తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన అనుములపల్లి రేషన్ షాపులో పునఃప్రారంభించిన రేషన్ సరుకులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు అందిస్తామని అందులో ఎలాంటి సందేహం లేదని, ప్రతినెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఎప్పుడైనా రేషన్ పొందవచ్చని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి రేషన్ షాపు వద్దనే రేషన్ తీసుకోవాలని, ఉదయం 8గంటల నుండి 12గంటల వరకు సాయంత్రం 4గంటల నుండి 8గంటల వరకు డీలర్లు రేషన్ పంపిణీ చేస్తారని అన్నారు. కార్డుదారులు ఈ విషయాలన్నీ గమనించి బాధ్యతగా భావించి రేషన్ షాపుల వద్దకు వెళ్ళి రేషన్ తీసుకోవాలని ఆయన కోరారు. రేషన్ షాపు వద్ద ఏర్పడ్డ ఆర్థిక ఇబ్బందులను ప్రస్తుత ప్రభుత్వం గుర్తించి ఆ విధానాన్ని రద్దు చేసి కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి రేషన్ షాపుల వద్ద డీలర్ల ద్వారా కార్డుదారులు రేషన్ పొందే విధంగా మార్పులు చేసిందని అన్నారు. రేషన్ పంపిణీ పునఃప్రారంభ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ పండుగ వాతావరణంలో ప్రారంభమైందని, ప్రతి గ్రామంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల సహకారంతో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. డీలర్లు కార్డుదారులకు బాధ్యతగా రేషన్ పంపిణీ చేయాలని, ఎక్కడ ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు మరియు కూటమి నాయకులు కటిక యోగానంద్, శిరిగిరి వెంకటపతి, సనావుల్లా ఖాన్, దప్పిలి కాశిరెడ్డి, జనసేన నాయకులు ఉలాపు శంకర్ నాయుడు, డీలర్ అంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు తీసుకోని వారికి నేడు పంపిణీ చేస్తాం

### - ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి



**రాచర్ల, జూన్ 1, ప్రభాతవార్త**

గత శనివారం (మే 31) పింఛన్లు తీసుకోని పింఛన్ దారులకు నేడు (సోమవారం) పంపిణీ చేయడం జరుగుతుందని మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మామూలుగా జూన్ 1వ తేదీ లబ్దిదారులకు పింఛన్లు ఇవ్వాలని అయితే జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో సెలవు దినం అయినందున 1వ తేదీకి ముందురోజే (మే31 శనివారం) పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం జారీ చేసిందని అందులో భాగంగా మే 31వ తేదీ శనివారమే పంపిణీ చేయడం జరిగింది అన్నారు. శనివారం దాదాపు 97శాతం పింఛన్లు పంపిణీ చేశామని కేవలం మూడు శాతం మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ ఆగిపోయిందని అదికూడా పింఛన్ పొందే లబ్దిదారులు అందుబాటులో లేకపోవడం వలన ఈ జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం మిగిలిపోయిన మూడు శాతం మంది లబ్దిదారులకు నేడు పంపిణీ చేసి పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. శనివారం పంపిణీ అనంతరం ఆదివారం కూడా పంపిణీ చేయాలని లబ్దిదారులు కోరుతున్నట్లు కొందరు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆదివారం సెలవు దినం కాబట్టే ప్రభుత్వం పింఛన్ల పంపిణీ శనివారం ప్రారంభించిందన్నారు. శనివారం పొందని వారు తిరిగి సోమవారమే తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఆదివారం పంపిణీ కార్యక్రమం లేదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## కె కొత్తపల్లిలో రేషన్ దుకాణం ప్రారంభించిన ఇమ్మడి కాశీనాధ్..





**మార్కాపురం రూరల్, జూన్ 1, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం కె కొత్తపల్లి గ్రామం నందు ఆదివారం రేషన్ దుకాణాలతో పారదర్శక ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ చౌక ధరల రేషన్ దుకాణం ప్రారంభించి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు, కార్డుదారులు తమ పనులకు ఆటంకం లేకుండా ఉదయం 8గంటల నఉండి 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నఉండి 8 గంటల వరకు ఏ సమయంలో మాకు వీలు అవుతుందో ఆ సమయంలో రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో రేషన్ పంపిణీ వాహనం వచ్చినప్పుడు మాత్రమే రేషన్ తీసుకోవాలని, ఇప్పుడు ఆ ఆందోళన అవసరం లేదని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనా నాయకులువిజయనరసింహారావు, పిన్నెబోయిన శ్రీనివాసులు ,ఐతాసుబ్బిశెట్టి, ఐ.శ్రీనివాసులు, ఎం.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారి బాష, కార్డుదారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలను అరికట్టేందుకే చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

### - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం, జూన్ 1, ప్రభాతవార్త**

గాడి తప్పిన ప్రజా పంపిణీ వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టి, అక్రమాలను అరికట్టేందుకు చౌక దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 23, 27వ వార్డులతో పాటు మండలంలో దరిమడుగు ప్రాంతాలలో చౌక దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పెద్దలు ఉపాధిగా మార్చుకుని అవినీతికి పాల్పడ్డారని, రేషన్ అక్రమ రవాణా అడ్డుకునే విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో అక్రమ రేషన్ కోట్లకు పడగలెత్తిన వీటిని అన్నింటిని పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్షేత్ర స్థాయిలో పర్యటనలు జరిపి చౌక దుకాణాల ద్వారా పేదలకు బియ్యం సరఫరా చేయాలన్న ఆలోచన చేశారని అన్నారు. ఇకపై నెలలో 15 రోజుల పాటు రోజుకు రెండు పూటలా చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుందని, పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గతంలో బియ్యం వాహనాలు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూసేవారని ఇదే సమయంలో కూలి పనులకు వెళ్లకుండా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొని ఉండేదని, ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేకుండా సమయపాలనతో చౌక దుకాణాలు పని చేస్తాయని అన్నారు. సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి చౌక దుకాణం ద్వారా సౌకర్యం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. రానున్న రోజులలో మరిన్ని సరుకులు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే.చిరంజీవి, టీడీపీ సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ మౌలాలి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇబ్రహీం, నాలి కొండయ్య యాదవ్, సయ్యద్ వలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా కోన శ్యామ్ ప్రసన్నతాంజలి



**పెద్దదోర్నాల, జూన్ 1, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా కోన శ్యామ్ ప్రసన్నతాంజలి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం విధులలో జాయిన్ అయి బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల జిల్లా రేపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయురాలుగా పని చేస్తుంది. పదోన్నతుల భాగంలో బదిలీపై పెద్ద దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న ఎస్.అనసూయ నుండి ఛార్జ్ తీసుకొని ఆదివారం కోన శ్యామ్ ప్రసన్నతాంజలి బాధ్యతలు చేపట్టారు. నూతన ప్రధానోపాధ్యాయురాలు కోన శ్యామ్ ప్రసన్నతాంజలిని పాఠశాల సిబ్బంది స్వాగతించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.నాగమూర్తి, హెచ్.రామానాయుడు, కే.ఆవులయ్య, ఎస్.నాయబ్ రసూల్, షేక్ అక్బర్ భాషా, దూపాటి మధు, టి.సోమయ్య, జెడ్.సౌజన్య పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**సంతనూతలపాడు, జూన్ 1, ప్రభాతవార్త**

సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో దాత వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రం వద్ద వారం వారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు దాతలు వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు శిఘాకొల్లి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ ఎస్.జయశ్రీ, వాసవి క్లబ్ అధ్యక్షులు వి.శేషారావు, వాసవి క్లబ్ ఉపాధ్యక్షులు వేమా శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జి.పాండురంగారావు, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు జి.సులోచన, జి.పద్మజలు, వాసవి మహిళా క్లబ్ ప్రతినిధి ఎన్.సుకన్యరాణి, వాసవి క్లబ్, ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి ఆంజనేయులు, జి.బద్రీ నారాయణ, చలువాది రాము, పి.సుబ్రహ్మణ్యం, వేమా సుబ్బారావు, జి.కృష్ణమూర్తి, కే.కోటేశ్వరరావు, మద్ది సుబ్బయ్య, వి.అంకంశెట్టి, ఎన్వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. వేసవి కాలంలో సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో ఒక పక్క కూలింగ్ చలివేంద్రం, మరొక పక్క మజ్జిగను పంపిణీ చేస్తున్న దాతలను, వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ప్రతినిధులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్‌కుమారి



**సంతనూతలపాడు, జూన్ 1, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని మద్దులూరు రోడ్డు నందు మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టీయుసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరిలకు సంబంధించి నాలుగవ రేషన్ దుకాణాన్ని ఆదివారం నానడు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం పర్యవేక్షణలో నూతనంగా ఈ రేషన్ దుకాణాన్ని ప్రారంభింపచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి 15 రోజుల పాటు ఉదయం 8గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 4గంటల నుండి 8 గంటల వరకు ఈ దుకాణంలో కార్డుదారులకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గతంలో ఎండీయు వాహనాల ద్వారా కేవలం రెండు మూడు రోజులు మాత్రమే ఈ రేషన్‌ను పంపిణీ చేసే వారని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తెలిపారు. నేడు 15 రోజులు పాటు కార్డుదారులకు సంబంధిత రేషన్ దుకాణాంలో ఈ నిత్యవసర వస్తువులను పేంపిణీ చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఈ సౌకర్యాన్ని కల్పించినట్టు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ వెల్లడించారు. వైట్ కార్డుదారులు దీనిని సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా కార్డుదారులకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు తహశీల్దార్ ఆమూరి ఆదిలక్ష్మి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ బి.రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణ వంశి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, జిల్లా టీడీపీ తెలుగు మహిళ ప్రతినిధి ఆరికట్ల సుమతి, మాజీ సొసైటీ అధ్యక్షులు సాధినేని శ్రీరామమూర్తి, సంతనూతలపాడు గ్రామ టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, మద్దిరాల సుబ్బారావు, శ్రీనివాసరావు, కోటంరాజు, ఎం.పోలిశెట్టి, కొప్పోలు శ్రీనివాసరావు, మార్పుడి జనార్ధన్, అంజయ్య, చెరుకూరి శ్రీనివాసరావు, బొడ్డపాటి చంద్రశేఖర్‌రావు, పీఎన్‌ఎస్ చౌదరి, ఆర్‌వి సురేష్‌బాబు, వి.కోటేశ్వరరావు, నల్లూరి గోపి, వి.అంకంశెట్టి, సీహెచ్ వెంకట సుబ్బయ్య, ఎస్‌కే నాయబ్, మనుబోతు బ్రహ్మయ్య, దుంపా సుబ్బారెడ్డి, కే.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా వైద్యశిబిరంలో 150 మందికి చికిత్సలు



**సంతనూతలపాడు, జూన్ 1, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నాడు ఒంగోలు వెంకట రమణ నర్సింగ్ హోమ్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 150 మంది రోగులకు చికిత్సలు, పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వెంకటరమణ హాస్పిటల్ ప్రముఖ మెదుడు, వెన్నుపూస, నరములు, వైద్య నిపుణులు డాక్టర్ కే.చంద్రశేఖర్ ఈ మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో రోగులకు వైద్యులు చంద్రశేఖర్, సుధాకర్, వేద వ్యాస్‌లు చికిత్సలు అందించారు. రోగులకు ఈసీజీ, ఎకో, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్ ఈ సందర్భంగా కోరారు. ఫస్ట్ ఎయిడ్ కమ్యూనిటీ పారా మెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కరేటి నరసింహారావు ఈకార్యక్రమంలో భాగంగా ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, టీడీపీ నాయకులు సాదినేని శ్రీరామమూర్తి, ఆర్‌వి సురేష్‌బాబు, మార్పుడి జనార్ధన్, హాస్పిటల్ మేనేజర్ షేక్ అహ్మద్, పీఆర్వో ఆలపాటి సూర్య ప్రకాష్, హాస్పిటల్ ప్రతినిధులు రాజేశ్వరి, సుశాంత్ సుగుణరావు, కళ్యాణ్, జెర్సీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 5 న తురిమెళ్ళలో గ్రామసభ

**కంభం, జూన్ 1, ప్రభాతవార్త**

కంభం మండలంలోని తురిమెళ్ళ గ్రామంలో జూన్ 5వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తురిమెళ్ళ సచివాలయంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మండల తహశిల్దార్ మరియు కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్వో) శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సమస్యలు ఉన్న వారు గ్రామసభకు హాజరై సరైన ఆధారాలతో తహశిల్దార్ ఆధ్వర్యంలో చూపించి మీ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. తురిమెళ్ళ సచివాలయ పరిధిలోని ప్రజలు, రైతులు ఈ గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## చౌక ధరల దుకాణాలను పునఃప్రారంభించిన తహశీల్దార్



**పొన్నలూరు, జూన్ 1, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పొన్నలూరులో 15,17వ నంబర్ల చౌక ధరల దుకాణాలను మండల తహశీల్దార్ పుల్లారావు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం నాయకులతో కలిసి ఆదివారం నాడు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు అనుకూలంగా ఉండేందుకు 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపు నందు సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అనుములు సాంబశివరావు మాట్లాడుతూ గతంలో ఎండీయు వాహనాల ద్వారా పంపిణీ చేసే సందర్భంలో రేషన్ సరుకుల కోసం కార్డుదారులు ఎండీయు వాహనం ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూసే వారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా కూటమి ప్రభుత్వంలో కార్డుదారులు ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు రేషన్ సరుకులు రేషన్ షాపు నుండి తెచ్చుకోవచ్చని అన్నారు. అలాగే దివ్యాంగులు, వయో వృద్దులకు రేషన్ సరుకులు డీలర్ల ద్వారా ఇంటి వద్దకే పంపించే ఏర్పాటు చేయడం జరుగుతుందని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు ఎంపీటీసీ సభ్యురాలు గంధం స్వప్న, పొన్నలూరు నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కర్ణ కోటిరెడ్డి, పిల్లి వెంకట నారాయణరెడ్డి, గుమ్మల వెంకటరావు, మన్నెం రమణయ్య, స్థానిక నాయకులు మండవ మురళి, పల్లపోతు రమేష్‌బాబు, మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు దొందేటి మధుబాబు, రేషన్ డీలర్లు మండవ వెంకటేశ్వర్లు, పల్లపోతు రమాదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనారాయణస్వామిని

### దర్శించుకున్న ఎంపీటీసీ సూరిశెట్టి



**హనుమంతునిపాడు, జూన్ 1, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలం నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి వారి కుటుంబ సభ్యులతో కలిసి మిట్టపాలెం శ్రీ నారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అందరికి అందుబాటులో నిత్యావసర సరుకులు

### - యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు



**యర్రగొండపాలెం,జూన్ 1,ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని రేషన్ షాప్ నెంబర్ 11 లో ఆదివారం యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు రేషన్ సరుకుల పంపిణీ కార్యాక్రమాని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం రేషన్ పంపిణీ కోసం వాహనాలు,డ్రైవర్లను ఏర్పాటు చేసి ఖర్చులను ప్రజలపై మోపిందని ఆయన అన్నారు.ఇప్పటి నుంచి ప్రతినెలా 15రోజులపాటు డీలర్ల నుంచి రేషన్ అందించే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు.ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచే రేషన్ షాప్ డీలర్లు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.65ఏళ్లు దాటిన వారికి,దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేస్తారు అన్నారు.తహశీల్దార్ మంజునాథరెడ్డి మాట్లాడుతూ జూన్1వ తేది నుండి రేషన్ షాపుల వద్దే రేషన్ పంపిణీ జరుగుతుందని తహశీల్దార్ అన్నారు.గతంలో రేషన్‌కార్డు లబ్దిదారుల ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ ఇచ్చే పరిస్థితి ఉండేదని,ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానాన్ని తొలగించి రేషన్ షాపుల వద్దే పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.కాబట్టి రేషన్‌పొందే లబ్దిదారులు రేషన్ షాపుల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాలన్నారు. 65 సంవత్సరాల వయస్సు కలిగి వృద్దాప్యంలో ఉన్నవారికి నడవలేని వికలాంగులకు రేషన్ ఇళ్లవద్దకు వచ్చి ఇవ్వడం జరుగుతుందన్నారు.ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం12గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8ంటల వరకు రేషన్ పంపిణీ జరుతుందన్నారు.ప్రజలు డీలర్లకు సహకరించి రేషన్‌సరుకులు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిటిరాధాకృష్ణ, తెలుగుదేశంపార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు,యం.మంత్రునాయక్,వేగినాటి శ్రీను,తోట మహేష్‌నాయుడు,చిటా ్యట వెంగళ్‌రెడ్డి, గోళ్లసుబ్బారావు,షేక్.మస్తాన్‌వలి,కుటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామి దేవస్థానం భూమిని

### ఆన్‌లైన్ చేయించిన ఎమ్మెల్యే ఉగ్రకు కృతజ్ఞతలు



**కనిగిరి, జూన్ 1, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని కొత్తూరు గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం భూమిని ఆన్‌లైన్ చేయటానికి చొరువ చూపిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి దేవస్థానం కమిటీ సభ్యులు ఆదివారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేవస్థానం సర్వే నెంబరు 535 లో 24 సెంట్ల విస్తీర్ణంలో ఉంది.అయితే అభయాంజనేయస్వామి దేవస్థానం నిర్మించి 15 ఏళ్లు అవుతున్న ఇంత వరకు భూమిని ఆన్‌లైన్ చేయడానికి ఏ ఎమ్మెల్యే చొరువ.. చూపలేదని ప్రస్తుత శాసనసభ్యులు నరసింహారెడ్డి చొరువతో భూమి దేవస్థానం పేరు మీద ఆన్‌లైన్ జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ భూమిని ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదుకు చొరువ తీసుకుని సహకరించిన ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ ఆసుల వెంకట రవికుమార్‌లకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో దేవస్థానం అభివృద్ధికి ఇదొక కీలకమైన ముందడుగు అవుతుందని కమిటీ అభిప్రాయపడింది. భూమి రికార్డుల స్పష్టత వల్ల భవిష్యత్తులో ఏదైనా చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండే అవకాశం ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

## కనిగిరిలో నూనత రేషన్ దుకాణాలు ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్ర

### - వృద్దులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే సరఫరా

### - ప్రభుత్వం సంకల్పంతో ముందడుగు



**కనిగిరి, జూన్ 1, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో సుభాష్ రోడ్డు, పాతూరు, దేవాంగనగర్,ఇందిరాకాలనీ,శంఖవరం, మాచవరం వంటి ప్రాంతాల్లోనూతనంగా ఏర్పాటైన రేషన్ దుకాణాలను శాసన సభ్యులు డాక్టర్‌ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లబ్దిదారులకు స్వయంగా రేషన్ సరఫరా చేస్తూ సామాన్యుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తపనతో పని చేస్తోందన్నారు. జూన్ 1వ తేదీ నుండి పాత విధానాన్ని తిరిగి అమల్లోకి తీసుకొచ్చి, రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువుల పంపిణీ కొనసాగించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ వాహనాల విధానం ప్రజలకు సంతృప్తికరంగా లేకపోవడంతోనే కూటమి ప్రభుత్వం ఈ మార్పులు చేసింది. ప్రతి నెల 1వ తేదీ నుండి 15 వ తేదీ వరకు రెండు పూటలా రేషన్ సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే, 65 సంవత్సరాలు పైబడిన వృద్దులు,దివ్యాంగులకు వారిఇంటి వద్దకే రేషన్‌సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, నాగ ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు, సంబంధిత శాఖాధికారులు, రేషన్ డీలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత సేవలను మెచ్చి మెడికల్ కిట్లను అందజేసిన హోరిజోన్ స్కూల్ యాజమాన్యం



**వేటపాలెం, జూన్ 1, ప్రభాతవార్త**

మండలంలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన పమిడాల సుబ్బారావు ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను గుర్తించి హారిజోన్ పబ్లిక్ స్కూల్ డైరక్టర్ పొగడదండ రవికుమార్ 10వేలు విలువ గల కట్టుకు సంబంధించిన మెడికల్ కిట్లు అందజేయడం జరిగింది ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ వైద్య రంగంలో ఉండి పేద ప్రజలకు తన వంతు కృషిగా ఉచిత వైద్యసేవలు అందించడం ఎంతో అభినందనీయమని సుబ్బారావుకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పలువురు మాట్లాడుతూ షుగర్ పేషెంట్స్, యాక్సిడెంట్ కేసులు, ఇతర గాయాలకు సంబంధించిన రోగులకు మన గ్రామంలోని, చుట్టు పక్కల గ్రామాల ప్రజలందరికి ఉచితంగా సేవలు అందిస్తున్న పమిడాల సుబ్బారావు(షారూఖ్ ఖాన్) ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సజ్జకోట నాగేశ్వరరావు,కీర్తివెంకటేశ్వర్లు, చందోలు వీరస్వామి,భీమవరపు శ్రీనివాసరావు,ఊటుకూరు శ్రీమన్నారాయణ, పేషెంట్లు పాల్గొన్నారు.

## చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం


### - దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర



**చీరాల, జూన్ 1, ప్రభాతవార్త**

చేనేత సహకార సంఘాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, దీని వలన చేనేత వ్యవస్థ నిర్వీర్యం అవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు లేదా పాలక మండలి నియమించాలని దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి 24000 ఇచ్చి ఆదుకోవాలన్నారు. కానీ ఆ పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. చేనేత సహకార సంఘాల నిర్వీర్యం అవుతున్నాయి, కావున వెంటనే సహకార సంఘాల, ఆప్కోల పాలక మండలి నియమించాలి, లేదా ఎన్నికలు నిర్వహించాలి, 200 యూనిట్లు విద్యుత్ జీవోకి పరిమితం చేయకుండా వెంటనే అమలు చేయాలన్నారు. ఆప్కో చైర్మన్ ని నామినేట్ చేసి ఇంత వరకు జీవో ఇవ్వకపోవడం దారుణమన్నారు. చేనేత వర్గంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి తార్కాణం, ప్రభుత్వం తలుచుకుంటే జవో ఇవ్వదా అని అడుగుతున్నాము, చేనేత వర్గం మద్దతుతో గెలిచిన లోకేష్ దీనిపై వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల్లో జీఎస్టీ గురించి హామీ ఇచ్చిన లోకేష్ ఇప్పటి వరకు దాని గురించి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అభివృద్ధితో పాటు ఆకలి చావులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కానీ అభివృద్ధి అని కొంగ జపం చేస్తున్న ప్రభుత్వం పేదల సంక్షేమం పట్టించుకోకపోవడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఆశలు సన్నగిల్లుతున్నాయన్నారు. కూటమి ఏడాది పాలనలో చేనేతలకు అందిన లబ్ది శూన్యం అని అన్నారు.

## వేటపాలెం మండలానికి బదిలీపై వచ్చిన నూతన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు









**వేటపాలెం, జూన్ 1, ప్రభాతవార్త**

వేటపాలెం మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గ్రేడ్ - 2 ప్రధానోపాధ్యాయులు కొత్తగా బదిలీపై రావడం జరిగింది. వేటపాలెం గర్ల్స్ హైస్కూల్‌కు దొనకొండ మండలం కొచ్చర్లకోట నుండి దేవరకొండ సరోజిని, పందిళ్ళపల్లి హైస్కూల్‌కు త్రిపురాంతకం మండలం గొల్లపల్లి నుండి తంగెళ్ల దీప్తి, అక్కయ్యపాలెం హైస్కూల్‌కు కారంచేడు మండలం యర్రంవారిపాలెం హైస్కూల్ నుండి జల్లె శేఖర్‌బాబు, కటారివారిపాలెం హైస్కూల్‌కు కారంచేడు మండలం కుంకలమర్రు నుండి కొత్త పద్మావతి బదిలీపై వచ్చి ఈ రోజు బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు వారిని అభినందించడం జరిగింది.

# వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



**సింగరాయకొండ, జూన్ 1,ప్రభాతవార్త**

జగనన్న పిలుపు మేరకు జూన్ 4న నిర్వహించనున్న "వెన్నుపోటు దినం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొండేపి నియోజకవర్గం ఇంచార్జి, పి.ఏ.సి సభ్యులు ఆదిమూలపు సురేష్ ప్రజలకు పిలుపునిచ్చారు.ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సురేష్ మాట్లాడు తు ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వాటిని ఎండగట్టాలనిపిలుపునిచ్చారు.వెన్నుపోటుదినాన్ని జనాల్లో చైతన్యంకలిగించే ఉద్యమంగా మార్చాలన్నారు. ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని, ఏడాది కాలంగా ప్రజలకు ఇస్తామన్న పథకాల లబ్ధి ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నియోజకవర్గం స్థాయిలోని వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా స్థానిక అధికారులుకు వినతి పత్రాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సింగరాయకొండ వైసీపీ మండల అధ్యక్షులు మసనం వెంకట్రావు, సీనియర్ నాయకులు బత్తుల అశోక్ కుమార్ రెడ్డి,నాయకులు డాకా పిచ్చిరెడ్డి, హరిబాబు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరుకు సిద్ధమైన సీపీఐ

**- యాసిన్ నేతృత్వంలో కొత్త కమిటీ ఎంపిక**




**కనిగిరి, జూన్ 1, ప్రభాతవార్త**

భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కనిగిరి నాలుగవ నియోజకవర్గ మహాసభలు ఘనంగా జరిగాయి. అనంతరం జరిగిన నియోజకవర్గ సమితిసమావేశంలో సయ్యద్ యాసిన్ మరోసారి నియోజకవర్గ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు వజ్రాల సుబ్బారావు, పండిటి మోహన్‌లను సహాయ కార్యదర్శులుగా ఎంపిక చేశారు. ఈ సమావేశంలో మొత్తం 61 మంది సమితి సభ్యులు, 21 మంది కార్యవర్గ సభ్యులు, ముగ్గురు ఆహ్వానితులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం దర్శిలోని చెంచయ్య భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుబరి రవీంద్రబాబు హాజరై నియోజకవర్గానికి ఎన్నికైన నూతన కమిటీ భవిష్యత్తు రాష్ట్ర, జిల్లా మహాసభలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు.

**సభలో అనేక తీర్మానాలు ఆమోదం పొందాయి :**

వెలుగొండ ప్రాజెక్టుకు రూ.4000 కోట్లు కేటాయించి, సంబంధిత రిజర్వాయర్లను అనుసంధానించాలి, నిమ్స్‌ను పారిశ్రామిక ఉత్పాదక కేంద్రంగా అభివృద్ధి చేయాలి, ట్రిబుల్ ఐటీ నిర్మాణం దోబగుంట గ్రామంలో జరగాలి, పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలాలు, పేద రైతులకు 2 ఎకరాల భూమి ఇవ్వాలి, కనిగిరిలోని చెరువులను సమ్మర్ స్టోరేజీలుగా అభివృద్ధి చేసి తాగునీరు పంపిణీ చేయాలి, నిలిచిపోయిన టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలి, ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి, పథకానికి నిధులు కేటాయించాన్నారు. ఈ సమావేశంలో పామూరు మండల కార్యదర్శి పోతుల ప్రభాకర్, కనిగిరి మండల కార్యదర్శి జీపీ రామారావు, కార్యవర్గ సభ్యులు ఎస్కే గులాం, పుట్టా సుబ్బారావు, షేక్ కాశీం పీరా, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరి 7వ వార్డు కొత్తూరులో రేషన్‌షాపు ప్రారంభం

**- ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు**

**టీడీపీ నాయకుల సమక్షంలో ప్రారంభోత్సవం**



**కనిగిరి, జూన్ 1, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు 7వ వార్డు కొత్తూరులో ఆదివారం నాడు కొత్త రేషన్‌దుకాణంప్రారంభమైంది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు తమ్మినేని సురేంద్రరెడ్డి, అచ్చాల రవి, ఉండేల శ్రీను, పిల్లి కిరణ్ శ్రీకాంత్, రవి కుమార్, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజలకు నిత్యవసర సరుకులువినియోగదారులకు సులభంగా అందించడమే ఈ రేషన్ దుకాణం స్థాపన ఉద్దేశం,గ్రామస్తులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు రేషన్ విధానాల గురించి అవగాహన కల్పించారు. ప్రాంత ప్రజలు ఈ నిర్ణయాన్ని హర్షంతో స్వాగతించారు. ఇకపై ప్రజలు తమకు రేషన్ కోసం పొలాలు దాటి మైలులు వెళ్లాల్సిన అవసరం ఉండదని వారు సంతోషం వ్యక్తం చేశారు.

# జూన్4న వెన్నుపోటు దినం

**- చంద్రబాబు మోసాలకు వైసీపీ ఆధ్వర్యంలో ప్రజా నిరసన**



**కనిగిరి, జూన్ 1, ప్రభాతవార్త**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కనిగిరి ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించబడింది. అన్ని మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ కార్యకర్తలతో ఏర్పాటైన ఈ సమావేశంలో పాల్గొని వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ ఏనాడూ అధికారం చేపట్టి ఒక్క హామీ నెరవేర్చని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రజల విశ్వాసానికి వెన్నుపోటు పొడిచారు. అందుకే జూన్ 4న నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి అమలుకాలేదు. రైతులకు గిట్టుబాటు ధర లేదు, యువత నిరుద్యోగంలో కూరుకుపోయారు. పింఛన్లు రద్దు చేశారు. ప్రజలు మోసపోయినట్లు ఇప్పుడే గ్రహిస్తున్నారని విమర్శించారు. కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారు. కానీ ఇప్పుడు ప్రజలు వారిని తిరస్కరించడం ప్రారంభించారు. వెన్నుపోటు దినం ద్వారా ప్రజా అసంతృప్తిని స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. అనంతరం నాయకత్వం వహిస్తున్న దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో జూన్4న కనిగిరిలో నిర్వహించిన నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాయం బలరామిరెడ్డి, వైఎం ప్రసాద్‌రెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, ముళ్లే శ్రీహరిరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, తాతపూడి నాని, డాక్టర్ రసూల్, షేక్ గయాజ్, మద్ది రాజు, తమ్మినేని శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**కనిగిరి, జూన్ 1, ప్రభాతవార్త**

మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలియజేశారు. విజయవాడలోని కేబీఎన్ కాలేజీలో ఆదివారం జాతీయ మానవ హక్కుల మండలి రాష్ట్రకార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఆయన అభినందించారు. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌ను దుశ్శాలువాతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ కమిటీ ఘనంగా సత్కరించింది.

## మన రేషన్ షాపు దుకాణాన్ని ప్రారంభించిన తహాశీల్దార్




**జె.పంగులూరు , జూన్ 1, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాట్టి రవికుమార్ అదేశాల మేరకు పంగులూరులోని మన రేషన్ మనషాపు కార్యక్రమంలో భాగంగా పొదా రామంజనేయులు రేషన్ దుకాణాన్ని తహాశీల్దార్ సింగారావు అదివారం ప్రారంభించారు. ఈ సందర్బంగా తహాశీల్దార్ సింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం మండలంలోని 34 రేషన్ దుకాణాలలో అన్ని అమర్చి ఉన్నాయని, 14,896 కార్డు దారులకు పంపిణీకి అన్ని సిద్దంగా వున్నాయన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ బండి మూడు,నాలుగు రోజుల మాత్రమే ఇవ్వటం జరుగుతుందన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల 1వ తేది నుండి 15వ తేది వరకు రేషన్ అందించడం జరుగుతుందన్నారు. మనము ఏ సమయములో నైనా వెళ్ళి రేషన్ తీసుకోవడానికి అవకాశం వుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుక్కపల్లి ఏడుకొండలు కోరారు. మండలంలోని 34 మన రేషన్, మన షాపు కార్యక్రమాలను అధికారులతో పాటు నాయకులు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ఒబయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ ఏ శరత్, నాయకులు కుక్కపల్లి వెంకటేశ్వర్లు, పంగులూరు మండల టిడిపి నాయకులు రావూరి రమేష్, జాగర్లమూడి సుబ్బారావు, షేక్ బాజీ, హనుమంతరావు, వడ్డేంపూడి హనుమంతరావు, రాయిని రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## మండల విశ్వబ్రహ్మణ సంఘ నూతన అధ్యక్షులుగా మచ్చా వెంకటేశ్వర్లు



**జె.పంగులూరు , జూన్ 1, ప్రభాతవార్త**

పంగులూరు మండల విశ్వబ్రహ్మణ సంఘ నూతన అధ్యక్షులుగా మచ్చా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఏన్నుకొన్నారు. మండలంలోని రేణింగవరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణములో సంఘ సభ్యులంతా కలిసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్షుడిగా మచ్చా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళపాటి నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా రావినూతల శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్బంగా బాపట్ల జిల్లా అధ్యక్షులు కడాలి జగదీశ్ మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులంతా విశ్వబ్రహ్మణ సంఘ అభివృద్ధికి తొడ్పాటును అందించాలని కోరారు. జిల్లా సంఘ నుండి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మునగంటి నరసింహచారి, కోశాధికారి మచ్చా సుధాకర్, ఉపాధ్యక్షులు మణికేశ్వరం మధు, గుంటుపల్లి బ్రహ్మం, కొండముది బాపూజి, అద్దంకి పట్టణ విశ్వబ్రహ్మణ సంఘ పామర్తి శ్రీనివాసరావు, మచ్చా శేషాచారి, కాజన అప్పయ్య, తక్కెళ్ళ పాటి రామకృష్ణ, ఉండవల్లి బ్రహ్మయ్య, కొండముది ఆంజనేయులు, మురికిపూడి ఓంకార శర్మ పలువురు సంఘీయులు పాల్గొన్నారు.

# పలు ప్రాంతాలలో విద్యుత్ కటింగ్

**అద్దంకి , జూన్ 1 ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంతోపాటు ధర్మవరం, పమిడిపాడు, రామకూరు, సబ్‌స్టేషన్‌ల పరిధిలో, భవానీసెంటర్, దర్శి రోడ్డు, గాంధీబొమ్మసెంటర్‌ల పరిధిలో మరమ్మత్తుల నిమిత్తం సోమవారం ఉదయం 9గంటల నుండి, మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో భవానీసెంటర్, దర్శిరోడ్డు, గవర్నమెంట్ ఆసుపత్రి వైపు, ఎన్‌టిఆర్ నగర్, పాతదామావారిపాలెం, కట్టకిందపాలెం, పెరికపాలెం, గాంధీబొమ్మ సెంటర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధిలో ధర్మవరం, పమిడిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో పమిడిపాడు గ్రామం, రామకూరు సబ్‌స్టేషన్ పరిధిలో రామకూరు గ్రామంలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సాంకేతిక పరమైన లోపాలను సరిచేసేందకు, విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఎడి దమోదరం తెలిపారు.

# 12,19 వార్డులలో రేషన్ పంపిణీ ప్రారంభం

**- కార్యక్రమాన్ని ప్రారంభించిన టిడిపి నేతలు**



**అద్దంకి , జూన్ 1, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేషన్ పంపిణీకి సంబంధించి వాహనాలను నిలిపివేసింది. ఈనేపద్యంలో జూన్ నెల రేషన్ పంపిణీ పాత పద్దతిలో రేషన్ షాపుల వద్ద నిర్వహించాలని, ప్రభుత్వం అదేశించింది. ఆమేరకు 12వ వార్డులోని రేషన్‌షాపులో పట్టణ టిడిపి అధ్యక్షులు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, వినియోగదారులకు బియ్యం, చెక్కెర పంపిణీ చేశారు. అదే విధంగా 19వ వార్డులో కూడ రేషన్‌షాపులో వినియోగదారులకు బియ్యం, చెక్కెర పంపిణీ కార్యక్రమాన్ని క్లష్టర్ ఇన్‌చార్జి కాకాని ఆశోక్‌బాబు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వడ్లవల్లి పూర్ణచంద్రరరావు, మాబు, మాలిక్, మొహిద్దీన్, వేజెండ్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## సృజన మరియు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కథా సంపుటి అవిష్కరణ



**అద్దంకి , జూన్ 1 ప్రభాతవార్త**

స్థానిక కమతేశ్వరస్వామి ఆలయంలో సృజన మరియు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ వడలి రాధాకృష్ణ(చీరాల) కథాసంపుటి గ్రీన్ లైట్ ఏరియా అవిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ సభకు చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించారు. కథాసంపుటిని శతావధాని శ్రీమాన్ నారాయణం బాలసుబ్రహ్మణ్యం అవిష్కరించారు. తొలి ప్రతిని సాహిత్యవేత్త చెన్నుపాటి రామాంజనేయులు స్వీకరించారు. వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) జ్యోతి ప్రజ్వలన చేశారు. కథారచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి కథాసంపుటిని సమీక్షిస్తూ రాధాకృష్ణగారి కథలు ప్రత్యేకమైన శైలిలో నేటి సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా సాగుతున్నాయన్నారు. అన్ని కథల్లోనూ మానవతావాదానికే వీరు పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చ ంద్రమౌళి, డాక్టర్ బీరం సుందరరావు, సర్వశ్రీ మంత్రి కృష్ణమోహన్, సంకా సుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, షేక్ మస్తాన్, రావూరి రంగయ్య, ఊటుకూరి రామకోటేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, నర్రా శ్రీలక్ష్మి, నిమ్మరాజు నాగేశ్వరరావు, అద్దంకి లేవి ప్రసాద్, దాసరి లక్ష్మీరాజ్యం, జాగర్లమూడి శివకుమారి, మస్తాన్ మాస్టార్, ఎన్. రాఘవరెడ్డి, అనంతు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## దగా కోరు చంద్రబాబు

**- వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**

**- జిల్లా అధ్యక్షులు మోరుగు నాగార్జున**



**అద్దంకి , జూన్ 1,ప్రభాతవార్త**

మోసపూరిత హామీలతో ఎన్నికల్లో విజయం సాధించి ఎప్పటి మాదిరిగానే తమను మోసం చేసిన విషయాన్ని ప్రజలు గ్రహించారని, వైఎస్ఆర్ సిపి బాపట్ల జిల్లా అధ్యక్షులు మోరుగ నాగార్జున అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం సమాయత్త కార్యక్రమాన్ని అదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు. ఈ సందర్బంగా నాగార్జున మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పండిన పంటలను కొనుగోలు చేయడం జరిగిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదన్నారు. వైట్ బర్లీ, నల్లబర్లీ సాగుచేసిన రైతులు నట్టేట మునిగారన్నారు. ఈ ప్రభుత్వం విద్యవైద్య రంగాలను విస్మరిందన్నారు. మోసపూరిత హామీలు ఎండిగట్టడం కోసమే వెన్నుపోటు కార్యక్రమాన్ని ఈనెల 4వ తేదిన నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు వేలాదిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


## మీరా సాహెబ్‌కు నరసింహారెడ్డి నివాళి



**అద్దంకి , జూన్ 1, ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి సోదరుడు పానెం నరసింహారెడ్డి అద్దంకి పట్టణంలోని 1వ వార్డు దూదేకుల పాలెం నందు వైఎస్ఆర్ పార్టీ కార్యకర్త షేక్ సైదా తండ్రి షేక్ మీరా సాహెబ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. వీరి వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధ కృష్ణమూర్తి, స్థానిక కౌన్సిలర్ కొత్తగోర్ల వెంకటసుబ్బారావు (బాలు) స్థానిక నాయకులు వున్నారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, జూన్ 1, ప్రభాతవార్త**

మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగల్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ కాటూరి ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

# పండుగలా రేషన్ సరుకుల పంపిణీ



**నాగులుప్పలపాడు, జూన్ 1, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరల దుకాణాల వద్ద రేషన్ సరుకులు పంపిణీ చేయాలని నిబంధనలను విధించడంతో జూన్1న మండలంలో చౌక ధరల దుకాణాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి గ్రామంలో రేషన్ షాపుల వద్ద తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు సరుకులు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. నాగులుప్పలపాడు, మద్దిరాలపాడు, చేకూరపాడు, చదలవాడ, ఉప్పుగుండూరు తిమ్మసముద్రం, మట్టికుంట, పోతవరం తదితర గ్రామాల్లో రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని పండుగల నేతలు కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రజలు రేషన్ షాపు వద్ద సరుకులని వినియోగించుకోవాలి

**- రేషన్ షాపును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు**



**దర్శి, జూన్ 1, ప్రభాతవార్త**

దర్శిలో నూతన రేషన్ షాపుని దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు ఆదివారం ప్రారంభించిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రేషన్ విధానం,మార్పులు చేస్తూ ఆదివారం రేషన్ కార్డు, రాష్ట్రంలో ఏ రేషన్ దుకాణంలోనైనా లబ్దిదారుడు ఎక్కడైనా తీసుకోవచ్చు, అనే ఒక కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం, వికలాంగులకు వృద్దులకు, రేషన్ షాపుకు వచ్చి తీసుకోలేని వారి కోసం, షాపు వారే ఇంటి వద్దకు వెళ్లి ఒకటో తారీకు నుండి ఐదో తారీకు లోపు వారికి రేషన్ అందించాలని మార్పు చేయడం జరిగింది. ఒకటో తారీకు నుండి 15వ తారీకు వరకు తప్పకుండా రేషన్ షాపులన్నీ కూడా ఉదయం, సాయంత్రం తెరిచి ఉంచబడతాయి. గత ప్రభుత్వంలో రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి రేషన్ అని, ఇంటింటికి వెళ్లి ఇవ్వకుండా రేషన్ బండ్లని వారికి నచ్చిన చోట పెట్టుకొని రేషన్ పంపిణీ సక్రమంగా ఇవ్వనందున ఆ బండ్లను రద్దు చేస్తూ పాత పద్దతిలోనే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈ రోజు మళ్లీ మొదలు పెట్టడం జరిగింది. దీనిని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మున్సిపాలిటీ చైర్మన్ నారపుశెట్టి పాపారావు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షుడు పుల్లలచెరువు సత్యనారాయణ(చిన్న), మాజీ టౌన్ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు స్వాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిపాటి లక్ష్మీ ఆదేశాల మేరకు బాధితులకు పింఛన్ అందజేత



**దర్శి, జూన్ 1, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని బొట్లపాలెం గ్రామం గోలపాటి సామ్యేల్(కిడ్నీవ్యాధి) డయాలసిస్‌తో బాధపడుతూ గుంటూరు సురక్ష హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఉండగా దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆదేశాల మేరకు బొట్లపాలెం పంచాయతీ సెక్రటరీ ఝాన్సీ రాణి ఆదివారం వాళ్ళ సిబ్బందితో గుంటూరు వెళ్లి బాధితుడికి పింఛన్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు, దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీకి, పంచాయతీ కార్యదర్శికి ధన్యవాదాలు తెలియజేశారు.

# పిల్లలలో మానసిక ఉల్లాసం పెరగాలి

**- ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు రాజరమేష్**



**దర్శి, జూన్ 1, ప్రభాతవార్త**

దర్శి బాలోత్సవం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 3వ రోజు కార్యక్రమంలో ఉత్సాహంగా జరిగాయి.అందులో భాగంగా అభ్యుదయ గీతాలు,డ్యాన్స్,మ్యాథ్స్,పన్డమెంటల్స్, పేపర్ క్రాఫ్టింగ్అంశాలను బి.రాజారమేష్, వై.శ్రీనివాస రెడ్డి,ఉప్పు మోహన్‌రావు, రమాదేవి, శిక్షణ ఇచ్చారు. రమేష్ మాట్లాడుతూ పిల్లలో సృజనాత్మకత పెంపొందాలంటే చదువుతో పాటు ఆటలు, పాటలు, నీతి కథలు, దేశభక్తి, వ్యాయామం సమాజం పట్ల అవగాహన అవసరమని అలా లేకుండా 4 గోడల మధ్య బాల బాలికలు బందీలుగా మారుతున్నారని మానసిక ఒత్తిడిని తట్టుకోలేక చిన్న, చిన్న విషయాలకే కుంగి పోవడం జరుగుతుందని, సెల్‌ఫోన్లకే పరిమితం కావడం జరుగుతుందని ఈ పెను ప్రమాదం నుండి కాపాడి ప్రత్యామ్నాయ సంస్కృతిని ముందుకు తీసుకురావడానికి బాలోత్సవాలు కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. మొత్తం 70మంది పిల్లలు పాల్గొని అనేక మెలుకువలు తెలుసుకోవడం, విజ్ఞానం పెంచుకోవడం జరిగిందని, సొంతంగా నేర్చుకోవడం జరుగుతుందని నిర్వాహకులు ఉప్పు నారాయణ,రమాదేవి, కేవీ పిచ్చయ్య, ఆదినారాయణ, నాగేశ్వరరావు తెలిపారు.

# వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, జూన్ 1, ప్రభాతవార్త**

వెన్నుపోటు అంటే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అందరికి తెలుసు, దుర్మార్గపు ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలను వంచించి కుటుంబంలో తల్లిని, చెల్లిని, వెన్నుపోటు పొడిచి బాబాయి, గొడ్డలిపోటును రాజకీయం చేసి ముఖ్యమంత్రి అయిన జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు అంటుంటే హేళనగా ఉందని, దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో ఖండించారు. ఏడాది ప్రజా పాలన చూసి ఓర్వలేని జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు అంటూ నిరసన కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటు అన్నారు. గత వైసీపీ చేసిన ద్రోహాలు ప్రజలు మర్చిపోలేదని, నవరత్నాల పేరుతో నవమాసాలు చేశారని విమర్శించారు. విద్యార్థి, యువత, వృద్దులు, ఉద్యోగ వర్గాలు, వ్యాపార, వ్యవసాయ తదితర అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి కేవలం 11సీట్లకే పరిమితమైన జగన్‌రెడ్డి నేనున్నానంటూ మర్చిపోకుండా తమ పార్టీ ఉనికి కాపాడుకునేందుకు, చేజారుతున్న వైసీపీ నేతలను నిలబెట్టుకునే ప్రయత్నం ఈ నిరసన కార్యక్రమం అన్నారు.

## ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించిన అధికారులు



**ముండ్లమూరు, జూన్ 1, ప్రభాతవార్త**

ముండల్మఊరు మండలంలోని పెద్ద ఉల్లడల్లు, పులిపాడు గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ - ఖరీఫ్ కార్యక్రమాన్ని కేవీకే నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ ప్రయాగ,ప్రధానశాస్త్రవేత్తకేవీకేనోడల్‌ఆఫీసర్ డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏ విధంగా శాస్త్రవేత్తల సలహాలతో చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ఈ పంట నమోదు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే విధంగా పథకాల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వివిధ అనుబంధ శాఖల అధికారులు, పెద్ద ఉల్లగల్లు, పులిపాడు గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్‌కు అంతరాయం



**వేటపాలెం, జూన్ 1, ప్రభాతవార్త**


మండలంలో పందిళ్ళపల్లి సబ్ స్టేషన్‌లోని పుల్లరిపాలెం ఫీడర్‌లో మరమ్మత్తులు చేయడం కొరకు జూన్2న సోమవారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. అన్ని ఫీడర్లో ఉన్నటువంటి పందిళ్ళపల్లి ఆక్వా రైతులు కొత్తరెడ్డిపాలెం, రామచంద్రాపురం గ్రామ ప్రజలు సహకరించాల్సిందిగా రూరల్ ఏఈ భాస్కరరావు కోరారు.

2-6Pg5.qxd:2-6Pg5.qxd 01/01/01 9:17 AM Page 1




# 100 మంది మహిళల కిడ్నాప్, ఎగుమతి!

## కలకలం సృష్టించిన శివాలయం లేఖ




**హిస్సార్, జూన్ 1:** హరియాణాలోని శివాలయం లో దొరికిన ఓ రహస్య లేఖలో దేశవ్యాప్తంగా 100మందిని కిడ్నాప్ చేసి పాకిస్థాన్, దుబాయ్‌కి అక్రమ రవాణా చేసినట్లు ఉంది. హిస్సార్‌లోని రెడ్ స్క్వేర్ మార్కెట్‌లోని శివాలయం వద్ద ఆలయ పూజారి సురేశ్‌కు ఈ లెటర్ కనిపించింది. అతడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. శివాలయం పూజారి సురేశ్ శనివారం ఉదయం 6గంటలకు ఆలయ ద్వారాలు తెరిచినప్పుడు గోధుమ రంగు కవరులో ఒక లేఖ కనిపించింది. దానిని తెరిచి చూశాడు. అందులో సంచనలన విషయాలు ఉన్నాయి. ఆ లెటర్‌పై తెలంగాణలోని నిజామాబాద్‌కు చెందిన ఆలకుంట సంపత్ చిరునామా ఉంది. దీంతో పూజారి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు లేఖను స్వాధీనం చేసుకున్నారు. దానిలోని విషయాలను పరిశీలించారు. హిస్సార్, అంబాలా, గురుగ్రామ్, సిర్సా, రేవారి, గంగానగర్, అజ్మీర్, నర్వానా సహా దేశంలోని వివిధ నగరాల నుంచి 80 నుంచి 100 మందిని గుర్తుతెలియని వ్యక్తి కిడ్నాప్ చేసి దుబాయ్, పాకిస్థాన్ కు విక్రయించినట్లు లేఖలో ఉంది. ఘటన తీవ్రతను గమనించిన పోలీసులు లేఖను సీనియర్ అధికారులకు అందించారు. వెంటనే ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. మేము 2018 నుంచి ఈ అక్రమ రవాణా ప్రారంభించాం. ఫతేహాబాద్‌కు చెందిన ఒక కుటుంబం మాకు సహాయం చేసేది. వారు లక్ష్యాలను ఎంచుకుని ప్రేమ లేదా డబ్బు లావాదేవీల ద్వారా ప్రజలను వలలో వేసుకునేవారు." అని గుర్తుతెలియని వ్యక్తి లేఖ రాశారు. హిస్సార్‌కు చెందిన సుమిత్ గార్గ్, అంబాలా వాసి దిగ్విజయ్, నర్వానాకు చెందిన నవీన్ రోహిలా, గురుగ్రామ్ వాసి అమర్‌నాథ్, ఎల్లనాబాద్ కు చెందిన వినోద్ కుమార్, అమిత్ బాగ్రి, రేవారీకి చెందిన అన్ను గులాటి, గంగానగర్‌కు చెందిన రోహిణి, సన్నీ, అజ్మీర్‌కు చెందిన అంకిత్ శర్మ, సిర్సాకు చెందిన అనూజ్, యాజ్‌పూర్‌కు చెందిన నరేశ్‌ను వేరే దేశాలకు అక్రమ రవాణా చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. ఇందులో ఒకరు పాకిస్థాన్ నుంచి పారిపోయారని కూడా లెటర్‌లో చెప్పారు. మహిళా ముఠా నాయకురాలు పారిపోయిన యువకుడిని పట్టుకుని చంపమని లేదా అతని కుటుంబం నుంచి ఒక వ్యక్తిని కిడ్నాప్ చేయమని బెదిరిస్తోందన్నారు. ఈలేఖలో హిస్సార్‌కు చెందిన సుమిత్ గార్గ్ గురించి ప్రస్తావించడం వల్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇదే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హిస్సార్ లో సుమిత్ అనే పేరు ఉన్న నాలుగైదు మంది కనిపించకుండాపోయినట్లు తేలింది. వారిలో ఎవరు అక్రమ రవాణాకు గురయ్యారో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో వారి కుటుంబాలను సంప్రదించారు. అలాగే అక్రమ రవాణాకు సాయం చేసిన ఫతేహాబాద్‌కు చెందిన కుటుంబం కోసం పోలీసులు వెతకడం ప్రారంభించారు. పాకిస్థాన్, దుబాయ్ వంటి ప్రదేశాలకు అక్రమ రవాణా జరుగుతుందని ప్రస్తావించడం వల్ల దర్యాప్తు సంస్థలు ఈ లేఖను తీవ్రంగా పరిగణిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తు చేపట్టడానికి హరియాణా పోలీసులు కేంద్ర సంస్థలను సంప్రదించారు.

అదే సమయంలో లేఖలో పేర్కొన్న వ్యక్తుల అదృశ్యాన్ని ధ్రువీకరించడానికి వారి కుటుంబాలను సంప్రదిస్తున్నారు. లేఖ కవరుపై పేరు ఉన్న వ్యక్తిని కనుగొనడానికి ఫోరెన్సిక్ విశ్లేషణ జరుగుతోందని హిస్సార్ పోలీసు సూపరింటెండెంట్ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. ఈ లేఖపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. అతి త్వరలో నిజం అందరికీ తెలుస్తుందన్నారు.



## గాజాపై అర నిమిషంలో 50 బాంబులు!
### మహమ్మద్ సిన్వర్ అంతానికి ఇజ్రాయెల్ పక్కా ప్లాన్

**గాజాసిటీ, జూన్ 1:** హమాస్ టాప్ కమాండర్ మహమ్మద్ సిన్వర్‌ను మట్టుబెట్టడానికి ఇజ్రాయెల్ పక్కా ప్రణాళికతో గత నెల 13న దాడి చేసింది. క్షణాల్లో పదుల సంఖ్యలో బాంబులు ప్రయోగించి హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ధ్వంసం చేసింది. దీనికి సంబంధించిన 3డి విడియోను తాజాగా ఇజ్రాయెల్ బలగాలు విడుదల చేశాయి. ఖాన్ యూనిస్‌లోని యూరోపియన్ ఆస్పత్రి కింద ఈ కమాండ్ సెంటర్ ఉన్నట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. హమాస్ ఉద్దేశపూర్వకంగానే అక్కడ తమ స్థావరాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆపరేషన్‌ను ఐడిఎఫ్ బలగాలు, ఇజ్రాయెల్ సెక్యూరిటీ అథారిటీ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ దాడికి అత్యంత కచ్చితత్వంతో పనిచేసే ఆయుధాలను వాడినట్లు పేర్కొన్నాయి. ఈ దాడి సమయంలో కేవలం 30 సెకన్లలో 50 బాంబులు హమాస్ కమాండ్ సెంటర్‌పై జారవిడిచారు. ఈ క్రమంలో ఆస్పత్రి భవనం తీవ్రంగా దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఇందుకోసం భారీగా ఇంటెలిజెన్స్ సేకరిం చారు. మరోవైపు ఈ దాడి కారణంగా 30 మంది చనిపోగా. 70 మంది గాయపడినట్లు హమాస్ నేతృత్వంలోని ఆరోగ్య శాఖ వెల్లడించింది.

హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ సోదరుడే మహ్మద్ సిన్వర్. ఆ సంస్థ మిలటరీ వింగ్ సారథి డెయిఫ్ మృతి తర్వాత ఆ బాధ్యతలను మహ్మద్ చేపట్టాడు. తర్వాత తన సోదరుడు యాహ్యా మరణానంతరం హమాస్ టాప్ కమాండర్‌గా ఎదిగాడు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి సూత్రధారిగా ఉన్న యాహ్యాసిన్వర్ గతేడాది మృతి చెందగా.. తాజాగా ఇతడు కూడా హతమయ్యాడు. అంతకుముందు.. హమాస్ అధినేతగా ఉన్న ఇస్మాయెల్ హనియే గతేడాది జూలైలో ఇరాన్‌లోని టెహ్రాన్‌లో జరిగిన బాంబు పేలుడు ఘటనలో హతమైన విషయం తెలిసిందే.

**మానవతా సహాయ కేంద్రం వద్ద ఇజ్రాయెల్ దాడులు:30మంది మృతి:** గాజాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేస్తోంది. తాజాగా ఆదివారం గాజాలోని రఫాపై టెల్‌అవీవ్ భీకర దాడులు చేసింది. ఈ ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రఫాలో గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్ఎఫ్) మానవతా సహాయ పంపిణీ కేంద్రం సమీపంలో ఈ దాడులు జరిగాయి. ఘటన సమయంలో వేలాది మంది పాలస్తీనియన్లు మానవతా సాయం తీసుకోవడం అక్కడ ఉన్నారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ దాడులు జరిపింది. ఇందులో 30 మంది మృతి చెందగా.. 115 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై హమాస్ స్పందిస్తూ.. మానవతా సాయం అందించే పేరుతో ఆకలితో అలమటిస్తున్న పౌరులపై ఇజ్రాయెల్ దళాలు సామూహిక హత్యలకు పాల్పడ్డాయని ఆరోపించింది. దీనిపై టెల్‌అవీవ్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణకు హమాస్ అంగీకరించిన కొద్ది గంటల్లోనే ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.

2023 అక్టోబరు నుంచి ఇజ్రాయెల్‌-హమాస్‌ల మధ్య జరుగుతున్న పోరులో గాజాలో 54 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. ఇటీవల మానవతా సాయాన్ని పరిమితంగా అందించేందుకు ఇజ్రాయెల్ అనుమతిచ్చింది. అయితే, ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం సరిపోదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే అమెరికా 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. దీనికి ఇజ్రాయెల్ ఇప్పటికే అంగీకరించగా హమాస్ కూడా ఒప్పుకుంది. అయితే, కాల్పుల విమరణకు సంబంధించి కొన్ని సవరణలను మాత్రం సూచించింది.



## మాజీ ప్రియుడి లాటరీ డబ్బుతీసుకొని కొత్త బాయ్‌ఫ్రెండ్‌తో పరార్

**రోమ్, జూన్ 1:** ఓ ప్రేమికుడికి దరిద్రం లాటరీ రూపంలో తగిలింది. ప్రైజ్‌మనీ రూ.కోట్లు అందాక ప్రియురాలితో కలిసి హాయిగా ఉండొచ్చని ఊహా ప్రపంచంలో తేలియాడాడు. కానీ, డబ్బు చేతికి వచ్చాక ప్రియురాలి అసలు రంగు బయట పడింది. ఆ లాటరీ సొమ్ముతో సహా పరారై కొత్త ప్రియుడితో సెటిల్ అయింది. ఇప్పుడా భగ్నప్రేమికుడు తన సొమ్ము ఇప్పించాలని కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. వివరాలిలా ఇన్నాయి.. కెనడాలోని విన్నిపెగ్‌కు చెందిన లారెన్స్ కాంపెల్ 2024లో ఒక లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు. అయితే.. అందులో అతడు రూ. 30 కోట్లను గెలుచుకున్నాడు. కానీ, తన వద్ద సరైన ఐడి కార్డు, బ్యాంకు ఖాతా లేకపోవడంతో తన ప్రియురాలు క్రిస్టల్ ఆన్ మెక్‌కే వివరాలు సంబంధిత అధికారులకు అందించాడు. ప్రైజ్‌మనీని ఆమె ఖాతాలోకి బదలీ చేయించాడు. అప్పటివరకు అతడితో సన్నిహితంగా ఉన్న ఆమె డబ్బు చేతికి అందిన వెంటనే తన అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. మొత్తం డబ్బుతో కొత్త ప్రియుడితో పరారైంది. దీంతో సొమ్ము ఒకడిది.. సోకు ఒకడిది అన్న చందంగా అతడి పరిస్థితి మారింది. ఏ మార్గంలోనూ మాజీ ప్రియుడు తనను సంప్రదించే వీలు లేకుండా జాగ్రత్త పడింది. ఆమె మోసాన్ని గ్రహించిన లారెన్స్ కాంపెల్ కోర్టును ఆశ్రయించాడు. తన డబ్బును తిరిగి ఇప్పించాలని కోరాడు. 'యేదాది నుంచి ఆమెతో రిలేషన్‌లో ఉన్నాను. జీవితమంతా క్రిస్టల్‌తోనే అని నిర్ణయించుకున్నా. కొంత కాలంగా లాటరీ కొనాలని ఆమె నన్ను ప్రోత్సహించింది. అందులో విజేతగా గెలవడంతో ఆమెపై పూర్తి విశ్వాసం ఉంచి తన వివరాలు అధికారులకు ఇచ్చా. ఆ తర్వాత కొంతకాలం నాతో సన్నిహితంగానే ఉంది. ఒకరోజు హోటల్‌కు వెళ్లగా బయటకు వెళ్లిన ఆమె మళ్లీ తిరిగి రాలేదు. డబ్బు చేతికి అందిన వెంటనే నన్ను వదిలి కొత్త ప్రియుడితో వెళ్లిపోయింది. ఎన్ని విధాలుగా ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో వేరే దారి లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించా' అని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

## వాష్‌ఆన్ వీల్స్‌తో లక్షాధికారైన మహిళ
### ప్రత్యేకించి అభినందించిన ప్రధాని మోడీ




**చింద్వారా (ఎంపి), జూన్ 1:** మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ టాయిలెట్లు శుభ్రం చేయడం ద్వారా 7 నెలల్లో లక్షాధికారి అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా ఆమెను కలిశారు. ఈ క్రమంలో ఆమె సంతోషపడింది. తన వృత్తి గురించి ప్రధాని మోదీకి వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచేందుకు మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లా యంత్రాంగం ఏడాది క్రితం వినూత్న ఆలోచన చేపట్టింది. టాయిలెట్లను శుభ్రంగా ఉంచేందుకు 'స్వచ్ఛతా సాథీ వాష్ ఆన్ వీల్' అనే కార్యక్రమం చేపట్టింది. స్వచ్ఛత సాథీ నేరుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి మరుగుదొడ్లను శుభ్రం చేస్తారు. వారికి నెలకు రూ.250రూ.300 వరకు ప్రభుత్వ కార్యాలయాలు ఇస్తాయి. అయితే హరాయ్ గిరిజన బ్లాక్ లోని ధనోరాకు చెందిన అనామిక బెల్వాంషి అనే మహిళ స్వచ్ఛతా సాథీ గా పనిచేస్తోంది. ఆమె గత 7 నెలలుగా ఇదే పనిచేస్తూ రూ.2,10,000 గౌరవ వేతనాన్ని పొందింది. భోపాల్‌లోని జంబోరి మైదానంలో లోక్ మాతా దేవి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా నిర్వహించిన మహిళా సాధికారత మహా సమ్మేళనంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ క్రమంలో ఛింద్వాడా జిల్లా యంత్రాంగం వినూత్న ఆలోచన 'వాష్ ఆన్ వీల్స్'ను మోదీ ప్రశంసించారు. అలాగే స్వచ్ఛతా సాథీగా పనిచేస్తూ లక్షాధికారైన అనామికను అభినందించారు. ఆమె అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. పని పట్ల ఆమెకున్న ఉత్సాహం, అంకితభావాన్ని ప్రశంసించారు. 7నెలల్లోనే లక్షాధికారి అయిన అనామిక వాష్ ఆన్ వీల్స్ ఆవిష్కరణను మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్ 2024 సెప్టెంబర్ 26న చిండి గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ ఆవిష్కరణ కింద మొత్తం 27,228 మరుగుదొడ్లను శుభ్రం చేశారు. వాటిలో 19,331 వ్యక్తిగత మరుగుదొడ్లు. స్వచ్ఛతా సాథీలు నెలకు రూ.25 వేల వరకు సంపాదిస్తున్నారు. అయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వాష్ ఆన్ వీల్స్ ఆవిష్కరణను అమలు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో ఛింద్వాడా జిల్లా అధికారి అగ్రిమ్ కుమార్ నేతృత్వంలో ఒక రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వాష్ ఆన్ వీల్స్ పనితీరును పరిశీలిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల మరుగుదొడ్లు క్రమం తప్పకుండా శుభ్రం చేసి ఉండవు. ఈ సమస్యను పరిష్కరించడానికి, మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లా యంత్రాంగం ఒక ఆవిష్కరణ చేసింది. స్వచ్ఛతా సాథీ వాష్ ఆన్ వీల్స్ ప్రచారాన్ని ప్రారంభించింది.

## నా బహిష్కరణకు కొందరి కుట్రలే కారణం: తేజ్‌ప్రతాప్ యాదవ్



**పాట్నా,జూన్ 1:** రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించిన వైనంపై తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. తన తల్లీదండ్రులు లాలూ ప్రసాద్, రబ్రీ దేవిని ఉద్దేశించి సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ చేశారు. నా ప్రాణమైన అమ్మానాన్నా మీరే నా ప్రపంచం. దేవుడి కంటే మీరే గొప్ప నాకు. మీ ఆదేశాలే నాకు శిరోధార్యం. మీరుంటే నాకు అన్నీ ఉన్నట్లే లెక్క. మీ ప్రేమ, నమ్మకం మాత్రమే నాకు కావాలి. నాన్న లేకపోతే ఈ పార్టీయే (ఆర్జేడీ) లేదు. అమ్మానాన్న మీరు ఎప్పుడూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలి. పార్టీ, కుటుంబం రెండింటి నుంచి తనను బహిష్కరించడానికి కుట్రలు కూడా కారణమని తేజ్ ప్రతాప్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తమ కుమారుడు వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా చేస్తున్న చర్యలు, సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న సమష్టి పోరాటాన్ని బలహీనపరుస్తున్నాయని లాలూ స్పష్టం చేశారు. తేజ్ ప్రతాప్ ప్రవర్తన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేదని పేర్కొన్నారు. ఈ కారణాల వల్ల అతడిని పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇకపై తేజ్ ప్రతాప్‌కు పార్టీలో, తమ కుటుంబంలో స్థానం లేదని వెల్లడించారు. ఇటీవలే తేజ్‌ప్రతాప్ ఫేస్‌బుక్‌లో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో లాలూ ఈ చర్యలకు ఉపక్రమించారు. భార్యతోనూ విభేదాలుకాగా, ఈ నిర్ణయంతో తేజ్ ప్రతాప్‌కు సంబంధించిన గత వివాదాలు కూడా మళ్లీ తెరపైకి వచ్చాయి. మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యతో అతడి పెళ్లి జరిగింది.

కానీ పెళ్లైన కొన్ని నెలల్లోనే ఆమె విడాకులు కోరారు. కొన్నాళ్ల క్రితం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు కనిపించింది. ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో ఉంది ఆ పోస్టులో. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, గత 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇది కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దీనిపై ఆయన ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు తేజ్ ప్రతాప్ యాదవ్. తన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయ్యిందన్నారు. తన కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసేందుకే ఎవరో ఇలాంటి పోస్టు చేశారని ఆరోపణలు గుప్పించారు. ఆ ఫొటో సైతం ఎడిట్ చేసిందని స్పష్టం చేశారు.

## బంగ్లా మాజీ పిఎంపై మరో నేరాభియోగం



**ఢాకా, జూన్ 1:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అక్కడి ప్రాసిక్యూటర్లు మరో నేరాభియోగాన్ని నమోదు చేశారు. 2024లో విద్యార్థుల ఉద్యమాన్ని ఆమె క్రూరంగా అణచివేయాలని చూసినట్లు పేర్కొన్నారు. భద్రతా దళాలు, తన పార్టీ సభ్యులు ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు చర్యలు తీసుకోవాలని హసీనా నేరుగా ఆదేశించినట్లు గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్లు, విడియో ఆధారాలున్నాయని చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం ఆదివారం పేర్కొన్నారు. దీనికి 81 మందిని సాక్షులుగా ఉన్నారని ఆయన చెప్పారు. దేశంలో సంక్షోభ సమస్యలో భద్రతా దళాలు తీసుకొన్న చర్య లకు నాటి దేశాధినేతగా హసీనాదే బాధ్యత అని తాజుల్ చెప్పారు. ఆమె చేపట్టిన అణచివేత కార్యక్రమంలో దాదాపు 1500 మంది మరణించగా 25,000 మంది గాయపడ్డారు. గతేడాది బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగడంతో ఆ దేశ ప్రధాని పదవికి హసీనా రాజీనామా చేశారు. దాదాపు 15 యేళ్లపాటు ఆమె దేశాన్ని పాలించారు. గత ఆగస్టులో ఆమె ఢాకాను వీడి న్యూఢిల్లీకి చేరుకొన్నారు. నాటి నుంచి ఆమె అక్కడే ఆశ్రయం పొందారు. బంగ్లాదేశ్‌లో ప్రధాన సలహాదారుగా యూనస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం వరుసగా హసీనాపై కేసులను బనాయిస్తోంది. ఆమె కుటుంబసభ్యులపై పలు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు ఆమెపై ఇప్పటికే 100కుపైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్ ఆమెపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

## జగన్నాథ రథానికి సుఖోయ్ జెట్ టైర్లు



**పూరి, జూన్ 1:** భారత ప్రధాన ఫైటర్ జెట్ అయిన సుఖోయ్30 కోసం తయారు చేసిన యుద్ధ విమానం టైర్లను జగన్నాథుడి రథ చక్రాలుగా వాడనున్నారు. ఈ విషయాన్ని కోల్‌కతా లోని జగన్నాథ మందిరం నిర్వాహక సంస్థ అయిన ఇస్కాన్ వెల్లడించింది. గతంలో ఈ ఆలయంలోని స్వామివారి రథానికి బోయింగ్ విమానం టైర్లు వినియోగించేవారు. అయితే గత 15 ఏళ్లుగా వాటిని కొనుగోలు చేయడం ఇస్కాన్‌కు సాధ్యం కాలేదు. గత ఏడాది ఈ రథం టైర్లలో సమస్యలు మొదలయ్యాయి. దాంతో ఇస్కాన్ నిర్వాహకులు సుఖోయ్30 ఫైటర్ జెట్‌కు వినియోగించే టైర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కోల్‌కతా ఇస్కాన్ ప్రతినిధి రాధారమన్ దాస్ వెల్లడించారు. తాము ఆ టైర్లకు ఆర్డర్ పెట్టడంతో యుద్ధ విమానం టైర్లతో అవసరం ఏంటని సదరు కంపెనీ కూడా ఆశ్చర్యపోయిందని రాధారమన్ దాస్ చెప్పారు. వారికి రథం సమస్యను వివరించి, ఆలయానికి ఆహ్వానించి పరిశీలించాలని కోరామని తెలిపారు. దాంతో వారు తమకు నాలుగు టైర్లు విక్రయించేందుకు అంగీకరించారని చెప్పారు. తాజాగా వాటిని రథానికి అమరుస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వామివారు సుఖోయ్ కోసం తయారు చేసిన టైర్లు అమర్చిన వాహనంపై ఊరేగుతారని వెల్లడించారు. దాంతో స్వామివారికి దాదాపు 48 ఏళ్ల తర్వాత కొత్త చక్రాలు లభించినట్లైంది. జగన్నాథ రథం గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో నడుస్తుందని పేర్కొన్నారు. సుఖోయ్ టైర్లు గంటకు 280 కిలోమీటర్ల వేగాన్ని కూడా తట్టుకోగలవని ఆలయ నిర్వాహకులు చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్ వ్యాఖ్యలపై లాస్టూడెంట్ శర్మిష్ఠపనోలి అరెస్టు



**కోల్‌కత్తా, జూన్ 1:** ఆపరేషన్ సింధూర్ సమయంలో సోషల్‌మీడియాలో అభ్యంతరకరమైన వ్యాఖ్యలున్న విడియోను పోస్టుచేసిందన్న అభియోగాలతో 22 ఏళ్ల న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలిని గురుగ్రామ్‌లో అరెస్టు చేసిన కోల్‌కత్తా పోలీసులు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు జ్యూడిషియల్‌కస్టడీ విదించడంతో జైలుకు తరలించారు. కోల్‌కత్తాలోని ఆనంద పూర్‌ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పనోలి పూణెలో న్యాయ యూనివర్సిటీలో నాలుగో ఏడాది చదువుతోంది. లింక్డిన్‌ప్రొఫైల్‌లో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 94 వేలమంది ఫాలో వర్లున్నారు. రాజకీయాలపై తనదైనశైలిలో వ్యాఖ్యలుజోడించి తన వ్యూస్ బలంగా చెపుతుడంతో పాపులర్ అయిపోయింది. ఆపరేషన్ సింధూర్‌పై బాలివుడ్ ప్రముఖుల మౌనం ఆమె ప్రశ్నించింది. ఈ విడియోపై భారీ ఎత్తున విమర్శలు రావడంతో ఆమె తన పోస్టులు, రీల్స్ ను తొలగించి క్షమాపణలు చెప్పింది. అయితే శర్మిష్ఠను అరెస్టుచేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఆమెను అరెస్టుచేసి కోర్టులోప్రవేశపెట్టారు. ఆమెకు నోటీసులు జారీచేసినా కుటుంబ సభ్యులకు లీగల్ నోటీసులు ఇచ్చినా హాజరు కాలేదని, కటుంబంతో కలిసి ఎక్కడికో వెళ్లిపోయారని పోలీసులు కోర్టుకు నివేదించారు. దీనితో కోల్‌కత్తాకోర్టు శర్మిష్ఠ అరెస్టుకు వారంట్ జారీచేయడంతో ఆమె గురుగ్రామ్‌లో ఉన్నట్లు ట్రాక్‌చేసిన పోలీసులు అరెస్టుచేసారు. అన్ని డిజిటల్ ఆధారాలు రికవరీచేసారని, కస్టడీ అవసరంలేదని శర్మిష్ఠ న్యాయవాది చేసిన వాదనను కోర్టు తిరస్క రించింది. కాగా ఈమె అరెస్టుపై డచ్ ఎంపి గీర్ట్ వైల్డర్స్ స్పందించారు. సోషల్‌మీడియా పోస్టుతో ఆమెను అరెస్టు చేయడం సరికాదన్నారు. వాక్ స్వేచ్ఛకు ఇది భంగం కలిగించడమే అన్నారు. శర్మిష్ఠను శిక్షించవద్దన్నారు. ఆమె విడుదలకు ఆదేశించాలని ఆయన ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసారు.

## జ్యోతి పాక్ పర్యటనకు సిఎం అల్లుడు స్పాన్సర్!



**తిరువనంతపురం, జూన్ 1 :** భారత సైన్యానికి చెందిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్టు చేశారు. ఆమె కేరళ పర్యటనపై ఆ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె సురేంద్రన్ సంచలన ఆరోపణలు చేశారు. కేరళ పర్యాటక శాఖ మంత్రి పీఏ మహమ్మద్ రియాస్ నేతృ త్వంలో జ్యోతి మల్హోత్రా పర్యటనకు టూరిజం డిపార్ట్‌మెంట్ స్పాన్సర్ చేసిందని సురేంద్రన్ ఆరోపించారు. మహ్మద్ రియాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అల్లుడని, ఆయన నేతృత్వంలోని కేరళ పర్యాటక శాఖ పాకిస్థాన్ గూఢచారి జ్యోతి మల్హోత్రా కన్నూర్ ట్రిప్‌కు స్పాన్సర్ చేసిందని చెప్పారు. 'టూర్‌లో ఆమె ఎవరిని కలిసింది, ఎక్కడికి వెళ్లింది, అసలు ఆమె అజెండా ఏంటి, పాక్‌తో సంబంధాలు ఉన్న వ్యక్తికి కేరళలో రెడ్ కార్పెట్ ఎందుకు వేశారు?' అని సురేంద్రన్ తన సోషల్‌మీడియా హ్యాండిల్‌లో ప్రశ్నించారు.

## రైల్వేట్రాక్‌పై కూలిన వంతెన: ఏడుగురు మృతి, 30మందికి గాయాలు



**మాస్కో, జూన్ 1:** రష్యాలోని ఉక్రెయిన్ సరిహద్దుల్లో ఘోరప్రమాదం జరిగింది. పశ్చిమ బ్రియాన్స్క్ ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై వంతెన కూలిపోయింది. అదే సమయంలో మాస్కో నుంచి క్లిమోవ్‌కు వెళుతున్న ప్యాసింజర్‌రైలు పట్టాలు తప్పి ఏడుగురు మరణించారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో రైలు లోకోపైలట్‌కూడా ఉన్నట్లు ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ జోగోమాజ్ తెలిపారు. ఎమర్జెన్సీ సర్వీసెస్ హుటాహుటిన ప్రమాద స్థలానికిచేరుకుని సహాయక చర్యలుచేపట్టాయన్నారు. ఫెడరల్ హైవే సమీపంలో రైలు పట్టాలు తప్పిందని అన్నారు. ప్రభుత్వ వర్గాలు షేర్‌చేసిన ఫొటోల్లో రైలుపై వంతెన కాంక్రీట్ ముక్కలు పడిపోవడంతో బోగీలు చెల్లాచెదురయ్యాయి. అయితే బ్రిడ్జి ప్రమాదవశాత్తూ కూలిందా లేక ఎవరైనా పేల్చివేసారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వంతెనను ఉద్దేశ్యపూర్వకంగా పేల్చివేసి ఉండవచ్చని స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి. అయితే ఇప్పటివరకూ ఉక్రెయిన్ ఈ బ్రిడ్జి కూలిపోవడంపై స్పందించలేదు.

## బాలికపై ఆరుగురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడి

**బెంగళూరు, జూన్ 1:** బాలికపై ఆరుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వీడియో రికార్డ్ చేసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. మరోసారి ఆ బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మళ్లీ బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కర్ణాటకలోని బెలగావిలో ఈ సంఘటన జరిగింది. 15 ఏళ్ల బాలికను ఆమె స్నేహితుడు ఆరు నెలల కిందట బెలగావి శివార్లలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తన స్నేహితులతో కలిసి ఆ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిని మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేశారు.కాగా, ఈ వీడియోతో బాలికను ఆ వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేశాడు. అక్కడకు రాకపోతే వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించాడు. మళ్లీ ఆ ప్రాంతానికి ఆమెను రప్పించాడు. తన స్నేహితులతో కలిసి గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డాడు. మరోసారి దీనిని రికార్డ్ చేశాడు. పదేపదే ఆమెను బెదిరించసాగాడు. మరోవైపు విసిగిపోయిన ఆ బాలిక మే 31న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ వెంటనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మిగతా నలుగురు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

2-6Pg6exHMNWJQEffffffffff.qxd:2-6Pg6exHMNWJQE.qxd 01/01/01 9:43 AM Page 1



# దేవాలయాల బదలీల్లో అందరికి అవకాశం కల్పించండి!

## రాష్ట్ర కార్యదర్శి సింగరాజు బాలసుబ్రమణ్యం శాస్త్రి



**శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో బదిలీలతో అందరికి అవకాశం కల్పించాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రపౌరోహితం విభాగం కార్య దర్శి సింగరాజు బాలసుబ్రమణ్యం శాస్త్రి పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ సర్వసభ్యసమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఈ అంశాలకు సంబంధించి ఆయన మీడియాకు వివరిస్తూ రాష్ట్రంలో ఎంతో ప్రాశస్త్యం కల్గిన దేవాలయాల్లో ఒక్కొక్క దేవాలయంలో ఒక్కొక్క సంప్రదాయం ఉంటుందన్నారు. అక్కడ పూజా విధానాలు భిన్నంగా ఉంటాయని వివరించారు. అయితే ఆచార వ్యవహారాలకు సంబంధించి అర్చకులు, పరిచారకులను భిన్న సంప్రదాయాలు, సంస్కృతులతో వారిని బదిలి చేయటానికి వీలుండదని కానీ దేవాలయాల్లో వేదపారాయణ చేయటానికి నియమింపబడ్డ వారిని ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసేటటువంటి వారికి వర్తించే నియమనిబంధనలు వీరికి వర్తింపజేయక పోవటం ఆశ్చర్యకరమన్నారు. ఒక దేవాల యంలో జీతభత్యాలు ఇవ్వలేక మరో దేవాలయానికి బదిలి చేస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేక పోవటం ఏమిటని ప్రశ్నించారు. వేదపారాయణ దారులను ఒకే చోట సంవత్సరాల కొద్ది ఉండటంతో కొన్ని అవకతవకలు, అక్రమాలకు పాల్పడుతూ ఆయా దేవాలయాలకు క్షేత్రాలకు కళంకం తెస్తున్నారని కావున సిఎం, డెప్యూటీ సిఎం, దేవాదాయశాఖ మంత్రి, స్థానిక నాయకులు పరిశీలించాలన్నారు. వేదపండితులను బదిలీల ఉత్తర్వులను అమలు చేయాలన్నారు.

## జులై 9న నిర్వహించే ఆందోళనకు జర్నలిస్టు సంఘాల మద్దతు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** రద్దు చేసిన చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని జాతీయ కార్మిక సంఘాలు జులై 9న నిర్వహించే ఆందోళనలో జర్నలిస్టులు కూడా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) పిలుపునిచ్చింది. ఈ మేరకు విశాఖపట్నంలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# భార్యపై భర్త హత్యాయత్నం

**నెల్లూరు క్రైమ్, జూన్ 1, ప్రభాతవార్త :** భార్యపై అనుమానం పెంచుకున్న ఓ దుర్మార్గుడు చివరకు ఆమెను కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాలాజీ నగర్ పోలీసుల కథనం మేరకు శ్రామిక్ నగర్‌కు చెందిన బండ్ల రమ, శ్రీనాథ్ దంపతులకు 2017లో వివాహమైంది. శ్రీనాథ్ ఆటో నడుపుతూ జీవనోపాధి సాగిస్తున్నాడు. రమ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్మూర్తి నగర్‌లో బ్యూటీ సెలూన్‌లో పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న శ్రీనాథ్ తరచు ఆమెతో గొడవ దిగుతుండేవాడు. దీనికి కొంత కాలం కిందట ఆమె నాలుగు దూరంగా జరిగి తమ ఇద్దరు పిల్లలతో జీవిస్తూ వచ్చింది. ఇటీవల పెద్దలు వారిద్దరికీ రాజీ కుదరచ్చడంతో తిరిగి భర్తతో కలిసి కాపురం చేస్తోంది. అయినప్పటికీ ఆమెపై ఉన్న అనుమానంతో రగిలిపోతున్న శ్రీనాథ్ ఆదివారం పనిచేసే సెలూన్ వద్దకు వచ్చిన రమ్య లోపలికి వెళ్లబోతుండగా ఆమెపై కత్తితో దాడి చేశాడు.

స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో శ్రీనాథ్ పరారయ్యాడు. సంఘటన విషయం తెలుసుకున్న బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు సంఘటన స్థలాన్ని చేరుకుని తీవ్ర గాయాలు పాలైన రమ్యను ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## సమిష్టి కృషితో మాదక ద్రవ్య రవహిత భారతావనిని సాధిద్దాం : జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్




**గుంటూరు తూర్పు, జూన్ 1 ప్రభాతవార్త :** సమిష్టి కృషితో మాదక ద్రవ్య రవహిత భారతావని ని సాధిద్దామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ తేజ ఆధ్వర్యంలో జిల్లా ఈగల్ విభాగం, అబ్కారీశాఖ, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డ్రగ్ డి ఎడిక్షన్ కేంద్రం వారు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ పౌరులు మాదక ద్రవ్యాల వాడకాన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన నడక కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క క్లిష్టమైన సవాలును గుర్తించి, భారత ప్రభుత్వం 2020 ఆగస్టు 15న "నాషాముక్త్ భారత అ భియాన్"ను ప్రారంభించింది. ఇది మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక కింద ఒక కీలక చొరవ. ఈ కార్యక్రమ ప్రారంభంలో 272 మాదక ద్రవ్యాలు అధిక - ప్రమాదకరంగా ఉన్న జిల్లాలను ఎంపిక చేసి వాటిలో అమలు చేయబడింది. మాదకద్రవ్య వినియోగంపై జాతీయ సర్వే, మాదక ద్రవ్య నియంత్రణ బ్యూరో నుండి ఇన్‌పుట్‌ల ద్వారా గుర్తించబడింది. నాషా ముక్త భారత అభియాన్ అప్పటి నుండి దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించింది. పరివర్తన కలిగించే దేశ నిర్మాణ మిషన్‌గా ఊహించబడిన ఎన్ఎంబిఏ ఆరోగ్యకరమైన, క్రమశిక్షణ కలిగిన మాదకద్రవ్య రహిత యువత జనాభాను పెంపొందించడం ద్వారా జాతీయ అభివృద్ధి, సామాజిక శ్రేయస్సు మొకచ్చ విస్తృత లక్ష్యానికి దోహదపడటం లక్ష్యంగా పెట్టుకుంది. కావున ప్రతి ఒక్కరూ ఈ మాదక ద్రవ్య రహిత భారత్ సాధనపై దృష్టి సారించి విశేష కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో ఎస్పీ, ఇన్‌ఛార్జి కలెక్టర్‌తో పాటు పలువురు పోలీస్, రెవిన్యూ, ఇతరశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో అన్ని ప్రాంతాల్లో యోగా కేంద్రాలు

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్

గుంటూరుతూర్పు,జూన్1,ప్రభాతవార్త: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రానున్న కాలంలో నలువైపులా యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని



ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆశయ సాధనలో భాగంగా యోగాంధ్రప్రదేశ్2025 లక్ష్యంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా గురువు జుజ్జూరు శ్రీనివాసరావు యోగాసనాలు వేయించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని, అందుకే యోగాకు ప్రాముఖ్యత మరింతగా పెరుగుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య నిపుణులు, వైద్యులు యోగాను ఒక సమగ్ర ఆరోగ్య సాధనంగా చెబుతున్నారని అన్నారు. యోగా అనేది కేవలం ఆరోగ్యానికే కాదని, మానసిక ప్రశాంతతకూ మార్గమని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఆనందం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా చేయడం వల్ల నిద్రలేమి, మానసిక ఒత్తిడి, అధిక రక్తపోటు వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందన్నారు. ఇటీవల కాలంలో యువత కూడా యోగాపై ఆసక్తి చూపుతున్నారని, ఇది సంతోషకరమని పేర్కొన్నారు.

## శ్రీరామనామక్షేత్రంలో సమ్మర్ క్యాంపు ముగింపు సభ



గుంటూరు కల్చరల్,జూన్ 1,ప్రభాతవార్త : స్థానిక సంపత్‌నగర్ శ్రీ రామనామక్షేత్రంలో గత నెలరోజులుగా జరుగుతున్న సమ్మర్ క్యాంప్ ముగింపు సభ ఆదివారం సాయంత్రం జరిగింది. సద్గురు కళానిలయం నిర్వహణలో సభాధ్యక్షులుగా నంది అవార్డు గ్రహీత బసవరాజు జయశంకర్, ఆత్మీయ అతిధిగా ఎస్.వి.రమణ రవిబాబు, నడింపల్లి హనుమంత రావు, ముఖ్యఅతిధి, సన్మాన గ్రహీత ప్రముఖ నాట్యాచార్యులు, కళారత్న పురస్కార గ్రహీత కాజా సుబ్రహ్మణ్యం దంపతులు, శిక్షణాచార్యులు బసవరావు జయశంకర్, పి.వి.లక్ష్మి తేజస్వీ, వై.ఆర్. సుబ్రహ్మణ్యం, శ్రీకిన్నెర, బి.రామకృష్ణారావు, పి.హేమలత నారాయణ పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ రాఘవాచారి వేదస్వస్థి ప్రార్ధనతో ప్రారంభించారు. ముఖ్యఅతిధి మాట్లాడుతూ నెలరోజుల పాటు సాంప్రదాయ కళల్లో ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహించిన జయశంకర్ మరియు వారి బృందం అభినందనీయులన్నారు. ప్రత్యేకంగా చిన్నారుల తల్లిదండ్రులు అందించిన సహకారం ప్రశంసనీయమన్నారు. అనంతరం అతిధులు కళారత్న గ్రహీత కాజా సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సత్కరించారు. చిన్నారులకు శిక్షణ నిచ్చిన గురువులను సన్మానించి, చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు అద్భుత ప్రదర్శనలిచ్చారు.

# ఉద్యోగుల హక్కుల సాధనే ధ్యేయం

## ఎపి ఎన్జీవోస్ నూతన అధ్యక్షుడు విద్యాసాగర్

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా వివిధ పదవులు నిర్వహించిన నన్ను ఏపీఎన్జీవో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడాన్ని జీవితంలో మరచిపోలేనని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం వారి వెన్నంటే ఉంటానన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి. సామరస్యంగా చర్చించి, పరిష్కారం కోసం కృషిచేస్తా అని విజయవాడలోని ఏపీఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్‌ను ఆమోదిస్తూ కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తరువాత ఏపీఎన్జీవో కార్యాలయం నుంచి ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగిన మహాత్మాగాంధీ రోడ్డులోని కల్యాణ మండపం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. సభలో విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తన కార్యాచరణ ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ.27500 కోట్ల బకాయిలు పెట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుత పాలకుల దృష్టికి ఆయా అంశాలను ఇప్పటికే తీసుకెళ్లామని, ప్రభుత్వం పీఆర్సి ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, సరెండర్ లీవ్ మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చాక ఉద్యోగులకు రూ.7500 కోట్ల బకాయిలు చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం



ఏపీ ఎన్జీవోస్ నూతన అధ్యక్షునిగా విద్యాసాగర్ ప్రమాణం చేస్తున్న దృశ్యం

ఉద్యోగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసుకుంటున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు విద్యాసాగర్‌తో ఏపీఎన్జీవో పూర్వ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఎపి ఎన్‌జిఒ పూర్వ అధ్యక్షులు కెవి శివారెడ్డి మాట్లాడుతూరాష్ట్రంలో ఎంతో పేరు ప్రతిష్టలు కలిగిన ఎపి ఎన్‌జిఒ సంఘానికి విద్యాసాగర్ వంటి నాయకుల అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతి ఒక్క ప్రయోజనాన్ని ఉద్యోగులకు విద్యాసాగర్ అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహే శ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు పాల్గొని నూతన నాయకత్వానికి అభినందనలు తెలిపారు.


ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ బొండా ఉమామహే శ్వరరావు 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్తలకు కూడా బెల్ట్‌షాపులు

## బ్రాందీ షాపులన్నీ ఎంఎల్ఎలవే..సీసాకు పది రూపాయల కమీషన్

### రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం

**అనంతపురం, జూన్ 1 ప్రభాతవార్త బ్యూరో:** మద్యం షాపులన్నీ టిడిపి ఎమ్మెల్యేలవే అని, మద్యం షాపుల్లో సీసాకు 10 రూపాయలు చొప్పున కమిషన్లు పెట్టుకున్నారని, బెల్ట్ షాపులు మాత్రం టిడిపి కార్యకర్తలకు ఇచ్చారని రాప్తాడు మాజి ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. వైసిపి కార్యకర్తలు, నాయకులను వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని, రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్కును అమలు చేస్తూ పోతే వైసీపీ కార్యకర్తలు కూడా ఎక్కడికక్కడ బుక్కులు రాసుకుంటారని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టే వెన్నుపోటు దినంను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం జిల్లాలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసగించారనే బాధ,



పోస్టర్లను విడుదల చేస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

వెన్నుపోటుకు గురవుతున్నామని భావిస్తున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు దినంకు పిలుపునిచ్చారన్నారు. ఆరోజు రాప్తాడులో నియోజకవర్గ వ్యాప్తంగా బాధితులు, ప్రజలను కలుపుకొని కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. గతేడాది కాలంలో రాష్ట్రంలో 390 మంది వైఎస్సార్‌సిపి నాయకులు, కార్యకర్తలను హత్య చేశారని పేర్కొన్నారు. మరో 376 మందిపై హత్యాయత్నాలు చేశారన్నారు. అరాచకంగా బీహార్‌ను తలదన్నేలా పరిపాలన సాగుతోందంటూ డిల్లీలో కూడా గళం ఇప్పే పరిస్థితి దాపురించిందన్నారు. వైఎస్సార్‌సిపి కార్యకర్తలపై 2466 అక్రమ కేసులు బనాయించి, అలాగే 500 మందిని జైల్లో పెట్టారన్నారు. 440 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, వీరిలో 79 మందిని జైళ్లకు పంపారని, మొన్న జరిగిన దగానాడులో వికాటహాసాలతో లోకేష్ బాబు ఇవే చెప్పాడన్నారు.

# స్విమ్మింగ్ టోర్నీలో జగ్గయ్యపేట బాలుర ప్రతిభ




హైదరాబాద్‌లో జరిగిన ఈతల పోటీల్లో 14 పతకాలు సాధించిన జగ్గయ్యపేట ముగ్గురు బాలురు పొలది వివేక్, కూచిపూడి సుబ్రహ్మణ్య కృష్ణ, కూచిపూడి రేవంత్‌లతో కోచ్ పొట్టాబత్తిన సందీప్.

**జగ్గయ్యపేట, జూన్ 1, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో జరిగిన ఈతల పోటీల్లో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ముగ్గురు బాలురు విశేష ప్రతిభ ప్రదర్శించి 14 పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్ నల్లగండ్ల ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూలు ప్రతినిధులు అండర్ 16 బాలలకు ఆదివారం టోర్నీ నిర్వహించారు. ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు పర్యవేక్షణలో యువకోచ్ పొట్టాబత్తిన సందీప్ ద్వారా కేవలం నెల రోజుల వేసవి శిక్షణలను పొందిన జగ్గయ్యపేట, మణుగూరు బాలురు పొలది వివేక్, కూచిపూడి సుబ్రహ్మణ్య కృష్ణ, కూచిపూడి రేవంత్ 2 స్వర్ణ, 7 రజిత, 5 కాంస్య పతకాలు కైవశం చేసుకుని ఈఘనత సాధించారు. అండర్ 14 విభాగంలో వివేక్ కిక్‌బోర్డ్, ఫ్రీ స్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీ స్టైల్ రిలేలో 5 పతకాలు అలాగే అండర్ 12 విభాగంలో సుబ్రహ్మణ్యకృష్ణ 4 పతకాలు, అదే విభాగంలో రేవంత్ 5 పతకాలు సొంతం చేసుకున్నారు. విజేతలను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డ్రీమర్స్ స్విమ్మర్ కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు-లక్ష్మి దంపతులు, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, డిఎస్‌పి మోటపోతుల కిషోర్‌బాబు, డ్రీమర్స్ స్విమ్మర్ అసోసియేషన్ అధ్యక్షులు మందడపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కలాలి నరేష్, టీమ్ మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్, ట్రెజరర్ పి రమాదేవి, కోచ్ సహాయకులు ఏ రమేష్‌బాబు, డాక్టర్ సామినేని దీపక్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్-స్విమ్మర్స్ కో-ఆర్డినేటర్ యలదండి శ్రీనివాసరావు, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె కరుణాకర్, పూర్వ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాసరావు, పి పాండురంగారావు, టీచర్ స్విమ్మర్ పర్చా లక్ష్మణరావు, కుర్ర శ్రీనివాస్, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ తదితరులు అభినందించారు. బాలల తలిదండ్రులు కూచిపూడి శ్రీనివాసరావు, పొలాది వెంకటఅప్పారావు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా సుబ్రహ్మణ్య స్వామివార్ల కల్యాణం

## జూన్ 5 నుండి స్మార్త వేదపాఠశాల ప్రవేశాలు

**ఇంద్రకీలాద్రి, జూన్ 1, ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో జేష్ఠమాసం శుద్ధ షష్ఠి సందర్భంగా ఆదివారం శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామి అమ్మవార్లను నూతన వధూవరులుగా పలురకాల వర్ణమయ పుష్పాలంకరణ చేసి ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై వేంచేపు చేశారు. అనంతరం కళ్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.

**జూన్ 3 నుండి నవగ్రహ మండపం పునప్రతిష్ట:** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో జూన్ 3 నుండి 5 వరకు నవగ్రహ మండపం పున:ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఆలయ వైదిక కమిటీ సూచనల మేరకు జరిగే ఈ కార్యక్రమాలు జూన్ 3న ఉదయం 7.30లకు విఘ్నేశ్వర పూజ, ఋుత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, క్షీరాధివాసం, ఉదయం 8.30 గంటలకు మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసములు, సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, అగ్ని ప్రతిష్టాపన, మండపారాధన, అధివాసములు, హారతి, మంత్రపుష్పము, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. 4వ తేదీ ఉదయం మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసములు, సాయంత్రం 4 గంటలకు మూలమంత్ర హవనములు, మంటప పూజలు, హారతి, మంత్రపుష్పము, ప్రసాద వితరణ, 5వ తేదీ ఉదయం 7.52లకు నవగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనము, ప్రసాద వితరణ, కార్యక్రమ స్వస్థి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు.

**జూన్ 5నుండి స్మార్త వేదపాఠశాల ప్రవేశాలు:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నిర్వహణలో పోరంకి నిర్వహిస్తున్న స్మార్త వేదపాఠశాలలో జూన్ 5 నుండి స్మార్త వేదవిద్యాభ్యాసానికి ప్రవేశాలు పున:ప్రారంభం అవుతాయని ఇఓ వికె శీనానాయక్ తెలిపారు.

**దుర్గమ్మవారి సేవలో విజయవాడ సిపి :** దుర్గమ్మవారిని ఆదివారం విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు సతీ సమేతంగా దర్శించు కున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశ్వీరచనాలు పలికారు.


**దుర్గమ్మకు నృత్యనీరాజనం:** దుర్గమ్మవారికి ఆదివారం హైదరబాద్‌కు చెందిన శ్రీ చినజీయర్ స్వామి నృత్య కళాక్షేత్రం ఆచార్యులు జి పవన్ కుమార్ నేతృత్వంలో పలు కీర్తనలకు అనుగుణంగా విద్యార్థులు అద్భుతంగా నృత్య నీరాజనాలర్పించి భక్తుల మన్ననలందుకున్నారు.



శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని



కళ్యాణోత్సవం సిపి రాజశేఖర్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



# విద్యుత్ రెగ్యులేటరీ నిబంధనలకు సవరణ ప్రకటించిన ఎపి ఇఆర్‌సి

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** వినియోగదారులు కోరిన విధంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినప్పుడు అయ్యే ఖర్చుల రికవరీకి సంబంధించి విద్యుత్ రెగ్యులేటరీ చట్టంలోని నిబంధనలకు నాలుగో ముసాయిదా సవరణను ఏపీఈఆర్సీ ప్రకటించింది. 150 కిలోవాట్లు, అంతకు మించిన లోడ్‌కు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు డిస్కంలు వసూలు చేయాల్సిన ఛార్జీలను నిర్దేశించే అధికారాన్ని కమిషన్‌కు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ కట్టబెట్టింది. దీనికి అనుగుణంగా 2023-24, 2024-25 లో 150 కిలో వాట్‌ల వరకు కొత్త కలెక్షన్ ఇచ్చేందుకు డిస్కంలు వసూలు చేసిన ఛార్జీలను పరిగణనలోకి తీసుకుని ముసాయిదా మార్గదర్శకాలను కమిషన్ ప్రతిపాదించింది. డిస్కంల వసూలు చేసినల ఛార్జీలను పరిగణ నలోకి తీసుకుని ముసాయిదా మార్గదర్శకాలను కమిషన్ ప్రతిపాదించింది. డిస్కంల నెట్‌వర్క్ నుంచి కి.మీ పరిధి వరకు 150 కిలోవాట్ల లోడ్ వరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో డెవలప్‌మెంట్ ఛార్జీలను కమిషన్ నిర్దేశించింది. వినియోగదారుడు తమ లోడ్ 100 హెచ్‌పీ/75 కిలోవాట్లకు మించినట్లయితే వారం తట వారే 150 కిలోవాట్ల వరకు ఎల్‌టీ /హెచ్‌టీ ఎంచుకోవచ్చు, ఈ ఛార్జీలతో పాటు అప్లికేషన్ ఫీజు సెక్యూరిటీ డిపాజిట్‌ను రెగ్యులేటరీ నిబంధనల మేరకు చెల్లించాలి. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త అదనపు లోడ్ సేవలకు సంబంధించి సర్వీస్ లైన్ ఛార్జీల షెడ్యూల్‌ను పంపిణీ సంస్థలు కమిషన్‌కు ప్రతి పాదన సమర్పించవచ్చు. గత ఆర్థిక సంవత్స రంలో 150 కిలోవాట్ల వరకు జారీ చేసిన కొత్త సర్వీసలకు అయిన వాస్తవ ఖర్చుల వివరాలతో డిస్కంలు వాఖలు చేసిన వివరాలను పరిశీలించి 120 రోజుల్లో కమిషన్ ఉత్తర్వులు ఇస్తుంది. డిస్కంల నుంచి ఎలాంటి నరపతిపాదనలూ రానట్లయితే రివజ్డ్ ఛార్జీలను ఖరారు చేసే వరకు 2025-26 ఆర్థిక సంవత్స రంలో పేర్కొన్న ఛార్జీలనే కమిషన్ పరిగణనలోకి తీసకుంటుంది.

## నల్లపాడు ఎస్సీకాలనీలో రేషన్ పంపిణీ పండుగ

**గుంటూరు కల్చరల్,జూన్ 1,ప్రభాతవార్త :** నల్లపాడు ఎస్సీకాలనీలో ఆదివారం రేషన్ పంపిణీ పండుగ చౌక డిపో నెంబర్ 228 లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 27వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి విచ్చేసి ఆమె చేతుల మీదుగా కార్డుదారులకు రేషన్ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి డివిజన్ అధ్యక్షులు గుంటూరు ప్రఖ్యాత్, షేక్ షూకూర్, నల్లపాడు జనసేన డివిజన్ అధ్యక్షులు చల్లా ఉషారెడ్డి, సమాజ చైతన్య సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అద్యక్షులు గుంటూరు పరిశుద్ధరావు, టిడిపినాయకులు మెట్టు ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జునరావు గ్రామ టిడిపి జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు కార్డుదారులు తదితరులు రేషన్ పంపిణీ పండుగ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందరభంగా స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డీలర్లు సక్రమంగా కార్డుదారులకు బియ్యం తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. సరుకులు పంపిణీలో సమయపాలన పాటిస్తూ కార్డుదారులకు ఇబ్బంది లేకుండా వారికి నూరు శాతం సరుకులు అందేలా డీలర్ చర్యలు తీసుకోవాలని రాజ్యలక్ష్మి సూచించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ అంటూ వాహనాలను ఏర్పాటుచేసి, ఇంటింటికి ఇవ్వకుండా ఒక నిర్ధిష్ట ప్రాంతంలో వాహనాన్ని పెట్టి కార్డుదారులను అక్కడికి పిలిపించి ఇవ్వటంతో సంవత్సరాల తరబడి కార్డుదారులు ఇబ్బందులు పడ్డారని పలువురు కార్డుదారుల వాపోయారు. తెలుగుదేశం ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకొని పాత విధానం మాదిరి చౌక డిపో డీలర్ దగ్గర సరుకులు పంపిణీ చేయడం మంచి నిర్ణయమని పలువురు కార్డుదారులు ప్రజలు చంద్రబాబు నిర్ణయాన్ని హర్షించాలి, రేషన్ డీలర్లు సైతం ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. రేషన్ సరుకుల పంపిణిలో ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొస్తామని డీలర్ జె.హైమావతి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సమాజ చైతన్య సంఘం కార్యకర్తలు, నాయకులు రేషన్ పంపిణీ పండుగకు విచ్చేసిన అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. రేషన్‌కార్డుదారులైన దివ్యాంగులకు 65సంవత్సరాలు దాటిన వృద్ధులకు వారి ఇంటివద్దనే వెళ్ళి డీలర్ జె.హైమావతి రేషన్ సరుకులను పంపిణీ చేశారు.

2-6P g7exHMNWJQE.qxd:2-6P g7exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1



# నేటి నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

## స్లాట్‌తో పెరిగిన రిజిస్ట్రేషన్లు, సేవల్లో ఏఐతో వాట్సప్ చాట్‌బాట్

## రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) సేవలను ఉపయోగించుకొని ప్రజలకు మరింత సులువైన సమర్థ వంతమైన సేవలను అందించ బోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రక టించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాలకు గాను ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయగా తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం స్టాంప్స్ రిజిస్ట్రేషన్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయ్యేలా పారదర్శకంగా అవినీతిరహితంగా మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానంతో తాము అనుకున్న విధంగానే సత్ఫలి తాలు వచ్చాయని, 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. మొదటి దశలో 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు, 2వ దశలో 25 సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో మే12నుంచి నేటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయని, స్లాట్ బుకింగ్‌తో 3 డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు, మనోభీష్టంమేరకే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తుందన్నారు. అంతిమంగా ప్రజలకు సంతృప్తికర సేవలందించడవే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్-ఏఐ) అనుసంధానంతో కూడిన చాట్‌బాట్ మేధ 82476 23578 వాట్సాప్ నెంబర్‌ను అందు బాటులోకి తీసు కువచ్చామని మంత్రి వెల్లడించారు. ఈ నూతన ప్రక్రియతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి కలిగే సందేహాలు నివృత్తి అవుతాయని, రిజిస్ట్రేషన్ ఆఫీస్ లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, సమయం అందుబాటు వంటి సమాచారం లభిస్తుందన్నారు. గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్‌పై రిజిస్ట్రేషన్ ఛార్జీలుమార్కెట్ ధరలు తదితర అంశాలపై ఏఐ చాట్‌బాట్ మేధ ద్వారా సమాచారం తెలుసు కోవచ్చన్నారు. అక్రమాలకు చెక్ పెట్టేలా లే అవుట్‌లలో డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు, పూర్తి కాని వాటి వివరాలు ఇటు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటు బిల్డర్ లేదా డవలపర్ దగ్గర వివరాలు ఉండేలా డవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను త్వరలో తీసుకువస్తా మన్నారు. ఈ మ్యాడుల్ లో రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు రెడ్ కలర్ లో కనిపిస్తాయి. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలోపని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, ఇబ్రహీం పట్నం, సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

ఉదయం 10.30 గంటల నుంచి లంచ్ సమయాన్ని మినహాయించి సాయింత్రం 5 గంటల వరకూ స్లాట్ బుక్ చేసుకోవచ్చునని, ప్రతి కార్యాలయంలో రోజుకు 48స్లాట్‌లు బుక్ అవుతాయన్నారు.

స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో సాయంత్రం5 నుంచి 5.30గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్‌తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్‌ఈ సంతకం ప్రవేశపెడు తున్నామని ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లో ప్రయోగాత్మక అమలు చేస్తున్నామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు.



ప్రసంగిస్తున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

# శాంతి చర్చలపై ముఖ్యమంత్రితో చర్చిస్తా

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 1, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న శక్తులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు పూనుకోవాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం కమిటీ ఛైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఖనిజ సంపదను దోచిపెట్టడానికి అమాయకులైన గిరిజనులను చంపడం దారుణమని అన్నారు. మావోయిస్టుల పేరుతో సాధారణ ప్రజలను కాల్చి చంపుతున్నారని తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేసి కాల్పుల విరమణ ప్రకటించి సీపీఐ(మావోయిస్టు) పార్టీతో శాంతి చర్చలకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులపై జరుగుతున్న దాడులు నిలిపివేసేందుకు చర్చలు జరగాలన్నారు. సామాజిక, ఆర్థిక అవసరాల నేపథ్యంలో జరుగుతున్న పోరాటాలను శాంతి చర్చలతో పరిష్కరించుకోవాలని సూచించారు.

సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు చర్చలు జరపాలని అన్నారు. కేంద్రం, మావోయిస్టులు శాంతియుతంగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. మావోయిస్టులతో శాంతి చర్చల కోసం పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం దండకారణ్యంలో జరుగుతున్న ఆపరే షన్ కగార్ ఆపి కాల్పుల విరమణ ప్రకటించి.. కేంద్రం, మావోయిస్టులు శాంతి చర్చలు జరపడానికి మద్దతిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ అన్వర్‌హుస్సేన్, ఆర్ఎస్‌పి నేత జానకీరాములు, పశ్య పద్మ, కె.గోవర్ధన్, ఎంసిపి(యు) నేత గాదగోని రవి పాల్గొన్నారు.

# టిజిసిఎస్‌బి మరో ఘనత.. సైబర్ నేరాల్లో భారీగా తగ్గుదల

## కీలక కేసుల్లో పురోగతి

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** సైబర్ నేరాల నివారణలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరో ఘనతను అందుకుంది. సైబర్ నేరాల కట్టడి, కీలక కేసుల్లో నిందితుల అరెస్టు, నేరగాళ్లు కాజేసిన సొత్తు రికవరీలో ఇప్పటికే దేశంలోనే మొదటి స్థానంలో వున్న టిజిసిఎస్‌బి తాజాగా ఈ ఏడాది మొదటి నాలుగు నెలల వ్యవధిలో అనేక అంశాలలో నేరాలను భారీగా తగ్గేలా చేసింది. జాతీయ స్థాయిలో నమోదైన గణాంకాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడి అగ్రభాగానా వుందని టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక నే రాలకు సంబంధించిన సైబర్ నేరాలు ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెం బర్ నెలతో పోలిస్తే 5.5 శాతం తగ్గాయి. ఇక ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొత్తు గత ఏడాది తో పోలిస్తే 19 శా తం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబర్, డిసెంబర్ నెలలతో పోలిస్తే ఇది 30 శాతం తగ్గుదలగా వుంది. జాతీయ స్థాయిలో ఈ తరహా నేరాలలో 12 శాతం పెరు గుదల వుంది. ఇక రాష్ట్రంలో ఈ ఏడాది మొదటి నాలుగు నెలల వ్యవధిలో రికవరీ 16 శాతం వుంది. గత ఏడాది ఇది 13 శాతంగా నమోదయ్యింది. గత ఏడా దిలో సైబర్ నేరాలకు సంబంధించి 6,763 కేసులు నమోదవగా ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ సంఖ్య 7525గా వుంది. గత ఏడాది 234 మంది సైబర్ నేర గాళ్లను అరెస్టు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు 626 మందిని అరెస్టు చేశారు. సైబర్ నేరగాళ్లపై 89 పిటి వారంట్లు జారీ చేశారు. సైబర్ నేరాల నివారణలో టిజిసిఎస్‌బి చేబట్టిన చైతన్య కార్యక్రమాల వల్ల ఈ ఫలితాలు సాధించగలిగామని డిజి శిఖా గోయల్ తెలిపారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.

# తెలంగాణలో స్ట్రాటజిక్ రోడ్స్ పాలసీ మేరకు నిర్మాణాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణలో స్ట్రాటజిక్ రోడ్స్ పాలసీ25.07.2024 ప్రకటించారు. ఆదిలాబాద్ లో జాతీయ రహదారుల అభివృద్ధి కి శంకుస్థాపన చేశారు. బంజారాహిల్స్ లో బాబు జగజీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవం చేశారు. ఎన్ హెచ్ 44 పై రూ.15 కోట్ల వ్యయంతో 5.320 కిలోమీటర్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రీజినల్ రింగ్ రోడ్ వరకు హెచ్ఎండిఏ పరిధి విస్తరింపు, ఆర్ఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్ కు అనుసంధానం ఉండేలా రేడియల్ రోడ్లు. కృష్ణా గోదావరితో పాటు కొత్త ప్రాజెక్టుల వినియోగం. రోడ్లు లేని 422 గ్రామాలు, 3177 ఆవాసాలకు తారు రోడ్లు. సికింద్రాబాద్ అల్వాల్ సమీపంలో రాజీవ్ రహదారిపై రూ.2232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పనులకు శంకుస్థాపన. రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం) నిర్మాణం చేపట్టనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో రహదారుల నిర్మాణానికి దాదాపు రూ.8,996 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. రూ.52.76 కోట్లతో మెదక్ నియోజకవర్గంలో వివిధ గిరిజన గ్రామాలను కలుపుతూ రోడ్ల నిర్మాణం చేయనున్నారు. రూ.35 కోట్లతో ఏడుపాయల వద్ద రోడ్డు విస్తరణ. అల్వాల్ సమీపంలో రాజీవ్ రహదారిపై రూ.2232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన. చేశారు.

హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారిపై రూ.1580 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిపూజ చేశారు. ఎల్‌బీనగర్ సమీపంలో బైరామాల్ గూడ ఫ్లైఓవర్ ప్రారంభించారు. ఆరంఘడ్ నుంచి జూ పార్క్ వరకు ఫ్లైఓవర్ 9.03.2024న ప్రారంభించారు. మీర్ అలం చెరువు సమీపంలో దాదాపు రూ.360 కోట్ల అంచనా వ్యయంతో 4లేన్ వంతెన నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ ద్వారా జీహెచ్ఎంసీలో రూ. 5,942 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.

వాన పడితే నీళ్లు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోతున్న సమస్యను పరిష్కరించేందుకు సిటీలో నీళ్లు నిల్వ ఉండే జంక్షన్లన్నింటా వాటర్ ఇన్ టేక్ వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ రద్దీని అధిగమించేలా రూ.826 కోట్లతో అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణం ఆరు జంక్షన్ల అభివృద్ధి చేపట్టారు. రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం). సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 189 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టారు. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లతో పాటు ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫీల్డ్ రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



# బిసి రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

## బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

**హైదరాబాద్, జూన్ 1,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రిజర్వేషన్ల పెంపు కోసం సిఎం నేతృత్వంలో అఖిలపక్షంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఢిల్లీకి వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదబాదులోని బంజారాహిల్స్‌లో ఉన్న కలింగభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంఘాలు చేసిన పోరాటం పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి త్వరలోనే దేశవ్యాప్తంగా సమగ్ర కులగలను చేపడతామని ప్రకటించడం అభినందనీయమని కానీ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్లకు రాజ్యాంగ పద్ధతి కల్పించాలని అప్పుడే కేంద్ర ప్రభుత్వాన్ని బీసీలు విశ్వసిస్తారని అన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలను రాజకీయంగా చైతన్యం చేయడానికి జూన్, జూలై రెండు నెలల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలు పర్యటించి సభలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కన్వీనర్, బాలగోని బాలరాజుగౌడ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, ప్రొఫెసర్ భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసేదాకా పోరాడుతాం



ధర్నాలో ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఒవైసీ

## ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా నయిపుల్లా రహమాన్

## బోర్డు చేసే పోరాటానికి పూర్తి మద్దతిస్తాం

## ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 1, ప్రభాతవార్త:** వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా నయిపుల్లా రహమాన్ స్పష్టం చేశారు. ఆదివారం వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఛలో ఇందిరాపార్కు పేరుతో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు అధ్య క్షుడు మౌలానా నయిపుల్లా రహమాన్, ఎమ్మెల్యేలు అహ్మద్ బలాలా, జాఫర్ హుస్సేన్ మేరాజ్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొయినుద్దీన్, మహ్మద్ ముబీన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం రద్దు కోసం రాజకీయాలకు అతీతంగా ముస్లిం సంఘాలన్నీ ఐకమత్యంగా పోరాటం చేసి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చేస్తున్న పోరాటం అభినందనీయమని, ఈ పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చేస్తున్న పోరాటానికి ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అదే విధంగా ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా నయిపుల్లా రహమాన్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ సిఏఏ, ఎన్ఆర్‌సీ, వక్ఫ్ సవరణ చట్టం వంటి నల్ల చట్టాలను తీసుకువచ్చి, ముస్లింల వ్యక్తిగత హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటోందని, దీనిపై అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో ముస్లిం సంఘాల నాయకులు, ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ఎడ్‌సెట్ పరీక్షకు 82 శాతం హాజరు

## 74 కేంద్రాల్లో కొనసాగిన పరీక్ష

## 38,758 మంది దరఖాస్తు.. 32,106 మంది హాజరు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడీ కాలేజ్‌ల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎడ్‌సెట్-2025కి 38,758 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 32,106 మంది పరీక్షకు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.. జరిగిన సెషన్‌లో 19,538 మందికి గానూ 16,117 మంది(82.49శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన సెషన్‌కి 19,220 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 15,989 మంది(83.19 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను సిబిటి విధానంలో నిర్వహించారు. ఎడ్ సెట్-2025 పరీక్షను కాకతీయ యూనివర్సిటీ నిర్వహించింది. పరీక్ష సందర్భంగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె ప్రతాప్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు ఎడ్‌సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి పరీక్షల తీరును పర్యవేక్షించారు.

# జూనియర్ లెక్చరర్లకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలి

## వివక్ష చూపుతున్న ప్రిన్సిపాళ్లు

## మూల్యాంకన కేంద్రాల్లో నల్లబ్యాడ్జిలతో

## గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ నిరసన

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్స్ (జెఎల్)కి రెండో వార్షిక ఇంక్రిమెంట్ చేయ డంలో ప్రిన్సిపల్స్ వివక్ష చూపుతున్నారని గేజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ మండిపడింది. రెండో ఇంక్రిమెంట్‌ను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్స్, అధికారుల మొండి వైఖరి నశించాలని.. రెండో ఇంక్రిమెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రెగ్యులర్ అయిన అధ్యాపకులకు మే నెలతో రెండు సంవత్సరాలు పూర్తయిందన్నారు. మొదటి సంవత్సరం ఇంక్రిమెంట్ చేసిన ప్రిన్సిపల్స్.. రెండో సంవత్సరం కావాలనే కొంతమంది తప్పుడు సూచనలతో ఇంక్రిమెంట్ నిలిపివేయడం దారుణమన్నారు. పలు కళాశాలల ప్రిన్సిపల్స్ మే నెల వేతనం సైతం చేయలేదన్నారు. న్యాయంగా సహజంగా రావాల్సిన ఇంక్రిమెంట్స్‌పై ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలు ఉన్నాయంటూ ప్రొబిషనరీ క్లియర్ కాలేదంటూ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గతంలో రెగ్యులర్ అయిన ఎంటిఏస్ 2008, 2012లో నియా మకమైన అధ్యా పకులకు ప్రొఫెషనరీ పీరియడ్ డిక్లేర్ కాకుండా ఇంక్రిమెంట్ చేశార న్నారు. కేవలం కాంట్రాక్ట్ నుంచి రెగ్యులర్ అయిన అధ్యాపకులకు మాత్రమే కుంటి సాకులు చూపుతూ ఇంక్రిమెంట్ చేయకుండా వివక్ష పూరితంగా వ్యవ హరిస్తున్నారని కనకచంద్రం మండిపడ్డారు. 20 సంవత్సరాలు కాంట్రాక్ట్ అధ్యా పకులుగా పనిచేస్తూ ప్రభుత్వ కాలేజీలను కాపాడుతున్న అధ్యాపకుల పట్ల ఈ విధమైన ధోరణి సరికాదన్నారు. ఇంక్రిమెంట్ వేతనాలు చేయని ప్రిన్సిపల్స్‌పై న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ తమ దోరణినీ మార్చుకోకుంటే కళాశాలలోని ప్రశాంత వాతా వరణము చెడిపోవడానికి వారే కారకులవు తారన్నారు. కొంతమంది అధ్యా పక, ప్రిన్సిపల్ సంఘాల రాష్ట్ర నాయకుల సూచనలతో ఇంక్రి మెంట్ చేయకుండా మాకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు.

# మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క భేటీ

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త :** ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో మర్యాద పూర్వకంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తనకు పొలిటికల్ అఫైర్స్ కమిటీలో స్థానం కల్పించి నందుకు మీనాక్షి నటరాజన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



# మిస్‌వరల్డ్ ఆతిథ్యంతో పెట్టుబడులకు రెడ్‌కార్పెట్

## తెలంగాణకు గ్లోబల్ బ్రాండింగ్ లభించిందంటున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** నగరంలో మే 7 నుంచి 31 వరకు జరిగిన 72వ మిస్‌వరల్డ్-2025 పోటీలు తెలంగాణకు ప్రపంచ గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఈ ఈవెంట్ ద్వారా తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు ప్రపంచానికి పరిచయమయ్యాయి. హోటళ్లు, రవాణా, వ్యాపార రంగాలకు ఆర్థికంగా లాభం చేకూరింది. ఈ పోటీలు తెలంగాణకు బ్రాండింగ్, పర్యాటక, ఆర్థిక, సాంస్కృతిక ప్రచారానికి గొప్ప అవకాశంగా నిలిచాయి. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం వేదికగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక అందాల పోటీలు గత నెల 7న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కాగా.. మే 31న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిశాయి. దాదాపు 20 రోజులపాటు సాగిన ఈ పోటీలోల్ల 108 దేశాల నుంచి సుందరీమణులు పాల్గొన్నారు. గ్రాండ్ ఫినాలేలో థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ 72వ మిస్ వరల్డ్-2025 కిరీటాన్ని గెలుచుకున్నారు. ఆమెకు మిస్‌వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిజ్‌కోవా (చెక్ రిపబ్లిక్) కిరీటధారణ చేశారు. ఈ పోటీల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం, మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్ భారీ ఏర్పాట్లు చేశాయి. ఈ వేడుకను ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు.

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన 72వ మిస్‌వరల్డ్-2025 అందాల పోటీలు తెలంగాణ రాష్ట్రానికి అనేక విధాలుగా లాభాలను చేకూర్చాయి. 'తెలంగాణ జరూర్ ఆనా' అనే నినాదంతో ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేసింది. మిస్ వరల్డ్ వంటి ప్రపంచస్థాయి ఈవెంట్‌తో హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 108 దేశాల నుంచి వచ్చిన పోటీదారులు అంతర్జాతీయ మీడియా, ప్రము ఖులు తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు, మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగింది. ఇది తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకురావడంతో బ్రాండింగ్ చేసుకోవడానికి దోహదపడింది.

మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ పర్యాటక రంగానికి గొప్ప ప్రోత్సాహాన్ని అందిం చాయి.

ప్రపంచ సుందరీమణులు చార్మినార్, వరంగల్ కోట, యాదాద్రి ఆలయం, బుద్ధవనం వంటి ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్శనలకు సంబం ధించిన విడియోలు, ఫొటోలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం అయ్యాయి. దీంతో తెలంగాణ పర్యాటక ప్రదేశాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరిగి, భవిష్యత్తులో విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. తెలంగాణలోని గ్రామీణ పర్యాటక ప్రాంతాలను కూడా మిస్‌వరల్డ్ సుందరీ మణుల చేత ప్రచారం చేయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. ఈవెంట్ నిర్వహణతో హోటళ్లు, రవాణా, ఆహార రంగాల్లో తాత్కాలికంగా వ్యాపారం పుంజుకుంది. స్థానిక వ్యాపారాలు, హస్తకళల దుకాణాలకు కూడా ప్రయోజనం చేకూరింది. పోటీలకు హాజరైన అతిథులు, మీడియా, ఇతర సిబ్బంది ద్వారా పెద్దఎత్తున ఖర్చు చేశారు. ఇది ఒకరకంగా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చింది.

మిస్‌వరల్డ్ ప్రారంభ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పేరిణి నృత్య ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. 250 మంది కళాకారుల ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో తెలంగాణ కళలు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అయ్యాయి. మిస్‌వరల్డ్ పోటీలు తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని ప్రపంచవ్యాప్తంగా తెలియజేశాయి. సురక్షితమైన, అభివృద్ధి చెందిన ప్రాంతాలకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారు.

ఈ ఈవెంట్ ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారులకు తెలంగాణ మౌలిక వసతులు, భద్రత, అభివృద్ధి సామర్థ్యంపై అవగాహన కల్పించింది. మిస్‌వరల్డ్ పోటీలు తెలంగాణకు కేవలం అందాల పోటీలుగా కాకుండా, ఒక బ్రాండింగ్, పర్యా టక, ఆర్థిక, సాంస్కృతిక ప్రచార అవకాశంగా నిలిచాయి. ఈ పోటీల్లో భాగంగా అందగత్తెలు వివిధరౌండ్లలో తమ ప్రతిభను ప్రదర్శించడంతోపాటు, తెలంగాణలోని అనేక చారిత్రక కట్టడాలు, ఆలయాలను సందర్శించారు. ఈ పోటీలతో తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, వారసత్వం, పర్యాటక ప్రదేశాలు ప్రపంచానికి తెలిశాయి.

ఆట

# యుఇఎఫ్ఎ ఛాంపియన్స్‌గా జర్మన్ క్లబ్

## 5-0తో ఇంటర్ మిలాన్ ఓటమి



**న్యూఢిల్లీ:** యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (యుఇఎఫ్ఎ) ఛాంపియన్స్‌గా ప్యారిస్ సెయింట్ జెర్మన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఫ్రెంచ్ క్లబ్) అవతరించింది. ఛాంపియన్స్ లీగ్ చరిత్రలో ఫైనల్‌లో ఏ జట్టూ సాధించని అతి పెద్ద విజయాన్ని ఫ్రెంచ్ క్లబ్ నమోదు చేసింది. ఇంటర్ మిలాన్‌ను 5-0 తేడాతో ఓడించి లీగ్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆదివారం జరిగిన అత్యంత ఏకపక్ష ఫైనల్స్‌లో లూయిస్ ఎన్రిక్ నేతృత్వంలోని యువ జట్టు ఇంటర్ మిలన్‌ను ఓడించి పారిస్ సెయింట్-జర్మైన్ చరిత్రలో తొలిసారి ఛాంపియన్స్ లీగ్‌ను కైవసం చేసుకుంది. టీనేజర్ డిజౌర్ డౌ 5-0 తేడాతో రెండు సార్లు గోల్ చేసి అద్భుతమైన విజయాన్ని చేకూర్చాడు. తన మాజీ క్లబ్‌తో ఆడుతున్న అచ్రాఫ్ హకీమి జర్మన్ ఫుట్‌బాల్ క్లబ్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. 20వ నిమిషంలో అతని డిఫ్లెక్ట్ షాట్ వారి ఆధిక్యాన్ని రెట్టింపు చేయడంతో డౌ ప్రొవైడర్ నుండి ఫినిషర్‌గా మారాడు. గంట సమయం తర్వాత డౌ మళ్ళీ గోల్ చేశాడు. ఖ్విచా క్వారత్స్‌లియా నాల్గవ గోల్ సాధించడానికి పరిగెత్తగా, ప్రత్యామ్నాయంగా వచ్చిన సెన్నీ మయులు దాన్ని అడ్డుకున్న ఐదు గోల్స్ చేశాడు. ఫ్రెంచ్ క్లబ్ ఆటగాడు అలియాంజ్ అరీనా తన ప్రత్యర్థికి ఆట ప్రారంభం నుండి ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. ఫలితంగా 12వ నిమిషంలో ఆధిక్యంలో ఉంది. 63వ నిమిషంలో ఫ్రెంచ్ క్లబ్ స్కోరును 3-0తో సాధించడంతో వారి బ్యాక్ లైన్ సిక్సర్లు మరియు సెవెన్లుగా ఉంది. ఆ తర్వాత 73వ నిమిషంలో డెంబెలే క్వారత్స్‌లియాను 4-0తో పంపి ఆటను ముందుకు తీసుకెళ్లాడు. మరియు 19 ఏళ్ల మయులు బార్కోలాతో వన్‌టూ ఆడి 86 నిమిషాల్లో ఐదవ గోల్ చేశాడు. దీంతో 5-0తో ఫ్రెంచ్ క్లబ్ విజయం సాధించింది.

# ప్రొ కబడ్డీ లీగ్ వేలంలో.. రూ.కోట్లు పలికిన ఆటగాళ్లు

## అత్యధిక రేటుకు అమ్ముడైన చియానెహ్

## రూ.2.23 కోట్లతో గుజరాత్ జెయింట్స్



**న్యూఢిల్లీ:** ఆ ప్రొ కబడ్డీ లీగ్‌కు (పీకేఎల్) సీజన్ 12కు సంబంధించి వేలంలో ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల రూపాయలు కురిపించాయి. ముంబైలో శని, ఆదివారాల్లో జరిగిన వేలంలో అత్యధికంగా మొహమ్మద్ జాషాద్లౌ చియానెహ్ అనే ఆటగాడిని 2.23 కోట్ల రూపాయలతో గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. ప్రొ కబడ్డీ లీగ్ వేలంలో 500 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ పూల్‌లో సీజన్ 11 తర్వాత ఫ్రాంచైజీలు విడుదల చేసిన ఆటగాళ్లతో పాటు, ఇతర దేశీయ ఆటగాళ్లు కూడా ఉన్నారు. అదనంగా, ప్లేయర్ పూల్‌లో ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2024 యొక్క ఇద్దరు ఫైనలిస్టుల నుండి 24 మంది ఆటగాళ్లు కూడా వేలంలో పాల్గొన్నారు. వేలంపాటను వారి మూల ధరలు మరియు పాత్రల ఆధారంగా నాలుగు గ్రూపులుగా వర్గీకరించారు. ఎ, బి, సి, డి కేటగిరీగా విభజించి రేటును నిర్ణయించారు. కేటగిరి ఎ లోని ఆటగాళ్ల బేస్ ధర రూ.30 లక్షలు, కేటగిరి బి లోని ప్లేయర్లన బేస్ ధర రూ.20 లక్షలు, సి కేటగిరిలోని ప్లేయర్లకు రూ.13 లక్షలు, కేటగిరి డి జాబితాలో ఉన్న ఆటగాళ్ల బేస్ ధర రూ.9 లక్షలుగా నిర్ణయించారు. ఆటగాళ్లను వారి నైపుణ్యాల ప్రకారం ఆల్ రౌండర్లు, రైడర్లు మరియు డిఫెండర్లుగా విభజించారు. కాగా ఈ వేలంలో దేవంక్‌ను బెంగాల్ వారియర్జ్ రూ.2.20 కోట్లకు, అంకిత్ జగ్లాన్‌ను పాట్నా పైరేట్స్ రూ.1.573 కోట్లకు, అర్జున్ దేశ్వాల్‌ను తమిళ్ తలైవాస్ రూ.1.405 కోట్లకు, అషు మాలిక్‌ను దబాంగ్ ఢిల్లీ రూ.1.90 కోట్లకు. యోగేష్‌ను బెంగుళూరు బుల్స్ రూ.1.125 కోట్లకు, గుమాన్ సింగ్‌ను యూపీ యోధస్ రూ.1.725 కోట్లకు, నితిన్ కుమార్ దంఖల్‌ను జైపూర్ పింక్ పాంథర్స్ రూ.1.0025 కోట్లకు, సచిన్ తన్వర్‌ను పుణెరి పల్టాన్ రూ.1.0575 కోట్లకు ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి.



# ఆరెంజ్ క్యాప్‌కు టఫ్ ఫైట్

## పర్పుల్ క్యాప్‌కూ మంచి డిమాండ్

## ప్లేయర్ల పోటా పోటీ

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్, 18వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. రెండో క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లు ముగిశాయి. ఇక ఫైనల్ మాత్రమే జరగాల్సి ఉంది. అయితే అత్యధిక పరుగులు చేసే బ్యాటర్లకు ఇచ్చే ఆరెంజ్ క్యాప్, ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే పర్పుల్ క్యాప్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. దక్కించుకునేందుకు పలువురు ప్లేయర్లు పోటీ పడుతుండటంతో ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్‌లకు టఫ్ ఫైట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్ టైటాన్స్ ఆటగాడు సాయి సుదర్శన్ (80) కీలక ఇన్నింగ్స్‌తో ఆరెంజ్ క్యాప్ రేస్‌లో దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం 759 పరుగులు చేసిన సాయి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఇక పర్పువల్ క్యాప్‌ను దక్కించుకునేందుకు గుజరాత్ టైటాన్స్ బౌలరే రేసులో ఉండటం విశేషం. ప్రసిద్ధ్ కృష్ణ 25 వికెట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అత్యధిక పరుగుల జాబితాలో సాయి సుదర్శన్ టాప్‌లో ఉండగా, ఆ తర్వాత ముంబై ఇండియన్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ (673), శుభ్‌మన్ గిల్ (650), మిచెల్ మార్ష్ 627), విరాట్ కోహ్లీ (614), యశస్వీ జైస్వాల్ (559), కెఎల్ రాహుల్ (539), జోష్ బట్లర్ (538), నికోలస్ పూరన్ (524), సిమ్రాన్ సింగ్ (517) టాప్-10లో ఉన్నారు. ఇందులో గుజరాత్ కెప్టెన్ గిల్, లక్నో సూపర్ జైయింట్ ప్లేయర్ మిచెల్ మార్ష్ రేసు నుండి వైదొలగారు. సాయికి సూర్యకు మధ్య 86 పరుగుల వ్యత్యాసం మాత్రమే ఉంది. అయితే సాయి సుదర్శన్ చేసిన 759 పరుగులను అధిగమించేందుకు సూర్యకు ఇంకా అవకాశం ఉంది. అలాగే ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆ జట్టు ప్లేయర్ విరాట్ కోహ్లీ టాప్ స్కోరర్‌గా మారాలంటే మాత్రం భారీ శతకం చేయాల్సి ఉంది. ఎందుకంటే సాయి కంటే విరాట్ 145 పరుగులు వెనుకబడి ఉన్నాడు. సూర్య, కోహ్లీ సాధించలేకపోత మాత్రం సాయి సుదర్శనదే ఆరెంజ్ క్యాప్ అవుతుంది. ఇక పర్పుల్ క్యాప్ రేస్‌లో నలుగురు పోటీ పడుతున్నారు. గుజరాత్ ఆటగాడు ప్రసిద్ధ్ కృషన 15 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు తీశాడు. గుజరాత్ ఎలిమినేట్ అయిపోయింది. ప్రసిద్ధ్ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ నూర్ అహ్మద్ (24) ఉన్నాడు. ఈ జట్టు లీగ్ స్టేజ్‌కే పరిమితమైంది. వీరి తర్వాత జోష్ హేజిల్ వుడ్ (21), ట్రెంట్ బౌల్ట్ (21), సాయి కిషోర్ (19), జస్‌ప్రీత్ బుమ్రా (18), అర్ష్‌దీప్ (18) ఉన్నారు. కిషోర్ గుజరాత్ బౌలర్ కావడంతో అతడికి అవకాశాలు లేవు. రాయల్ ఛాలెంజర్స్‌కు ఫైనల్స్ ఉంది. జోష్ మరో నాలుగు వికెట్లు తీస్తే ముందుకు దూసుకెళతాడు.

# నార్వే చెస్‌లో గుకేష్ ఓటమి

## ముందంజలో అర్జున్, హంపీ, వైశాలి

**న్యూఢిల్లీ:** నార్వే చెస్ టోర్నమెంట్-2025లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ టై బేక్‌లో ఓడిపోయాడు. ఎరిగైసి అర్జున్ నకమురాను చిత్తు చేయగా, మహిళల విభాగంలో కోనేరు హంపి ముందంజలో ఉంది. టోర్నమెంట్‌లోని అన్ని బోర్డుల్లో ఆదివారం జరిగిన అన్ని బోర్డుల్లో ఉత్కంఠ భరితమైన ఆటను ప్రదర్శించిన నేపథ్యంలో ఓపెన్ విభాగంలోని మూడు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అయితే ఒక దశలో ప్రతిష్టంభన ఏర్పడిన పరిస్థితుల్లో దాన్ని ఛేదించడానికి ఆర్మగెడాన్ టై బ్రేక్‌ను వర్తింప చేశారు.



భారత్ మాస్టర్ గుకేష్ రోలర్-కోస్టల్ రైడ్ కొనసాగగా, ఆర్మగెడాన్ టై బ్రేక్‌లో ఓటమి పాలయ్యాడు. దీంతో అతడు టై 5వ స్థానానికి పడిపోయాడు. ఆ మ్యాచ్‌లో, చైనా గ్రాండ్ మాస్టర్ వీ యి మిడిల్ గేమ్‌లో గెలుస్తుండగా, నల్ల పావులతో ఆడుతున్న గుకేష్ ఎండ్ గేమ్‌లో ఆధిక్యంలో ఉన్నాడు. కానీ చాలా అనిశ్చితి తర్వాత క్లాసికల్ గేమ్ చివరికి ప్రతిష్టంభనలో ముగిసింది. చైనాకు చెందిన వెయ్ యి 5.5 పాయింట్లు సాధించగా, గుకేష్ 5.5 పాయింట్లతో సమం చేసినా, టై బ్రేక్‌లో ఓటమి చెందాడు. ఇక మరో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ అమెరికన్ ప్రపంచ నంబర్ 2 హికారు నకమురాను ఓడించి నార్వే చెస్ టోర్నమెంట్‌లో తన నాల్గవ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ కూడా తన ప్రతిభను కొనసాగించాడు, మరో అమెరికన్ గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానాపై టైబ్రేక్ విజయం సాధించిన తర్వాత అతని పాయింట్ల సంఖ్య 9.5కి చేరుకుంది. ఇక మహిళల విభాగంలో, రెండుసార్లు ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ అయిన కోనేరు హంపి చైనాకు చెందిన లీ టింగ్జీపై టైబ్రేక్ విజయం తర్వాత 8.5 పాయింట్లతో ఆధిక్యంలోకి వెళ్లగా, ఆర్. వైశాలి ఇరానియన్‌స్పానిష్ క్రీడాకారిణి సారా ఖాడెమ్‌పై నిర్ణయాత్మక విజయం సాధించి మూడు పాయింట్లు సాధించి 6.5 పాయింట్లతో నాల్గవ స్థానానికి చేరుకుంది.

# భారత్ భారీ స్కోరు

## ఇంగ్లండ్‌పై 557 పరుగులు

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక టెస్ట్‌లో రెండో రోజు భారత్ ఎ తొలి ఇన్నింగ్స్‌లో 125.1 ఓవర్లలో 557 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. సెయింట్ లారెన్స్ మైదానంలో తొలి రోజు ప్రారంభంలో, భారత ఎ జట్టు కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (8) ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ జోష్ హల్ చేతిలో చిక్కుకున్నాడు. యశస్వి జైస్వాల్ (24) కూడా పెవిలియన్ వైపు వెళుతుండగా లైన్ దాటడానికి ప్రయత్నిస్తూ ఎడ్డీ జాక్ బౌలింగ్‌లో క్యాచ్ పట్టాడు. సర్ఫరాజ్ 119 బంతుల్లో 92 పరుగులు చేసి రాణించాడు. ఇక రెండవ రోజు వికెట్ కీపర్ బ్యాటర్ అజీత్ సింగ్ డేల్ చేతిలో పరాజయం పాలయ్యే ముందు, 120 బంతుల్లో 94 పరుగులు చేసిన వైస్ కెప్టెన్ ధ్రువ్ జురెల్ తో కలిసి నాయర్ 195 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా పంచుకున్నాడు. నితీష్ కుమార్ (5) షార్ట్ డెలివరీని డ్రైవ్ చేయడానికి



ప్రయత్నిస్తూ విఫలమై జాక్ ఇన్నింగ్స్‌లో రెండవ వికెట్ అయ్యాడు. ఇక 186 పరుగులతో నాటౌట్ గా తిరిగి బ్యాటింగ్ ప్రారంభించిన నాయర్, ఎడ్డీ జాక్ ను లెగ్‌సైడ్ ద్వారా స్వివెల్ పుల్ చేసి తన నాల్గవ ఫస్ట్ క్లాస్ డబుల్ సెంచరీని సాధించాడు, జమాన్ అఖ్తర్ బంతిని తన ఇన్సైడ్ ఎడ్జ్ ద్వారా క్లిప్ చేయడంతో అతను వెంటనే నిష్క్రమించాడు. శార్దూల్ ఠాకూర్ నాలుగు బౌండరీలతో 27 పరుగులు చేసి అఖ్తర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. హర్ష్ దుబే (32), అన్షుల్ కాంబోజ్ (23) లంచ్ సమయానికి భారత స్కోరును 7 వికెట్లకు 533 పరుగులకు చేర్చారు. జోష్ హల్‌ను జేమ్స్ రెవ్ బౌలింగ్‌లో బౌలింగ్‌లో బౌలింగ్‌లో పడగొట్టే ముందు హర్ష్ దుబే (32) భారత్ స్కోరును 533 పరుగులకు పెంచాడు. హర్షిత్ రాణా (16) కొన్ని ట్రిక్కులు చేసి రెహాన్ అహ్మద్‌ను రెండు సిక్సర్లు కొట్టాడు, కాంబోజ్ కూడా ఒక సిక్సర్ కొట్టి రెహాన్ బౌలింగ్‌లో చిక్కుకున్నాడు. అఖ్తర్ తన మూడో వికెట్‌తో భారత ఇన్నింగ్స్‌ను ముగించాడు.



# వచ్చే ఐదేళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## అదానీ చైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 1:** ఆదానిగ్రూప్ రానున్న ఐదేళ్లలో విభిన్న రంగాల్లో 15 నుంచి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులుపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే పటిష్టమైన బ్యాలెన్స్‌షీట్ కొనసాగిస్తుండటంతో మరిన్ని రంగాల్లో పెట్టుబడులు పెంచాలని ఛైర్మన్ గౌతమ్ ఆదాని వెల్లడించారు. సమగ్రపరిశీలన తర్వాత కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ ఎలాంటి అడ్డంకులు లేకుండా మరింత ముందుకువెళతామన్నారు. గ్రూప్‌ఫ్లాగ్‌షిప్ కంపెనీ ఆదాని ఎంటర్‌ప్రైజెస్ వార్షిక నివేదిక విడుదలసందర్భంగా గౌతమ్ ఆదాని ప్రసంగించారు. వాటాదారులే మాకు బలమని వారి అభ్యున్నతి శ్రేయస్సుతోనే గ్రూప్‌ముందుకు పోతుందన్నారు. అమెరికా జస్టిస్ డిపార్టుమెంట్, యుఎస్ఎస్ఇసిసంస్థల ఆదాని గ్రీన్ ఎనర్జీపై చేసిన ఆరోపణలపై స్పందించిన గౌతమ్ ఆదాని ఇదేమీ కొత్తకాదని, ఇదే చివరి సమస్యకూడా కాదని, తరచూగా ఇలాంటి ఆరోపణలు వస్తూనే ఉన్నాయన్నారు. సవాల్లు ఎదురవుతున్నకొద్దీ మరింత బలవంతులవుతామని, ఆదానిగ్రూప్‌లో ఏ ఒక్కటికూడా విదేశీ అవినీతి కార్యాకలాపాల చట్టాన్ని ఉల్లంఘించలేదని, న్యాయవ్యవస్థను ఉల్లంఘించలేదని ఆదాని స్పష్టంచేసారు. మా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా ఉంటాయని, ఎలాంటి ఉల్లంఘనలకు తావులేదన్నారు. నౌకాశ్రయాలనుంచి ఎయిర్‌పోర్టులు, పునరుత్పత్తి విద్యుత్, డేటా సెంటర్లు, రక్షణరంగ ఉత్పత్తి, సిటీగ్యాస్‌లవరకూ విస్తరించిన కంపెనీ రానున్న రెండేళ్లలో మరింత విస్తరణ జరుగుతుందన్నారు.

# టాప్‌గేర్‌లో మహీంద్ర ఎస్‌యువి సేల్స్

**న్యూఢిల్లీ, జూన్ 1:** ఆటోమొబైల్ విక్రయాలు కొన్ని కంపెనీలు తగ్గితే మరికొన్ని కంపెనీలుమేనెలలో సేల్స్ పెంచుకోగలిగాయి. మహీంద్ర ఎస్‌యువి సేల్స్ 21శాతంపెరిగితే టాటా మోటార్స్ 10శాతం క్షీణించింది. అలాగే కియా సేల్స్ మేనెలలో పెరిగాయి. కారెన్స్ క్లావిస్ లాంచింగ్‌తో 22,315 యూనిట్లు విక్రయించింది. ఇక టివిఎస్ మోటార్‌కంపెనీ సేల్స్ 50శాతంపెరిగాయి. ఈవి సేల్స్ గణనీయంగా పెరిగినట్లుచెన్నై కంపెనీ ప్రకటించింది. టూవీలర్లు, త్రీవీలర్లు పెట్రోడీజిల్‌తో పాటు ఈవీలు కూడా పెరిగాయి. మొత్తం 4,31,275 యూనిట్లు అమ్మకాలు జరిగాయి. భారత్‌లో 3.13 లక్షలు విక్రయిస్తే ఎగుమతులు 1,18,437 యూనిట్లవరకూ పెరిగాయి. టూవీలర్లపరంగా మొత్తం 16శాతంపెరిగింది. 4,16,166 యూనిట్లు విక్రయించింది. 1,06,879 యూనిట్లు ఎగుమ తులు జరిగాయి. టయోటా కిర్లోస్కర్ యూనిట్లు22%పెరిగాయి. 30,864యూనిట్లు విక్రయిం చింది. ఇన్నోవ తయారీ కంపెనీ డీలర్‌షిప్‌లకు 29,280 యూనిట్లు పంపిణీచేసింది. ఇక టాటా సేల్స్ చూస్తే పడిపోయాయి. 8.6శాతం క్షీణించి 70,187 యూనిట్లకు చేరాయి. మొత్తంభారత్‌లో పదిశాతం తగ్గి 67,429 యూనిట్లు అమ్ముడుపోయాయి. సివి సేల్స్ ఐదుశాతం తగ్గి 28,147 యూనిట్లుకాగా మొత్తం ప్యాసింజర్‌వాహనాలు11శాతం క్షీణించి 42,040 యూనిట్లకుపడిపోయిం ది. మొత్తం ఈవీ అమ్మకాలు రెండుశాం క్షీణించి 5685 యూనిట్లకు క్షీణించింది. ఇక వమీంద్ర ఆటోమొబైల్స్ ఎస్‌యువిలు 21శాతంపెరిగి 52,431 యూనిట్లు విక్రయిస్తే ఎల్‌సీవీ వాహనాలు 8శాతంపెరిగి 21,391 యూనిట్లకు చేరింది.



# రూ.2.01 లక్షలకోట్లకు చేరిన జీఎస్టీ వసూళ్లు

**న్యూఢిల్లీ, జూన్ 1:** జీఎస్టీ స్థూల వసూళ్లు 16.4 శాతం పెరిగి మే నెలలో రూ.2.01 ట్రిలియన్లకు చేరుకున్నాయి. ఆదివారం విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో వస్తువులు మరియు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు తర్వాత ఇది జరిగింది, ఆ ఆదాయం రూ.2.37 ట్రిలియన్లకు చేరుకుంది. మే నెలలో, దేశీయ లావాదేవీల నుండి స్థూల ఆదాయం 13.7 శాతం పెరిగి దాదాపు రూ.1.50 ట్రిలియన్లకు చేరుకుంది, దిగుమతుల నుండి జీఎస్టీ ఆదాయం 25.2 శాతం పెరిగి రూ.51,266 కోట్లకు చేరుకుంది. మే నెలలో, స్థూల కేంద్ర జీఎస్టీ ఆదాయాలు రూ.35,434 కోట్లు, రాష్ట్ర జీఎస్టీఆదాయాలు రూ.43,902 కోట్లు మరియు ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ దాదాపు రూ.1.09 ట్రిలియన్లు. సెస్ నుండి ఆదాయం రూ.12,879 కోట్లు. మే, 2024లో, వసూళ్లు రూ.1,72,739 కోట్లు. వస్తువులు మరియు సేవల పన్ను, జీఎస్టీ కౌన్సిల్ తదుపరి సమావేశంలో రేటు హేతుబద్ధీకరణ అంశాన్ని చేపట్టనుంది ప్రభుత్వానికి జీవితేతర బీమా సంస్థలుఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు లెవీని కాకుండా, రెట్రోస్పెక్టివ్ 28!! బిళీగిని వ్యతిరేకిస్తున్నాయి. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు లెవీని కాకుండా, రెట్రోస్పెక్టివ్ 28% జీఎస్టీని వ్యతిరేకిస్తున్నాయి జిఎస్టీ రిజిస్ట్రేషన్‌ను సరళీకృతం చేయడానికి, అధికారిక ఓవర్‌రీచ్‌ను



అరికట్టడానికి కొత్త నియమాలను జారీ చేసింది. అదే సమయంలో, ఈ నెలలో మొత్తం వాపసులు 4 శాతం తగ్గి రూ. 27,210 కోట్లకు చేరుకున్నాయి. నికర జీఎస్టీ మాప్‌అప్ దాదాపు రూ. 1.74 ట్రిలియన్లు, ఇది సంవత్సరానికి 20.4 శాతం వృద్ధి. రాష్ట్రాల వారీగా జీఎస్టీ వసూళ్ల పెరుగుదలలో విస్తృత వైవిధ్యాలకు ప్రతి రాష్ట్రంలో ముఖ్యమైన రంగాలలో సమగ్ర విశ్లేషణ అవసరమని డెలాయిట్ ఇండియా భాగస్వామి మణి అన్నారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాలు 17 శాతం నుండి 25 శాతం వరకు వసూళ్ల పెరుగుదలను నివేదించగా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాలు 6 శాతం వరకు వసూళ్ల పెరుగుదలను నివేదించాయి.





# పది భారీ కంపెనీల్లో ఎల్ఐసి ఎంక్యాప్ టాప్!

**ముంబయి,జూన్ 1:** దేశంలోని టాప్ పది కంపెనీల టర్నోవర్ గత వారంలో భారీగా పెరిగింది. మొత్తం పది కంపెనీల టర్నోవర్ 1,01,369.5 కోట్లకు పెరిగినట్లు మార్కెట్‌నిపుణుల అంచనా. వీటిలోజీవితభీమా కార్పొరేషన్ అత్యంత భారీ ఎత్తున లాభపడింది. ఈక్విటీమార్కెట్లలో మందగమనం ఉన్నప్పటికీ కంపెనీలు మాత్రం టర్నోవర్ పెంచుకోగలిగాయి. గత వారం బిఎస్ఇ బెంచ్‌మార్క్ సూచీ 270.7 పాయింట్లు క్షీణించిన సంగతి తెలిసిందే. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్; భారతీయ స్టేట్‌బ్యాంకు, ఎల్ఐసిలు తమ మార్కెట్ విలువలపరంగా భారీగాపెరిగాయి. ఇక పోతే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్, హిందూస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సంస్థలు సమిష్టిగా 34,852.35 కోట్ల రూపాయలు నష్టపోయాయి. టాప్ పదికంపెనీల్లో ఎల్ఐసి టర్నోవర్ 59,233.61 కోట్లుపెరిగి 6,03,120.16 కోట్లకు చేరింది. భారతీయ స్టేట్‌బ్యాంకు 19,589 కోట్లుపెరిగి 7,25,036.13కోట్లకు చేరింది. ఇక భారతి ఎయిర్‌టెల్ ఎంకాప్ 14,084.2 కోట్లుపెరిగి 10,58,766.92 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు 8462.15కోట్లుపెరిగి 14,89,185.62 కోట్లకు చేరింది. ఇక క్షీణించిన మార్కెట్ విలువల్లో కంపెనీలు టిసిఎస్ ఎంకాప్ 17,909.53కోట్లు క్షీణించి 12,53,486.42కోట్లకు తగ్గింది. రిలయన్స్ 7645.85 కోట్లు క్షీణించి 19,22,693.71 కోట్లుగా నిలిచింది. బజాజ్‌ఫైనాన్స్ 4061.05 కోట్లు క్షీణించి 5,70,146.49 కోట్లకు చేరుకుంది. అలాగే ఐసిఐసిఐబ్యాంకు 2605.81 కోట్లు క్షీణించి 10,31,262.20 కోట్లకు ఎంకాప్‌చేరినట్లు తేలింది. ఇక హిందూస్థాన్ యూనిలీవర్‌సంస్థ 1973.66కోట్లు క్షీణించి 5,52,001.22కోట్లకు ఎంకాప్ నమోదయింది. ఇక ఇన్ఫోసిస్ కూడా 656.45కోట్లు తగ్గి 6,49,220.46 కోట్లకు చేరింది. ఇక అత్యంత విలువైన కంపెనీలుగా రిలయన్స్ ఇప్పటికీ టాప్‌లోనే ఉంది.

# మూడు విదేశీ ఏజెన్సీలతో 'ఇండిగో' ఒప్పందం





**ముంబయి, జూన్ 1:** భారత్ అతిపెద్ద ఎయిర్‌లైన్స్ సంస్థ ఇండిగో ఆదివారం ఎయిర్‌ఫ్రాన్స్ అలయన్స్‌తో ఒప్పందంచేసుకున్నట్లు ప్రకటించింది. వీటితోపాటే వర్జిన్ అట్లాంటిక్, డెల్టా ఎయిర్‌లైన్స్‌తో కూడా ఒప్పందాలుచేసుకున్నట్లు తెలిపింది. ఉత్తర అమెరికా, యూరోప్, బ్రిటన్ ప్రాంతాల్లో లాంగ్ హాల్ సేవలకోసం ఈ ఒప్పందాలుచేసుకున్నామని వివరించింది. దేశంలో ఇప్పటికే విస్తృత నెట్‌వర్క్ ఉన్న ఇండిగో ఇపుడు విదేశీ ఒప్పందాలతో మరింత విస్తరణదిశగా వెళుతోంది. భాగస్వామ్యం పూర్తయితే ఇండిగో తన సొంతపేరుపైనే విమానాలు అమ్మేస్థితికి వస్తుంది. విదేశాల్లో తమ భాగస్వాములు నిర్వహించే వాటిని తన సొంతబ్రాండ్‌పేరుపైనే లావాదేవీలు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. ఆమ్‌స్టర్‌డామ్, మాంచెస్టర్‌లతోపాటు యూరోప్, ఉత్తర అమెరికాలకు ఎంపికచేసిన విమానసర్వీసులు కూడా కొనసాగుతాయి. ప్రస్తుతం ఎయిర్‌ఫ్రాన్స్ కెఎల్ఎం, వర్జిన్ అట్లాంటిక్, డెల్టా భాగస్వామ్యంతో కొనసాగుతోంది. అమెరికా విమానసంస్థ డెల్టా కరోనా మహమ్మారి కాలంనుంచి కూడా భారత్‌కు సర్వీసులు నడపడంలేదు. కంపెనీ సిఇఒ ఇటీవల ఢిల్లీలోజరిగిన సదస్సులో మాట్లాడుతూ డెల్టా డైరెక్ట్ సర్వీసులును భారత్‌కు ప్రారంభిస్తుందని, వచ్చే రెండేళ్లలోనే అమెరికానుంచి నేరుగాభారత్‌కు విమానసర్వీసులు నడుపుతామని ప్రకటించారు. అంతేకాకుండా డెల్టా నాన్‌స్టాప్ విమానసర్వీసులను అట్లాంటానుంచి ఢిల్లీకి నడిపేందుకు యోచనచేస్తోంది. అయితే ఇందుకు భారత్ ప్రభుత్వం ఆమోదం రావాల్సి ఉంది. ఎయిర్‌ప్యాసింజర్ల మార్కెట్‌లో భారత్‌మూడో అతిపెద్ద దేశంగా ఉంది. దేశంలోకూడా తన ఏవియేషన్‌రంగాన్ని శరవేగంగా విస్తరిస్తోంది.

# భారత్ మార్కెట్‌పైనే బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఫోకస్





**న్యూఢిల్లీ, జూన్ 1:** వందేళ్లనుంచి భారత్‌కు సర్వీసులు నడుపుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ మరింత విస్తరణదిశగా వెళుతోంది. అలాగే భారత్‌నుంచి కార్గో రంగంలో కూడా మరింత విస్తరించేందుకు నిర్ణయించింది. భారత్ బ్రిటన్ స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంద్వారా బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ భారత్‌లోని అవకాశాలను అందిపుచ్చుకోవాలనిచూస్తోంది. కంపెనీ సిఇఒ సీన్ డోయెల్ మాట్లాడుతూ ప్రస్తుతం వారంలో 56 సర్వీసులు నేరుగా బ్రిటన్‌కు నడుపుతోంది. ఐదు భారత్‌నగరాలనుంచి నడుస్తున్నాయి. వారానికి మూడు సర్వీసులు ముంబయినుంచి, ఢిల్లీనుంచి రెండు రోజువారి సర్వీసులు నడుపుతుండగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లనుంచి ప్రతిరోజూ విమానసర్వీసులు వెళుతున్నాయి. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు భారత్ అతిముఖ్యమైన మార్కెట్ అన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని రూట్లు పెంచుకుంటామని, విమానసర్వీసులు కూడా పెంచుకుంటామని ధీమా వ్యక్తంచేసారు. ముంబయి లండన్ హీత్రో రూట్‌లో ఫస్ట్‌క్లాస్ సీట్లను ఈ ఏడాది అక్టోబరునుంచి ప్రారంభిస్తోంది. ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీప్రారంభించనున్నది. బ్రిటిష్ ఎయిర్‌వేస్ తరపున భారత్‌లో 2500 మందిపనిచేస్తున్నారని, అమెరికా బయట మాకు భారత్ అతిపెద్ద మార్కెట్ అని డోయెల్ అన్నారు. వచ్చే దశాబ్దకాలంలో ట్రావెల్ డిమాండ్ రెట్టింపు అవుతుందని, భారత్‌లో మరింత వేగంగా పెరుగుతోందని ఆయన అంచనావేసారు. మధ్యతరగతి ప్రజలు కూడా విమానప్రయాణాలవైపే ఎక్కువ మొగ్గుచూపుతున్నందున విమానయాన మార్కెట్ టర్నోవర్ మరింత విస్తరిస్తుందని అన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps